**ప్రజలకు / పాఠకులకు ముఖ్య విజ్ఞప్తి**

"ప్రజాప్రశ్న" దినపత్రిక పేరు చెప్పుకొని ఎవరైనా డబ్బులు, విరాళాలు, ప్రకటనల పేరుతో నగదు లేదా ఇతర రూపంలో డిమాండ్ చేస్తే దయచేసి నమ్మవద్దు.

అలాంటి వ్యక్తుల వివరాలను వెంటనే మా దృష్టికి తీసుకురండి. ప్రజల ఫిర్యాదు అందిన వెంటనే సంబంధిత వ్యక్తులపై పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేసి చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుంది.

- ప్రజాప్రశ్న యాజమాన్యం

PRAJA PRASHNA

# ప్రజాప్రశ్న

RNI : TELTEL/2021/80267 తెలుగు దినపత్రిక

సంపుటి: 6 సంచిక: 56, పేజీలు - 08

శనివారం, ఆగష్టు 22, 2026 వెల: 5 రూ/.

హైదరాబాద్ | ప్రజల పక్షాన ప్రశ్నించే పత్రిక | HYDERABAD




# ఫిరాయింపు ఎమ్మెల్యేల తీవ్ర నైరాశ్యం.?

## - పార్టీ మారిన గులాబీ నేతల భవిష్యత్తు ఏంటి.?



**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** తెలంగాణ రాజకీయాల్లో గత రెండేళ్ల క్రితం బీఆర్ఎస్ వీడి అధికార కాంగ్రెస్ గూటికి చేరిన 10 మంది ఫిరాయింపు ఎమ్మెల్యేల పరిస్థితి ఇప్పుడు అటు ఇటు కాకుండా తయారైందనే చర్చ గాంధీ భవన్, తెలంగాణ పొలిటికల్ సర్కిల్స్‌లో జోరుగా సాగుతోంది. 2024 లోక్‌సభ ఎన్నికల ముందు, ఆ తర్వాత తాము గెలిచిన నియోజకవర్గాల్లో పట్టు సాధించడానికో, పవర్ సెంటర్‌కు దగ్గరగా ఉండటానికో దానం నాగేందర్, పోచారం శ్రీనివాస్ రెడ్డి, అరికెపూడి గాంధీ, ప్రకాష్ గౌడ్ వంటి కీలక నేతలు గులాబీ జెండా పక్కనపెట్టి కాంగ్రెస్ కండువా కప్పుకున్నారు. అయితే, రెండేళ్లు గడిచేసరికి అధికార పార్టీలో చేరి పెద్ద తప్పు చేశామా అనే ఆవేదన వారిలో కనిపిస్తోంది.

### ఏ భరోసా ఇవ్వని కాంగ్రెస్

కాంగ్రెస్ నాయకత్వం ఈ ఫిరాయింపు ఎమ్మెల్యేలకు అనుకున్న స్థాయిలో రాజకీయ భద్రతగానీ, న్యాయపరమైన రక్షణగానీ కల్పించలేకపోయిందనేది ప్రధాన ఆరోపణ. వారు కాంగ్రెస్ లో చేరలేదని చెప్పి అనర్హత వేటు నుంచి తప్పించారు కానీ రాజకీయంగా గ్యారంటీ ఇవ్వలేకపోయారు. ఈ పరిణామం వల్ల కాంగ్రెస్ పార్టీకి కూడా పెద్ద రాజకీయ నష్టం వాటిల్లింది. పార్టీలో చేరితే రాజభవనం లాంటి గౌరవం ఇస్తాం, పదవులిస్తాం అని నమ్మబలికి పిలుచుకున్న పెద్దలు తీరా న్యాయపరమైన అడ్డంకులు ఎదురుకాగానే తమను ఒంటరిని చేశారనే భావన ఫిరాయింపు నేతల్లో బలపడింది. దానం నాగేందర్ వంటి నేతలు బహిరంగంగానే

2లో..

## డీలిమిటేషన్ కు లైన్ క్లియర్,

# కేంద్రం లెక్క పక్కా

## - ఆ మీటింగ్ తో సీన్ ఛేంజ్



**న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్)** జాతీయ రాజకీయాల్లో కీలక పరిణామాలు చోటు చేసుకుంటున్నాయి. కొత్త సమీకరణాలు తెర మీద కు వస్తున్నాయి. ఇప్పటి వరకు పెండింగ్ లో ఉన్న మహిళా రిజర్వేషన్లు, డీలిమిటేషన్ పైన మరో సారి కేంద్రం వేగంగా పావులు కదుపుతోంది. ఎలాగైనా ఈ బిల్లులను ఆమోదించుకోవాలని కొత్త ప్రయత్నాలు చేస్తోంది. అందులో భాగంగా తాజాగా కొత్త లెక్కలు కలిసి వస్తున్నాయి. దీంతో, ప్రత్యేక పార్లమెంట్ సమావేశాలు ఏర్పాటు చేసి బిల్లుల ఆమోదానికి కసరత్తు మొదలైంది. కేంద్రం మరోసారి మహిళా

2లో..

## సీఎం రేవంత్ రెడ్డి

# అమెరికా పర్యటన రద్దు

## - అనుమతి నిరాకరించిన కేంద్రం

- రేపు లండన్ నుంచి హైదరాబాద్ చేరుకోనున్న సీఎం
- అమెరికా భేటీలకు అధికారులను పంపే అవకాశం
- 'తెలంగాణ రైజింగ్' ఆగదని సీఎం స్పష్టీకరణ



**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అమెరికా పర్యట రద్దైంది, కేంద్రం సీఎం అమెరికా పర్యటనకి అనుమతి నిరాకరించడంతో ఈ నిర్ణయం తీసుకున్నారు. తెలంగాణ సీఎంవో రేవంత్ బ్రిటన్, అమెరికా దేశాల్లో ఈనెల 20 నుంచి 29 వరకు పర్యటించేందుకు అనుమతి ఇవ్వాలని లేఖ రాసింది. కానీ కేంద్ర విదేశాంగ శాఖ లండన్ పర్యటనకు అనుమతించింది, దీంతో రేవంత్ లండన్ వెళ్లారు. ఆదివారం రోజు లండన్ నుంచి అమెరికాలోని బోస్టన్ వెళ్లేందుకు ప్లాన్ చేయగా కేంద్రం

2లో..

## నా టార్గెట్ రేవంత్ రెడ్డి.. కాంగ్రెస్ పార్టీ కాదు

### - కొండా సుస్మిత సంచలన వ్యాఖ్యలు




**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** కాంగ్రెస్ పార్టీలో కొండా సుస్మిత వ్యాఖ్యల దుమారం చిలికి చిలికి గాలివానగా మారింది. మంత్రి కొండా సురేఖ కుమార్తె కొండా సుస్మిత తన ఇటీవల తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి పైన అనుచిత వ్యాఖ్యలు చేశారు. రేవంత్ రెడ్డి కళ్ళు నెత్తికెక్కాయని,

2లో..

# బలగం బరిలోకి దిగుతుందా.?

## - టీడీపీకి లోకల్ ఫీవర్.?

**అమరావతి (ప్రశ్న న్యూస్)** ఆంధ్రప్రదేశ్‌లో త్వరలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికలు తెలుగుదేశం పార్టీ (టీడీపీ) ప్రభుత్వానికి ప్రతిష్టాత్మకంతో పాటు ఎంతో సవాల్ గా మారనున్నాయి. అసెంబ్లీ ఎన్నికల్లో ఘన విజయం సాధించిన కూటమి ప్రభుత్వం, ఇప్పుడు గ్రామం నుంచి మున్సిపల్ స్థాయి వరకు పార్టీ యంత్రాగాన్ని బలోపేతం చేయాల్సిన అవసరం ఉంది. కూటమి ప్రభుత్వం ఏర్పాటయి రెండేళ్లు కావస్తుంది. కార్యకర్తల్లో ఎన్నికలకు ముందు ఉత్సాహం లేదు. పదవులు లేవు. వారికి సరైన పనులు దక్కడం లేదు. ఇప్పటికీ అనేక నియోజకవర్గాల్లో వైసీపీ నేతలదే పెత్తనమని కార్యకర్తల నుంచి ద్వితీయ శ్రేణి నేతల వరకూ భావిస్తున్నారు. వీరు స్థానిక సంస్థల ఎన్నికల్లో ఎంత మేరకు కమిట్ మెంట్ తో పనిచేస్తారన్నది మాత్రం లోలోపల పార్టీ నేతలకు కూడా సందేహంగానే కనిపిస్తుంది.

### అప్పుడు అలా.. ఇప్పుడు మరొకలా..

తెలుగుదేశం పార్టీ అధికారంలోకి రాకముందు ఒకలా వచ్చిన తర్వాత మరొకలా వ్యవహరిస్తుంది. గత సాధారణ ఎన్నికల్లో ప్రాణాలకు తెగించి పోలింగ్ కేంద్రాల వద్ద కార్యకర్తలు పోరాడారు. కానీ అధికారంలోకి వచ్చిన తర్వాత మాత్రం పార్టీ కోసం కష్టపడిన కార్యకర్తలను పట్టించుకోవడం లేదు. ముఖ్యంగా పార్టీ అగ్రనాయకత్వం హెచ్చరికలు చేస్తున్నా అత్యధిక సంఖ్యలో ఉన్న టీడీపీ శాసనసభ్యులు తమకు ఆర్థిక ప్రయోజనాలు చేకూర్చే వారికే పనులు కట్టబెడుతున్నారు కానీ, పార్టీ కోసం పనిచేసిన కార్యకర్తల కష్టాన్ని మాత్రం గుర్తించడం లేదన్న అభిప్రాయం ఉంది. అధికారంలోకి వచ్చిన తర్వాత తమకు ఒరిగిన ప్రయోజనమేమీ లేదని బహిరంగంగానే

2లో..



# స్థానిక ఎన్నికల కోసం జనసేన కమిటీ

## - 14 మందితో కమిటీ నియమించిన పవన్ కళ్యాణ్

**అమరావతి (ప్రశ్న న్యూస్)** స్థానిక సంస్థల ఎన్నికలపై జనసేన పార్టీ ప్రత్యేక దృష్టి సారించింది. ఈ విషయమై జనసేన అధినేత పవన్ కళ్యాణ్ గురువారం ముఖ్య నేతలతో చర్చించారు. తాజాగా స్థానిక సంస్థల ఎన్నికల విధి విధానాల రూపకల్పనకు 14 మందితో ప్రత్యేక కమిటీని పవన్ కళ్యాణ్ ఏర్పాటు చేశారు. ఈ కమిటీ స్థానిక సంస్థల ఎన్నికల్లో అనుసరించాల్సిన విధి విధినాలు, క్షేత్రస్థాయిలో పార్టీ శ్రేణుల ఆలోచనలను పరిగణనలోకి తీసుకుంటుంది. కమిటీలో మండలి బుద్ధ ప్రసాద్, టి.శివశంకర్, కందుల దుర్గేష్, వల్లభనేని బాలశౌరి, బొలిశెట్టి శ్రీనివాస్, దేవ వరప్రసాద్, సీహెచ్ వంశీకృష్ణ యాదవ్, లోకం మాధవి, పత్సమట్ల ధర్మరాజు, చిలకం మధుసూదన్ రెడ్డి, కొటికలపూడి గోవిందరావు, సామినేని ఉదయభాను, యనమల భాస్కర్, కొరికాన రవికుమార్ సభ్యులుగా ఉంటారని జనసేన పార్టీ అధికారికంగా ప్రకటించింది.అయితే 14 మంది సభ్యులతో కూడిన ఈ కమిటీలో మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డి పేరు లేకపోవటంపై సోషల్ మీడియాలో చర్చ జరుగుతోంది. మరోవైపుబాలినేని శ్రీనివాసరెడ్డికి జనసేన జాయినింగ్స్ కమిటీ, అలాగే స్థానిక సంస్థల ఎన్నికలు, డీలిమిటేషన్‌కు సంబంధించి ప్రకాశం, నెల్లూరు,

2లో..



# రాయదుర్గం భూములకు రికార్డు ధర

## - టీజీఐఐసీ వేలంలో రూ.264 కోట్లు పలికిన ఎకరా భూమి - హైదరాబాద్ చరిత్రలో ఇదే అత్యధికం

**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** హైదరాబాద్ రియల్ ఎస్టేట్ మార్కెట్‌లో మరో సంచలన రికార్డు నమోదైంది.ఐటీ కారిడార్‌లో అత్యంత కీలక ప్రాంతమైన రాయదుర్గంలో ఎకరం భూమి ఏకంగా రూ.264 కోట్లకు అమ్ముడై అందర్నీ షాక్‌కు గురి చేస్తోంది. తెలంగాణ ఇండస్ట్రియల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్ (టీజీఐఐసీ) నిర్వహించిన ఈ-వేలంలో ఈ ధర పలకడం ప్రస్తుతం హైదరాబాద్ రియల్ ఎస్టేట్ రంగంలో హాట్‌టాపిక్‌గా మారింది. రంగారెడ్డి జిల్లా శేరిలింగంపల్లి మండలం రాయదుర్గం పాన్‌మక్తాలోని సర్వే నంబర్ 83/1లో 5.25 ఎకరాల భూమికి టీజీఐఐసీ శుక్రవారం ఆన్‌లైన్ వేలం నిర్వహించింది. ఈ వేలంలో ఎంఎస్ఎన్ రియాలిటీ సంస్థ అత్యధికంగా బిడ్ వేసి మొత్తం 5.25 ఎకరాలను దక్కించుకున్నట్లు సమాచారం. ఎకరం భూమికి రూ.264 కోట్ల ధర పలికింది. అంటే 5.25 ఎకరాలకు లెక్కిస్తే మొత్తం విలువ

2లో..




## పర్యటన హోదాకు, ఉద్దేశానికి

# తగినట్లు లేదు

## - రేవంత్ రెడ్డి అమెరికా టూర్ అందుకే రద్దు చేశాం



న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్) ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రతిపాదించిన అమెరికా టూర్ రద్దు కావడం తెలంగాణలో తీవ్ర రాజకీయ దుమారంరేపుతోంది. అధికార కాంగ్రెస్, ప్రతిపక్ష బీజేపీ నేతల మధ్య తీవ్ర మాటల యుద్ధం కొనసాగుతోంది. కేంద్ర ప్రభుత్వం ఉద్దేశపూర్వకంగానే సీఎం పర్యటనకు అనుమతులు ఇవ్వడం లేదని కాంగ్రెస్ నేతలు విమర్శలు గుప్పిస్తుండగా.. రేవంత్ రెడ్డి తన సొంత కారణాలతోనే టూర్ రద్దు చేసుకున్నారని బీజేపీ నేతలు కౌంటర్ ఇస్తున్నారు. అదే సమయంలో దేశవ్యాప్తంగానూ ఈ వ్యవహారంపై తీవ్ర చర్చ జరుగుతున్న వేళ ఈ రాజకీయ దుమారానికి కేంద్ర విదేశాంగ శాఖ తెరదించింది. ముఖ్యమంత్రి స్థాయి ప్రముఖులు విదేశీ

2లో..

## తెలంగాణ మెడికల్ సీట్లు

# ఇతరులకా.?

## - జీవో 150తో నీట్ విద్యార్థులకు అన్యాయం
## - 1600 మెడికల్ సీట్లు పోతాయని కవిత ఆవేదన

**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** తెలంగాణలో నీట్ విద్యార్థుల స్థానికత అంశం మరోసారి రాజకీయంగా తీవ్ర చర్చనీయాంశంగా మారింది. రేవంత్ రెడ్డి ప్రభుత్వం తీసుకొచ్చిన జీవో 150తో తెలంగాణ విద్యార్థులకు తీవ్ర అన్యాయం జరుగుతుందని తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత తీవ్ర ఆరోపణలు గుప్పించారు. ఈ జీవో 150పై నీట్ అభ్యర్థులు, వారి తల్లిదండ్రులు తీవ్ర ఆందోళన చెందుతున్నారని

2లో..




# ఆక్స్‌ఫర్డ్‌లో సీఎం రేవంత్‌రెడ్డి

## - 900 ఏళ్ల ఘనమైన చరిత్ర



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) తెలంగాణను ప్రపంచ స్థాయి నాలెడ్జ్ హబ్‌గా తీర్చిదిద్దే లక్ష్యంతో విదేశీ పర్యటనకు వెళ్లిన ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని ఉన్నత స్థాయి ప్రతినిధి బృందం యునైటెడ్ కింగ్‌డమ్ (యూకే)లో పర్యటిస్తోంది. ప్రపంచంలోనే అత్యంత పురాతన, ప్రతిష్ఠాత్మక విద్యాసంస్థల్లో ఒకటైన ఆక్స్‌ఫర్డ్ యూనివర్సిటీని ముఖ్యమంత్రి సందర్శించారు. దాదాపు 900 ఏళ్ల ఘనమైన చరిత్ర కలిగిన ఈ విశ్వవిద్యాలయంలోని 'బ్లావాట్‌నిక్ స్కూల్ ఆఫ్ గవర్నమెంట్'ను సందర్శించి, ప్రొఫెసర్ మాయా ట్యూడర్, ప్రొఫెసర్ ఫైసల్ దేవ్జీలతో పాలన, విద్య, ప్రజా విధానాలపై విస్తృతంగా చర్చించారు. భారత మాజీ ప్రధాని ఇందిరా గాంధీ చదువుకున్న ఈ విశ్వవిద్యాలయంతో భారత్‌కు ఉన్న అనుబంధాన్ని

2లో..

## ఫిరాయింపు ఎమ్మెల్యేల తీవ్ర నైరాశ్యం.?

తమ అసంతృప్తిని వెళ్లగక్కడం, అరికెపూడి గాంధీ వంటి వారు సాంకేతికంగా తాము బీఆర్ఎస్‌లోనే ఉన్నామని చెప్పుకోవాల్సిన  స్థితి రావడమే ఇందుకు నిదర్శనం. కాంగ్రెస్ డిఫెన్స్‌లో పడటంతో, ఈ నేతలకు ఏ రకమైన మంత్రిపదవులు గానీ, సమర్థవంతమైన రాజకీయ రక్షణగానీ కల్పించలేకపోయింది.

### కాంగ్రెస్‌లో చేరికలు కష్టమే!

ఈ ఉదంతం తెలంగాణ వ్యాప్తంగా ఒక బలమైన పొలిటికల్ మెసేజ్‌ను పంపించింది. ఇకపై బీఆర్ఎస్ నుంచి గానీ, ఇతర పార్టీల నుంచి గానీ కాంగ్రెస్‌లోకి చేరేందుకు ఏ నేతా సాహసించే పరిస్థితి లేకపోవడం అసలు సిసలైన పరిణామం. రాజకీయ భవిష్యత్ కోల్పోతామనే భయం మిగిలిన నేతలకు స్పష్టంగా అర్థమైపోయింది. దీంతో ఇతర పార్టీల నుంచి కాంగ్రెస్‌లోకి రాకపోకలు దాదాపుగా స్తంభించిపోగా, రాబోయే రోజుల్లో న్యాయపరమైన తీర్పుల ఆధారంగా లేదా రాజకీయ పరిణామాల వల్ల కాంగ్రెస్ నుంచి తిరిగి పాత గూటికి లేదా బీజేపీ వైపు వాళ్లే వారి సంఖ్య ఎక్కువగా ఉండవచ్చు.

### బీఆర్ఎస్‌లోకి ఇక వెళ్లలేరు!

క్షేత్రస్థాయిలో అసమ్మతి కూడా ఈ నేతల మెడకు చుట్టుకుంది. దశాబ్దాలుగా కాంగ్రెస్ జెండా మోసిన పాత నాయకులు, టికెట్లు ఆశించి భంగపడిన స్థానిక నేతలు ఈ  గులాబీ వలసదారులను తమ నియోజకవర్గాల్లో కలుపుకుపోవడానికి అస్సలు ఇష్టపడటం లేదు. ఫలితంగా, ఫిరాయింపు ఎమ్మెల్యేలు ఇటు కాంగ్రెస్‌లో ఇమడలేక, అటు బీఆర్ఎస్‌కు ముఖం చూపించలేక తీవ్ర మానసిక నలిగిపోతున్నారు. ప్రభుత్వం వద్ద తమ పనులు కాకపోవడం, అధికారులపై పట్టు తగ్గడంతో సొంత కేడర్‌ను కూడా కాపాడుకోలేకపోతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యేల చేరికల విషయంలో కాంగ్రెస్ అనుసరించిన  అరకొర వ్యూహం  ఆ పార్టీకే ఎదురుదెబ్బగా మారింది. చట్టపరమైన లొసుగులను సరిగ్గా అంచనా వేయకుండా, కేవలం సంఖ్యాబలం ప్రదర్శించాలనే తొందరపాటులో తీసుకున్న ఈ నిర్ణయం వల్ల ఫిరాయింపు నేతల రాజకీయ భవిష్యత్తు ప్రశ్నార్థకంలో పడింది.

డీలిమిటేషన్ కు లైన్ క్లియర్,
కేంద్రం లెక్క పక్కా

రిజర్వేషన్లు, డీలిమిటేషన్ బిల్లు ఆమోదం కోసం కసరత్తు వేగవంతం చేసింది. పార్లమెంట్ వర్షాకాల సమావేశాల్లో ఈ బిల్లుల ఆమోదం కోసం ప్రయత్నాలు జరిగాయి. అయితే, జంతర్ మంతర్ వద్ద జెన్ జీ నిరసనలు, ఉప ఎన్నికల్లో ప్రశాంత్ కిషోర్ గెలుపు, విపక్ష పార్టీలు తమ డిమాండ్ల కోసం పట్టుబడటంతో సాధ్యం కాలేదు. శివసేన (ఠాకరే), టీఎంసీ, ఆప్ నుంచి చీలిక వర్గం ఎంపీ ల మద్దతుతో బిల్లును ఆమోదించేలా బీజేపీ ముఖ్య నేతలు ప్రణాళికలతో సిద్దమయ్యారు. ఇండి కూటమి కీలక నేత శరద్‌పవార్‌తో ప్రధాని మోదీ ఇటీవల భేటీ కావటం వంటి పరిణామాలు, ఈ బిల్లుల ఆమోదానికి అవసరమైన బలాన్ని ఎన్‌డీఏ సమకూర్చుకుంటుందన్న వాతావరణాన్ని సృష్టించాయి. అయితే, అనూహ్యంగా ఆవిర్భవించిన కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) సారథ్యంలో జరిగిన జెన్‌జీ ఉద్యమం, కేంద్రమంత్రి ధర్మేంద్రప్రధాన్ రాజీనామాతో కేంద్రం అంచనాలు తప్పాయి.

### ప్రత్యేక సమావేశాల నిర్వహణ దిశగా

కాగా మారుతున్న రాజకీయ లెక్కల వేళ కేంద్రం ఆలోచన మారినట్లు తెలుస్తోంది. ప్రస్తుత పరిస్థితుల్లో డీలిమిటేషన్, మహిళా రిజర్వేషన్ బిల్లులను ముందుకు తీసుకెళ్లటం కోసం దక్షిణాది పార్టీల పైన ఫోకస్ చేసింది. డీఎంకే మద్దతు ఇస్తే బిల్లు పాస్ చేసుకోవటం సులభంగా మారుతుందని భావిస్తోంది. దీంతో దక్షిణాదికి ఎలాంటి నష్టం లేకుండా బిల్లులో స్పష్టత ఇస్తామని డీఎంకే కు సమాచారం ఇచ్చినట్లు తెలుస్తోంది. కాంగ్రెస్ తో విభేదించిన డీఎంకే ఇప్పుడు కేంద్రం నుంచి దక్షిణాదికి నష్టం లేకపోతే మద్దతు ఇచ్చే అంశం పైన పరిశీలన చేస్తున్నట్లు సమాచారం. దీని పైన స్పష్టత రాగానే ప్రత్యేక పార్లమెంట్ సమావేశాల నిర్వహణకు కేంద్రం సిద్ధం అవుతోంది. కాగా పార్లమెంట్ సమావేశాలు ఇప్పటికీ నిరవధికంగా వాయిదా పడలేదు. కేంద్రం చేస్తున్న ప్రయత్నాలు పార్టీల్లో చీలిక వర్గాలు మారిన ఎంపీల మద్దతు ప్రతిపక్షం తాజా నిర్ణయాల వేళ ప్రత్యేక పార్లమెంట్ సమావేశాలు బిల్లుల ఆమోదం వ్యవహారంలో ఎలాంటి పరిణామాలు చోటు చేసుకుంటాయి ఏం జరుగుతుందనే ఉత్కంఠ కొనసాగుతోంది.

## బలగం బరిలోకి దిగుతుందా.?

పార్టీ కార్యకర్తలుసోషల్‌మీడియాద్వారావాపోతున్నారు. కానీ వారి గోడును మాత్రం పట్టించుకోవడం లేదు. కూటమి నేతల మధ్య సయోధ్య లేకపోవడం కూడా మరొక తలనొప్పిగా తయారు కావచ్చు.

### ఎమ్మెల్యేలపై ఆరోపణలు..

మరొకవైపు ఎమ్మెల్యేల అవినీతి, అక్రమాలను కూడా చూసీ చూడనట్లు పార్టీ నాయకత్వం వదిలేస్తుండటాన్ని కార్యకర్తలు ఆగ్రహంతో ఉన్నారు. టీడీపీకి బూత్ లెవెల్ లో భారీ బలగం ఉన్నప్పటికీ స్థానిక సంస్థల ఎన్నికల్లో ఎంత మేరకు కసి తీరా పనిచేస్తుందన్నది మాత్రం సందేహంగానే ఉంది. మరొకవైపు ప్రత్యక్ష ఎన్నికల విధానం కూడా పార్టీకి నష్టం తెచ్చి పెడుతుందని అంటున్నారు. బీసీ నినాదం ఎత్తుకున్నా అవి న్యాయస్థానాలు ఎంత మేరకు అంగీకరిస్తాయన్నది కూడా అనుమానమే. ఇప్పటికే రిజర్వేషన్లపై హైకోర్టు చేసిన వ్యాఖ్యలు చూస్తే 34 శాతం బీసీ రిజర్వేషన్లతో ఈ ఎన్నికలకు వెళ్లే అవకాశాలు కనిపించడం లేదు. స్థానిక సంస్థల్లో 34శాతం బీసీ రిజర్వేషన్ల అమలును ప్రతిష్టాత్మకంగా తీసుకున్నప్పటికీ, న్యాయపరమైన చిక్కులు రాకుండా ఎన్నికలు నిర్వహించడం ప్రభుత్వానికి పెద్ద సవాల్. అయితే 16వ ఆర్థిక సంఘం నిధులను పొందడానికి, సకాలంలో స్థానిక సంస్థల పాలనను పునరుద్ధరించడం కోసం ఎన్నికలు నిర్వహించడం అవసరం. అందుకే స్థానిక సంస్థల ఎన్నికలు టీడీపీకి ఛాలెంజ్ అనే చెప్పాలి.

## నా టార్గెట్ రేవంత్ రెడ్డి.. కాంగ్రెస్ పార్టీ కాదు

తన తండ్రి కొండా మురళికి ఇంతవరకు ఎమ్మెల్సీ ఇవ్వలేదని, కనీసం కలవడానికి అపాయింట్మెంట్ కూడా ఇవ్వడం లేదంటూ సంచలన వ్యాఖ్యలు చేశారు. అసలు రెండేళ్ల ముందే పరకాల సీటును అనౌన్స్ చేయడానికి రేవంత్ రెడ్డి ఎవరు అంటూ ప్రశ్నించారు. రేవంత్ రెడ్డి కుటుంబం చేసిన అవినీతిని బయట పెడతానని సంచలన వ్యాఖ్యలు చేశారు. దీంతో కాంగ్రెస్ అధిష్టానం సీరియస్ అయి కొండా సురేఖకు షోకాజ్ నోటీసులు జారీ చేసింది. అయితే తన కూతురు చేసిన వ్యాఖ్యలతో తనకు ఎటువంటి సంబంధం లేదని కొండా సురేఖ సమాధానమిచ్చింది. ఈ క్రమంలో కొండా సుస్మిత కూడా తాను చేసిన వ్యాఖ్యలపై స్పష్టత ఇచ్చారు."నా టార్గెట్ రేవంత్ రెడ్డి.. కాంగ్రెస్ పార్టీ కాదు" అని ఆమె స్పష్టం చేశారు. తాను కాంగ్రెస్ పార్టీని విమర్శించలేదని, కేవలం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని, ఆయన సోదరులను విమర్శించానని తెలిపారు.రాహుల్ గాంధీ, సోనియా గాంధీ అంటే తనకు గౌరవం ఉందని సుస్మిత అన్నారు. అయితే ఇక్కడ రేవంత్ రెడ్డి, ఆయన సోదరులు విపరీతమైన అవినీతి, అక్రమాలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. అందుకే తాను ఆయన్ను టార్గెట్ చేశానని చెప్పారు. ఎమ్మెల్యే అభ్యర్థులను ప్రకటించడానికి ఆయనకు ఎలాంటి అధికారం ఉందని ప్రశ్నించారు.పరకాల స్థానం నుంచి తాను పోటీ చేస్తానని, అవసరమైతే స్వతంత్ర అభ్యర్థిగా కూడా బరిలోకి దిగేందుకు సిద్ధమని సుస్మిత స్పష్టం చేశారు. నిన్న రాత్రి ఆమె మరోసారి వివరణ ఇస్తూ, తాను చేసిన వ్యాఖ్యలకు మంత్రి కొండా సురేఖకు ఎలాంటి సంబంధం లేదని, అవి పూర్తిగా తన వ్యక్తిగత అభిప్రాయాలని తెలిపారు.ఈ వ్యాఖ్యలు తెలంగాణ కాంగ్రెస్‌లో తీవ్ర చర్చనీయాంశంగా మారాయి. ఇక ఈ అంశం పైన సీరియస్ గా ఉన్న రేవంత్ రెడ్డి చర్యలు తీసుకోవాలని నిర్ణయించారు. ఈ క్రమంలోనే ఆయన అమెరికా పర్యటనను కూడా రద్దు చేసుకొని ఆగస్టు 23వ తేదీన హైదరాబాద్ కు రానున్నట్లు తెలుస్తోంది. కొండా సుస్మిత వ్యాఖ్యలపై ఉపముఖ్యమంత్రి, కొందరు మంత్రులతో మాట్లాడిన సీఎం తిరిగి వచ్చిన తర్వాత కీలక నిర్ణయం తీసుకునే అవకాశం ఉందని పార్టీ శ్రేణుల్లో చర్చ జరుగుతోంది. అయితే సుస్మిత వ్యక్తిగతంగా మాట్లాడినప్పటికీ, ఈ వివాదం తెలంగాణ రాష్ట్ర రాజకీయాలను మరింత వేడెక్కించింది.

## సీఎం రేవంత్ రెడ్డి అమెరికా పర్యటన రద్దు

అనుమతి నిరాకరించింది. దీంతో సీఎం రేవంత్ రెడ్డి పర్యటనను రద్దు చేసుకున్నారు ప్రస్తుతం లండన్‌లో ఉన్న ఆయన లండన్‌లో పర్యటిస్తారు. అనంతరం లండన్ పర్యటన ముగించుకుని ఈ నెల 23న హైదరాబాద్ తిరిగి రానున్నారు. అమెరికా పర్యటనకు కేంద్రం అనుమతి నిరాకరించడంపై రేవంత్ రెడ్డి స్పందించారు. కేంద్రం తన పర్యటనకు అనుమతులు నిరాకరించిన మాత్రాన తెలంగాణ ప్రగతి ఆగదన్నారు. రాష్ట్ర శ్రేయస్సే తమ ప్రాధాన్యమని పెట్టుబడులు తీసుకురావడమే లక్ష్యమన్నారు. రాజకీయ కోణంలో తన పర్యటనకు కేంద్రం అనుమతి నిరాకరించిందని రేవంత్ అంటున్నారు. తెలంగాణకు అత్యుత్తమ విద్యా సంస్థల్ని తీసుకురావాలని అనుకున్నానని అందుకే అమెరికా పర్యటనకు వెళ్లాలని ప్లాన్ చేసుకున్నట్లు చెప్పుకొచ్చారు. తన విదేశీ పర్యటన వికసిత్ భారత్‌కు కూడా ఉపయోగపడుతుందని భావించానని రాజకీయాలకు అతీతంగా ఆలోచనలు చేస్తే బావుంటుందన్నారు. ముఖ్యమంత్రి బదులు తెలంగాణ ప్రభుత్వ అధికారుల బృందాన్ని అమెరికా పర్యటనకు పంపించాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. అన్ని ఎంవోయూలు చేసుకోవాలని రేవంత్ అధికారులకు సూచించారు.దేశంలోని ముఖ్యమంత్రి ప్రభుత్వ, ప్రైవేటు కార్యక్రమాల్లో పాల్గొనడం కోసం విదేశాలకు వెళ్లాలంటే కేంద్రం నుంచి అనుమతి తీసుకోవాలి. ప్రధాని, విదేశీ వ్యవహారాలు, ఆర్థిక శాఖల నుంచి అనుమతి రావాల్సి ఉంటుంది. ఒకవేళ ఏవైనా అవాంఛనీయ, ప్రత్యేక పరిస్థితులు తప్ప సీఎంవో నుంచి లేఖ రాయగానే కేంద్రం నుంచి అనుమతిస్తారు. కానీ రేవంత్ రెడ్డి పర్యటనకు కేంద్రం అనుమతి ఇవ్వకపోవడం చర్చనీయాంశంగా మారింది. రేవంత్ అమెరికా పర్యటనకు కేంద్రం అనుమతి నిరాకరించడంపై కాంగ్రెస్ స్పందిస్తుందన్నది చూడాలి.

## స్థానిక ఎన్నికల కోసం జనసేన కమిటీ

రాయలసీమ బాధ్యతలను అప్పగించిన సంగతి తెలిసిందే. అయితే తాజాగా స్థానిక సంస్థల ఎన్నికల విధివిధానాల రూపకల్పన కమిటీలో చోటు లేకపోవటంతో నెట్టింట చర్చ జరుగుతోంది.మరోవైపుస్థానిక సంస్థల ఎన్నికలకు ప్రతి ఒక్కరూ సిద్ధం కావాలని, ఈ ఎన్నికలలో అనుసరించే విధివిధానాల రూపకల్పనకు ప్రత్యేక కమిటీని నియమిస్తామని పవన్ కళ్యాణ్ గురువారం తెలిపారు. జనసైనికులు, వీర మహిళల పోరాట స్ఫూర్తిని కొనసాగించేలా, ఆత్మ గౌరవాన్ని నిలబెట్టేలా స్థానిక సంస్థల ఎన్నికలకు సిద్ధం కావాలని పవన్ పిలుపునిచ్చారు.పార్టీ ఎమ్మెల్యేలు ఉన్న నియోజకవర్గాలకే పరిమితం కాకుండా, జనసేన బలబలాలను బేరీజు వేసి, పోటీ చేసేందుకు తగిన స్థానాలను గుర్తించి నివేదిక ఇవ్వాలని స్పష్టం చేశారు. వైసీపీ పాలనను ముగించేందుకే సార్వత్రిక ఎన్నికల్లో జనసేన 21 సీట్లకు పరిమితమై పోటీ చేసిందని. ఆ వ్యూహం ఆ ఎన్నికలకేనని పవన్ కళ్యాణ్ స్పష్టం చేశారు. స్థానిక ఎన్నికలకు ఆయా ప్రాంత రాజకీయ, సామాజిక పరిస్థితులను అనుసరించి వ్యూహాలు ఉంటాయని పవన్ కళ్యాణ్ స్పష్టం చేశారు.

## రాయదుర్గం భూములకు రికార్డు ధర

సుమారు రూ.1,386 కోట్లు అవుతుంది.ఈ వేలానికి టీజీఐఐసీ కనీస ధరను ఎకరాకు రూ.175 కోట్లుగా నిర్ణయించింది. బిడ్డింగ్‌లో పాల్గొనేందుకు రూ.10 కోట్ల డిపాజిట్ చెల్లించేలా నిబంధనలు విధించింది. అధిక విలువ కలిగిన భూమి కావడంతో పలు రియల్ ఎస్టేట్ సంస్థలు వేలంలో పోటీపడ్డాయి. రాయదుర్గం పాన్‌మక్తాలోని ఇదే సర్వే నంబర్ భూములకు గతంలోనూ భారీ ధరలు పలికాయి. ఈ ఏడాది మేలో జరిగిన వేలంలో ఎకరం రూ.237 కోట్లకు అమ్ముడైంది.ఇప్పుడు అదే ప్రాంతంలో ధర మరోసారి పెరిగి రూ.264 కోట్లకు చేరింది. అంటే ఎకరానికి గత రికార్డుతో పోలిస్తే రూ.27 కోట్ల మేర పెరుగుదల నమోదైంది. ఇదే సర్వే నంబర్‌లో ఈ ఏడాది జూన్‌లో నిర్వహించిన మరో వేలంలో ఎకరం రూ.204 కోట్ల ధర పలికింది. అంతకుముందు గతేడాది అక్టోబర్‌లో రాయదుర్గంలో జరిగిన వేలంలో ఎకరం రూ.177 కోట్లు ధరకు అమ్ముడైంది. వరుస వేలాల్లో ధరలు పెరుగుతుండటం హైదరాబాద్ ఐటీ కారిడార్‌లో భూములకు ఉన్న డిమాండ్‌ను స్పష్టం చేస్తోంది. రాయదుర్గం హైదరాబాద్‌లోని కీలకమైన ఐటీ, కమర్షియల్ కారిడార్‌కు కేంద్ర బిందువుగా మారింది. మైండ్‌స్పేస్, నాలెడ్జ్ సిటీ, గచ్చిబౌలి, ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్ వంటి ప్రధాన వాణిజ్య ప్రాంతాలకు సమీపంలో ఉండటం ఈ ప్రాంత భూములకు భారీ డిమాండ్ రావడానికి ప్రధాన కారణాల్లో ఒకటిగా చెప్పొచ్చు. మౌలిక వసతులు, ఐటీ కంపెనీల కార్యకలాపాలు, భారీ వాణిజ్య ప్రాజెక్టులకు అనుకూలత వంటి అంశాలు కూడా భూముల విలువను పెంచుతున్నాయి.మరోవైపు హైదరాబాద్ నగరంలో అభివృద్ధి చేయడానికి అందుబాటులో ఉన్న పెద్ద ప్రభుత్వ భూములు పరిమితంగా ఉండటం కూడా వేలాల్లో పోటీని పెంచుతోంది. ఎత్తైన భవనాల నిర్మాణానికి ఉన్న అవకాశాలు, కమర్షియల్ ప్రాజెక్టులపై డెవలపర్ల ఆసక్తి కారణంగా రాయదుర్గం, కోకాపేట, ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్ వంటి ప్రాంతాల్లో భూముల ధరలు భారీగా పెరుగుతున్నాయి. టీజీఐఐసీ నిర్వహిస్తున్న భూముల వేలాలు తెలంగాణ ప్రభుత్వానికి భారీ ఆదాయాన్ని సమకూరుస్తున్నాయి. రాయదుర్గంలో వరుసగా రికార్డు స్థాయిలో ధరలు నమోదవుతుండటంతో హైదరాబాద్ రియల్ ఎస్టేట్ మార్కెట్‌పై మరోసారి దేశవ్యాప్తంగా దృష్టి పడింది. ఎకరం రూ.264 కోట్ల ధర పలకడం ద్వారా రాయదుర్గం మరోసారి తన సత్తా చాటింది. భవిష్యత్తులో ఇదే ప్రాంతంలో జరిగే వేలాల్లో భూముల ధరలు మరింత పెరుగుతాయా అనేది ఆసక్తికరంగా మారింది.

## ఆక్స్‌ఫర్డ్‌లో సీఎం రేవంత్‌రెడ్డి

ఈ సందర్భంగా గుర్తుచేసుకున్నారు.తెలంగాణ ప్రభుత్వంతో కలిసి పనిచేసేందుకు ప్రొఫెసర్లు మాయా ట్యూడర్, ఫైసల్ దేవ్జీ సానుకూలంగా స్పందించారు. రాష్ట్ర యువత, ఉద్యోగ నిపుణులతో కలిసి పనిచేయడానికి ఆసక్తి వ్యక్తం చేశారు. తెలంగాణ ప్రభుత్వంతో విద్య, పరిశోధన, నైపుణ్యాభివృద్ధి రంగాల్లో భాగస్వామ్యానికి ఉన్న పలు అవకాశాలను ఈ సందర్భంగా వారు ప్రస్తావించారు. డిసెంబర్ 7, 8, 9 తేదీల్లో హైదరాబాద్‌లో జరగనున్న తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్‌కు ప్రతినిధి బృందాన్ని పంపాలని ఆక్స్‌ఫర్డ్ యూనివర్సిటీ ప్రతినిధులను తెలంగాణ బృందం ఆహ్వానించింది. అనంతరం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చారిత్రక సోమర్‌విల్ కాలేజీని సందర్శించారు. ఈ కాలేజీలో విద్యాభ్యాసం చేసిన దివంగత మాజీ ప్రధాని ఇందిరా గాంధీ చిత్రపటాన్ని సందర్శించారు. 2002లో సోనియా గాంధీ ఈ చిత్రపటాన్ని సోమర్‌విల్ కాలేజీకి బహూకరించిన విషయం తెలిసిందే.అనంతరం ముఖ్యమంత్రి, అక్కడే జీఎంఆర్ గ్రూప్ నిర్వహిస్తున్న యుటిలిటా బౌల్‌ను సందర్శించారు. జీఎంఆర్ గ్రూప్ కార్పొరేట్ చైర్మన్ కిరణ్ కుమార్ గ్రంథితో కలిసి అక్కడి సమగ్ర క్రీడా సదుపాయాలను పరిశీలించారు. ఈ ప్రాంగణంలో గోల్ఫ్ కోర్స్‌తో పాటు వివిధ క్రీడలకు సంబంధించిన మౌలిక సదుపాయాలు, హోటల్ ఉన్నాయి. తెలంగాణలో ప్రపంచస్థాయి క్రీడా మౌలిక సదుపాయాల ఏర్పాటుపై ముఖ్యమంత్రి జీఎంఆర్ ప్రతినిధులు, సంస్థ గ్లోబల్ స్పోర్ట్స్ యూనిట్‌తో మంతనాలు జరిపారు. రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టి, ప్రపంచస్థాయి క్రీడా మౌలిక సదుపాయాల అభివృద్ధిలో భాగస్వాములు కావాలని వారిని ఆహ్వానించారు.

## తెలంగాణ మెడికల్ సీట్లు
# ఇతరులకా.?

ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. శుక్రవారం పలువురు నీట్ అభ్యర్థుల తల్లిదండ్రులు కల్వకుంట్ల కవితను కలిసి తమ సమస్యలను వివరించారు. ఆ తర్వాత ఆమె ప్రభుత్వం అనాలోచితంగా నిర్ణయం తీసుకుందని విమర్శించారు.కేవలం 4 ఏళ్లు తెలంగాణలో చదివిన విద్యార్థులను స్థానికులుగా పరిగణించేలా జీవో 150లో నిబంధనలు తీసుకురావడం వల్ల రాష్ట్ర విద్యార్థులకు నష్టం జరుగుతుందని కల్వకుంట్ల కవిత పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్రాన్ని సాధించుకున్న ప్రధాన ఉద్దేశాల్లో భవిష్యత్ తరాలకు న్యాయం చేయడం కూడా ఒకటని ఆమె గుర్తుచేశారు. తెలంగాణలో ఏర్పాటు చేసిన ప్రభుత్వ మెడికల్ కాలేజీల్లో స్థానిక విద్యార్థులకు ఎక్కువ ప్రయోజనం కలిగేలా నిబంధనలు ఉండాలని ఆమె అభిప్రాయపడ్డారు.జీవో 150 అమలుతో మెడిసిన్‌లో సుమారు 1,600 సీట్లు తెలంగాణ విద్యార్థులకు కాకుండా ఇతర రాష్ట్రాల విద్యార్థులకు వెళ్లే పరిస్థితి ఏర్పడుతుందని కల్వకుంట్ల కవిత ఆందోళన వ్యక్తం చేశారు. తెలంగాణ విద్యార్థుల కోసం ఏర్పాటు చేసిన మెడికల్ కాలేజీల్లో ఇతర ప్రాంతాల విద్యార్థులకు ఎక్కువ అవకాశాలు కల్పించడం సరికాదని పేర్కొన్నారు. స్థానిక విద్యార్థుల ప్రయోజనాలను కాపాడేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఈ అంశంపై వెంటనే పునరాలోచన చేయాలని డిమాండ్ చేశారు.జీవో 150ను పూర్తిగా రద్దు చేయడం సాధ్యం కాకపోతే.. దానికి అనుబంధంగా నిబంధనలను సవరించాలని కల్వకుంట్ల కవిత సూచించారు. కనీసం 7 ఏళ్లపాటు తెలంగాణలో చదివిన విద్యార్థులను మాత్రమే స్థానికులుగా పరిగణించేలా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. దీనివల్ల తెలంగాణలో దీర్ఘకాలంగా చదువుతున్న విద్యార్థులకు మెడికల్ సీట్లలో న్యాయం జరుగుతుందని ఆమె పేర్కొన్నారు.ఇప్పటికే నీట్ విధానం కారణంగా తెలంగాణ విద్యార్థులు 15 శాతం సీట్లను కోల్పోతున్నారని కల్వకుంట్ల కవిత గుర్తు చేశారు. తెలంగాణ రక్షణ సేన తరఫున నీట్ విధానాన్ని తాము వ్యతిరేకిస్తున్నామని స్పష్టం చేశారు. ప్రతి రాష్ట్రానికి ప్రత్యేకంగా మెడికల్ బోర్డు ఉంటేనే స్థానిక విద్యార్థులకు మరింత న్యాయం జరుగుతుందని ఆమె అభిప్రాయపడ్డారు. జీవో 150పై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వెంటనే స్పందించాలని కవిత డిమాండ్ చేశారు. విద్యార్థులు, తల్లిదండ్రుల ఆందోళనలను ప్రభుత్వం పట్టించుకోకుండా ఉండకూడదని అన్నారు. తెలంగాణ విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని జీవో 150పై ప్రభుత్వం పునఃపరిశీలన చేసి దాన్ని రద్దు చేయాలని ఆమె కోరారు.

## పర్యటన హోదాకు, ఉద్దేశానికి
# తగినట్లు లేదు

పర్యటనలకు రాజకీయ అనుమతి ఇచ్చే ముందు పాటించే రూల్స్ ప్రకారమే ఈ నిర్ణయం తీసుకున్నామని విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి రణధీర్ జైస్వాల్ స్పష్టం చేశారు. ఆ పర్యటన ఉద్దేశం, కార్యక్రమాల స్వరూపం, వారి పదవికి అనుగుణంగా ఉన్నాయా లేదా అనే అంశాలను తాము పరిశీలిస్తామని రణధీర్ జైస్వాల్ తేల్చి చెప్పారు. అయితే ఈసారి అమెరికా పర్యటనకు సమర్పించిన కార్యక్రమం సీఎం హోదాకు, పర్యటన ఉద్దేశానికి తగినట్లుగా లేదని భావించినందుకే పొలిటికల్ క్లియరెన్స్ నిరాకరించినట్లు తెలిపారు. ముఖ్యమంత్రులు, ఇతర ఉన్నత స్థాయి ప్రజాప్రతినిధులు విదేశీ పర్యటనలకు సంబంధించి విదేశాంగ శాఖ క్షుణ్ణంగా పరిశీలించిన తర్వాతే వారికి రాజకీయ అనుమతులు విదేశాంగ శాఖ మంజూరు చేస్తుందని రణధీర్ జైస్వాల్ చెప్పారు. ఆ పర్యటనకు ప్రతిపాదించిన కార్యక్రమాలు ఆయా పదవులకు, పర్యటన ఉద్దేశానికి అనుగుణంగా ఉండటం ముఖ్యమని పేర్కొన్నారు. రేవంత్‌రెడ్డి అమెరికా పర్యటన విషయంలో ఆ ప్రమాణాలు సరిపోలలేదని అందుకే ఆ పర్యటనకు అనుమతి ఇవ్వలేదని స్పష్టం చేశారు.

## 31న ఇందిరా పార్కు వద్ద మహా ధర్నా

ఇందిరాపార్కు వద్ద ఈ నెల 31న చేపట్టనున్న మహాధర్నాకు అన్ని రాజకీయ పార్టీలు, సంఘాలను ఆహ్వానిస్తున్నామని లోక్ ఆందోళన్ న్యాస్ వర్కింగ్ ప్రసి డెంట్ కల్పనా ఇనామ్ దార్ తెలిపారు. బషీర్ బాగ్ ప్రెస్ క్లబ్ లో విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ.. దేశ వ్యాప్తంగా కేంద్ర ప్రభుత్వం చేపడుతున్న జాతీయ జనగణన కులగణనలో ఓబీ సీలకు ప్రత్యేక కాలం ఇవ్వాలని, 33 శాతం మహిళా రిజర్వేషన్లలో ఓబీసీ మహిళలకు సబ్కోటా విధించాలని, న్యాయ వ్యవస్థలో సంస్క రణలు తీసుకురావాలని, డి లిమిటేషన్లో రాష్ట్రాలకు ప్రాధాన్యం ఇవ్వాలని డిమాండ్ చేస్తూ దేశవ్యాప్తంగా ప్రజాస్వామ్య న్యాయ ప్రచార ఉద్యమం చేపడుతున్నామన్నారు. ఇందిరాపార్కు ధర్నాతో తెలంగాణలో ఈ ఉద్యమాన్ని ప్రారంభించి దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాల్లో ఉద్యమాన్ని కొనసాగిస్తామని ఆమె తెలిపారు. కార్యక్రమంలో న్యాయవాది శిల్పా, రాఘవలింగం తదితరులు పాల్గొన్నారు.

## రైతుకు ప్రభుత్వం అండగా నిలవాలి
### - భరోసా కల్పించాలి
### - మంత్రి వాకిటి శ్రీహరి

**రాజేంద్ర నగర్** ఎల్ నినో ప్రభావం- వివిధ ప్రభుత్వ రంగాల్లో చేపట్టాల్సిన ముందస్తు కార్యాచరణపై రాజేంద్ర నగర్ లో వర్క్ షాప్ జరిగింది.  వర్క్ షాప్ లో  మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, ధనసిరి సీతక్క, వాకిటి శ్రీహరి లు, రాజ్యసభ సభ్యులు వేం నరేందర్ రెడ్డి, ఉన్నతాధికారులు, వ్యవసాయ, పంచాయతీ రాజ్, పశు సంవర్ధక మత్స్య శాఖల అధికారులు పాల్గొన్నారు.మంత్రి వాకిటి శ్రీహరి మాట్లాడుతూ గతంలో కూడా దేశంలో ఎల్ నినో ప్రభావాలు వచ్చాయి. 1951 నుంచి నేటి వరకు 12సార్లు ఎల్ నినోను భారత దేశం ఎదుర్కొంది. కరువును ఎలా ఎదుర్కోవాలనే అవగాహన రైతులకు ఉంటుంది కానీ ఆ అవగాహనను ఆచరించేలా చేసే బాధ్యత మనది. పంటల మార్పిడి ద్వారా వ్యవసాయ రంగంలో మార్పులు తీసుకురావచ్చనే విషయంలో రైతులకు సలహాలు ఇవ్వాలని అన్నారు.ఆస్ట్రేలియా వంటి దేశాలు ముందస్తు కార్యాచరణ ద్వారా ఎల్ నినోను సమర్థవంతంగా అధిగమించింది. కరవు పరిస్థితుల్లో పశువుల పెంపకం, సంరక్షణ వంటి వాటిపై అన్నదాతలకు అవగాహన కల్పించాలి. ఎల్ నినో విషయంలో దేశంలోనే తెలంగాణ మాత్రమే ఇలాంటి ముందస్తు కార్యక్రమం హర్షించదగ్గ విషయం. ఎలాంటి కరవు పరిస్థితుల్లోనైనా ధైర్యంగా ముందుకు సాగేవాడు రైతు. పంటల దిగుబడి రాకున్నా వ్యవసాయం మాత్రం వదలడు. అటువంటి రైతుకు ప్రభుత్వం అండగా నిలవాలి. భరోసా కల్పించాలి. రైతులను కరువు నుంచి బయట పడవేసేందుకు ప్రత్యేక కార్యాచరణ అవసరం. చేపల పెంపకానికి నీరు తప్పనిసరి. చెరువుల్లో చేపల పెంపకం జరుగాలంటే అక్కడ ఉన్న రైతుల నుంచి నీటి సరఫరా జరిగేలా చూడాలని అన్నారు.
వర్షాల ద్వారా వచ్చే నీటిని చెక్ డ్యాంలను నిర్మించి నీటిని నిల్వ చేసి వ్యవసాయ రంగానికి వాడుకోవాలి. మేకలు, గొర్రెలు మేసేందుకు ప్రత్యేక ప్రదేశాలను గుర్తించి, కేటాయించడం ద్వారా పశు సంపదను పెంచుకోవచ్చు. మన ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలతో తెలంగాణను ఒక మోడల్ గా నిలుపవచ్చు. ఎల్ నినో వంటి వాటిని ఎదుర్కోనేందుకు అధికారులు అప్రమత్తతో పనిచేసి ప్రభుత్వ లక్ష్యాన్ని సంపూర్ణం చేయాలి. ముందస్తు ప్రణాళికతో రైతులకు మంచి అవకాశం కల్పించి ఎల్ నినోను సమర్థవంతంగా ఎదుర్కోవాలని అన్నారు.

## తిరుపతిలో మాతృశ్రీ తరిగొండ వెంగమాంబ
## విగ్రహానికి ఘనంగా పుష్పాంజలి

**తిరుపతి,** భక్త కవయిత్రి మాతృశ్రీ తరిగొండ వెంగమాంబ 209వ వర్ధంతిని పురస్కరించుకుని తిరుపతిలోని ఎం.ఆర్.పల్లి సర్కిల్ వద్ద ఉన్న వెంగమాంబ విగ్రహానికి తరిగొండ వెంగమాంబ ప్రాజెక్టు ప్రత్యేక అధికారి డా. వేమ వెంకటరత్నం శుక్రవారం ఘనంగా పుష్పాంజలి ఘటించారు.వర్ధంతి ఉత్సవాల్లో భాగంగా రెండో రోజు అన్నమాచార్య కళామందిరంలో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు అన్నమాచార్య ప్రాజెక్టు కళాకారులచే సంగీత కచేరి నిర్వహించారు.సాయంత్రం 6 గంటల నుంచి హరికథ గానం నిర్వహించనున్నారు.ఈ కార్యక్రమంలో వెంగమాంబ ప్రాజెక్టు ఏఈవో  అరుణకుమారి, సూపరింటెండెంట్ ఎన్ సుశీల, ఇతర అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## ఏఈ నూకరాజు కుటుంబం
## ఆత్మహత్య కేసులో దర్యాప్తు ముమ్మరం

**కాకినాడ**గోదావరి నదిలో దూకిన ఏఈ నూకరాజు కుటుంబం ఆత్మహత్య కేసులో  పోలీసులు దర్యాప్తు ముమ్మరం చేసారు. నిందితుడు సాదిక్ఖాన్ కోసం 10 ప్రత్యేక పోలీసు బృందాలు గాలిస్తున్నాయి. సాధిక్ ఖాన్  పాస్పోర్టును సీజ్ చేసి నిందితుడు ఎక్కడికీ పారిపోకుండా లుకౌట్ సర్క్యులర్ జారీ చేసారు. నూకరాజు కుమార్తె రాసిన లేఖలపై దర్యాప్తు ముమ్మరం. మతం మారాలి ఇస్లాం పుస్తకాలు చదవాలంటూ సాధిక్ ఖాన్  వేధించినట్లు లేఖలో సౌజన్య పేర్కొంది. సాధిక్ ఖాన్  కాల్డేటా ఆధారంగా పలువురిని పోలీసులు  విచారించారు. పోలీసులు. నిందితుడు సాదిక్ఖాన్ ఆచూకీ తెలిపితే రివార్డ్ ఇస్తామని ప్రకటించారు.

## రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి

**అవనిగడ్డ** రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి చెందిన ఘటన కృష్ణాజిల్లా అవనిగడ్డ, పులిగడ్డ రహదారిపై చోటుచేసుకుంది. పులిగడ్డ రహదారిపై సీతాయలంక వద్ద రోడ్డు ప్రమాదం జరిగింది. ఎదురుగా వస్తున్న వ్యాగన్ఆర్ కారును  ద్విచక్ర వాహనదారుడు ఢీ కొట్టాడు. దాంతో అతడు ఘటనాస్థలంలోనే మృతి చెందాడు. ద్విచక్ర వాహనంపై ఉన్న మహిళకు స్వల్ప గాయాలు అయ్యాయి. గాయాలైన మహిళను మెరుగైన చికిత్స నిమిత్తం అవనిగడ్డ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మృతుడు మోపిదేవి మండలం నాగయతిప్పకు చెందిన కంఠమనేని అప్పారావు (65) గా గుర్తించారు. నాగాయ తిప్పకు చెందిన  వారు అవనిగడ్డ ప్రభుత్వ ఆసుపత్రికి చికిత్స నిమిత్తం ద్విచక్ర వాహనంపై వచ్చి తిరుగు ప్రయాణంలో ప్రమాదం జరిగింది.  మృతదేహాన్ని పోస్ట్మార్టం నిమిత్తం అవనిగడ్డ ఏరియా ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అవనిగడ్డ ఇంచార్జ్ ఎస్ఐ చాణక్య ఘటన స్థలానికి చేరుకొని కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

## అవసరాలకు అనుగుణంగా
# సాంకేతిక పరిష్కారాలు

**హైదరాబాద్** ఆటోమేషన్, డిజిటలైజేషన్, అధునాతన ఇంజినీరింగ్ టెక్నాలజీ తయారీ రంగం అత్యంత కీలకమని ఏస్ అర్బన్ గ్రూప్, ఏఎం గ్రీన్ డైరె క్టర్ స్వాతి చలమలశెట్టి అన్నారు. మాదాపూర్ లోని హైటెక్స్ ఎగ్జిబిషన్ సెంటర్లో ఏర్పాటు చేసిన హింటెక్స్ (హైదరాబాద్ ఇంటర్నేషనల్ మెషిన్ టూల్ అండ్ ఇంజినీరింగ్ ఎగ్జిబిషన్) 2026 కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఏస్ అర్బన్ గ్రూప్, ఏఎం గ్రీన్ డైరెక్టర్ స్వాతి చలమలశెట్టి విచ్చేసి హైటెక్స్ డైరెక్టర్ కునశంకర్ కలిసి జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించింది.  ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ హింటెక్స్ వంటి పారిశ్రామిక ప్రదర్శనలు ఆధునిక సాంకేతికతను భారతీయ పరిశ్రమలకు చేరువ చేయడంతో పాటు, సంస్థలు తమ అవసరాలకు అనుగుణమైన సాంకేతిక పరిష్కారాలను అన్వేషించేందుకు కీలకంగా నిలుస్తున్నట్లు చెప్పారు. హింటెక్స్ గత కొన్నేళ్లుగా దేశంలోని అభివృద్ధి చెందుతున్న పారిశ్రామిక ప్రదర్శనల్లో ఒకటిగా ఎదిగినట్లు తెలిపారు.  మూడు రోజుల పాటు కొనసాగనున్న ఈ ప్రదర్శనలో హింటెక్స్ లేథ్, సీఎన్సీ యంత్రాలు, మ్యాచినింగ్ సెంటర్లు, ఎలక్ట్రిక్ డిశ్చార్జ్ మెషిన్లు, హైడ్రాలిక్, మెకానికల్, న్యూమాటిక్ ప్రెస్లు, షీరింగ్, బెండింగ్ ప్రెస్లు, మెటల్ ఫార్మింగ్ మెషిన్ టూల్స్, డ్రిల్లింగ్, బోరింగ్ వంటి యంత్ర పరికరాలను ప్రదర్శించారు.

## ఫోన్ ట్యాపింగ్ కేసులో సిట్ ముందు మానవతారాయ్

ఫోన్ ట్యాపింగ్ కేసులో కాంగ్రెస్ నేత మానవతారాయ్ సిట్ ముందు విచారణకు హాజరయ్యారు. బాధితుడిగా సిట్ అధికారులు ఇచ్చిన నోటీసుల మేరకు బషీర్బాగ్లోని సీసీఎస్ కార్యాలయానికి చేరుకున్నారు. ఫోన్ ట్యాపింగ్ కేసుకు సంబంధించి మానవతారాయ్ నుంచి సిట్ అధికారులు వివరాలు, వాంగ్మూలం నమోదు చేసారు.

## ప్రియాంక కేసు నిందితులకు ముగిసిన కస్టడి

**రాజమండ్రి** పీజీ విద్యార్థిని డాక్టర్ ప్రియాంక కేసులో నిందితుల రెండు రోజుల కస్టడీ విచారణ పూర్తి అయింది.  వైద్య పరీక్షల  అనంతరం నిందితులను ప్రకాష్ నగర్ పోలీసులు రాజమండ్రి సెంట్రల్ జైలుకు పంపారు.  మూడో తేదీన ప్రమాదం జరిగిన సమయం నుండి నిందితులు పారిపోయే వరకు ఏం చేశారనే కోణంలో పోలీసులు విచారణ చేసారు.

# రోడ్లు లేక.. నరకయాతన

**వర్షం వస్తే బురదమయం.. రాత్రివేళల్లో విషజీవుల భయం**

**వెంకటరాజులకండ్రిగలో కనీస వసతులు కరువు.. సిమెంట్ రోడ్లు, వీధిదీపాలు ఏర్పాటు చేయాలని గ్రామస్థుల విజ్ఞప్తి**



సత్యవేడు(ప్రశ్న న్యూస్)తిరుపతి జిల్లా సత్యవేడు మండలంలోని వెంకటరాజులకండ్రిగ గ్రామస్థులకు రోడ్ల సమస్య నరకయాతనగా మారింది. గ్రామంలో సరైన సిమెంట్ రోడ్లు లేకపోవడంతో వర్షం కురిసిన ప్రతిసారీ రహదారులు బురదమయంగా మారుతున్నాయి. దీంతో కాలినడకన వెళ్లాలన్నా.. వాహనాలపై ప్రయాణించాలన్నా తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

### ఘాట్ రోడ్లను తలపిస్తున్న వైనం

గ్రామంలోని రహదారులు ఇరుకుగా ఉండటంతో వాహనాల రాకపోకలకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. కొన్ని మార్గాలు కొండ ప్రాంతాల్లోని ఘాట్ రోడ్లను తలపిస్తున్నాయని గ్రామస్థులు చెబుతున్నారు. వర్షాకాలంలో పరిస్థితి మరింత దారుణంగా మారుతోందని పేర్కొంటున్నారు.

### చీకట్లో విషజీవుల భయం

గ్రామం చుట్టూ అటవీ ప్రాంతం ఉండటంతో రాత్రివేళల్లో పాములు, ఇతర విషపూరిత జీవులు సంచరిస్తున్నాయని స్థానికులు చెబుతున్నారు. మరోవైపు వీధి దీపాలు సక్రమంగా వెలగకపోవడంతో చీకట్లో బయటకు రావాలంటే భయపడాల్సి వస్తోందని వాపోతున్నారు. చిన్నారులు, వృద్ధులు రాత్రి వేళల్లో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు.

### 'ప్రజల అవసరాలా.. వ్యక్తిగత ప్రయోజనాలా?'

గ్రామంలో సిమెంట్ రోడ్లు ఎందుకు నిర్మించడం లేదని అధికార పార్టీ నాయకులను ప్రశ్నిస్తే.. సిమెంట్ రోడ్లు వేస్తే తమకు డబ్బులు రావడం లేదని చెబుతున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. ప్రజల అవసరాల కంటే వ్యక్తిగత ప్రయోజనాలకే ప్రాధాన్యం ఇస్తున్నారంటూ ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

### శాశ్వత పరిష్కారం చూపాలి

వెంకటరాజులకండ్రిగలో రహదారుల పరిస్థితిపై సంబంధిత అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలన చేయాలని గ్రామస్థులు కోరుతున్నారు. సిమెంట్ రోడ్ల నిర్మాణంతో పాటు ఇరుకుగా ఉన్న రహదారులను వెడల్పు చేయాలని, వీధిదీపాలను ఏర్పాటు చేసి రాత్రివేళల్లో భద్రత కల్పించాలని విజ్ఞప్తి చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి తమ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపాలని కోరుతున్నారు.

# ఆర్ఏఆర్ఎస్‌ను నిర్వీర్యం చేస్తే రైతుల భవిష్యత్తు ప్రమాదంలోనే

**125 ఏళ్ల చరిత్రను తుడిచే కుట్రను సహించం**

**నూనెపల్లె మార్కెట్‌యార్డు భూములు ?**

**రాజకీయ ప్రయోజనాలకు మళ్లించొద్దు..**

**నంద్యాలలో అఖిలపక్షం ధ్వజం**



నంద్యాల(ప్రశ్న న్యూస్) నంద్యాల ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానం (ఆర్ఏఆర్ఎస్)ను నిర్వీర్యం చేస్తే రైతుల భవిష్యత్తుతో పాటు ప్రజల ఆహార భద్రత ప్రమాదంలో పడుతుందని అఖిలపక్ష ఐక్యవేదిక నాయకులు హెచ్చరించారు. 125 ఏళ్ల చరిత్ర కలిగిన ఆర్ఏఆర్ఎస్ భవనాలను తాత్కాలిక కలెక్టరేట్ కోసం వినియోగించడాన్ని వ్యతిరేకిస్తూ.. నూనెపల్లె మార్కెట్‌యార్డులో రాజకీయ పార్టీ కార్యాలయ నిర్మాణానికి కేటాయించిన రెండు ఎకరాల భూమిని రద్దు చేయాలని డిమాండ్ చేశారు.

అఖిలపక్ష ఐక్యవేదిక ఆధ్వర్యంలో శుక్రవారం నంద్యాల గాంధీచౌక్‌లో ప్రజా అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆర్ఏఆర్ఎస్ నుంచి తాత్కాలిక కలెక్టరేట్‌ను వెంటనే తరలించాలని, వ్యవసాయ పరిశోధనకు సంబంధించిన మౌలిక వసతులను పూర్తిస్థాయిలో పరిశోధనా సంస్థకు అప్పగించాలని నాయకులు కోరారు.

### రైతుల సమస్య మాత్రమే కాదు

రాయలసీమ సాగునీటి సాధన సమితి అధ్యక్షుడు బొజ్జా దశరథరామిరెడ్డి మాట్లాడుతూ.. ఇది కేవలం రైతుల సమస్య కాదని, ప్రతి ఒక్కరి ఆహార భద్రతకు సంబంధించిన అంశమని అన్నారు. రైతుకు వ్యవసాయం ద్వారా లాభం లేకపోతే సాగు దెబ్బతింటుందని, వ్యవసాయం దెబ్బతింటే చివరకు ప్రజల ఆహార భద్రతపైనా ప్రభావం పడుతుందని హెచ్చరించారు. సుమారు 125 ఏళ్ల చరిత్ర ఉన్న ఆర్ఏఆర్ఎస్ నంద్యాల ప్రాంత వ్యవసాయ అభివృద్ధిలో కీలకపాత్ర పోషించిందన్నారు. అధిక దిగుబడినిచ్చే విత్తనాల అభివృద్ధి, విత్తన పరిశ్రమ పురోగతి, పప్పుధాన్యాలు, చిరుధాన్యాలు, నూనెగింజల ఉత్పత్తి పెంపునకు పరిశోధనా స్థానం ఎంతో దోహదపడిందని వివరించారు. కార్యక్రమంలో అఖిలపక్ష ఐక్యవేదిక కన్వీనర్ ఏరువ రామచంద్రారెడ్డి, మున్సిపల్ మాజీ ఫ్లోర్ లీడర్, న్యాయవాది శంకరయ్య, ఎస్‌డీపీఐ నాయకుడు ఏజెస్ హుస్సేన్, క్రిస్టియన్ జేఏసీ నాయకుడు జానయ్య, సమితి ఉపాధ్యక్షులు యర్రం శంకర్‌రెడ్డి, శివరామిరెడ్డి, మాజీద్, రాజు తదితరులు పాల్గొన్నారు. "ఇది కొంతమంది నాయకుల సమస్య కాదు.. మనందరి బతుకుకు సంబంధించిన అంశం. ప్రజా ఆస్తులు ప్రజల కోసమే.. రాజకీయ ప్రయోజనాల కోసం కాదు" అని నాయకులు స్పష్టం చేశారు.

# ఇంద్రకీలాద్రికి మహా వైభవం..

# రూ.52.50 కోట్లతో నూతన భవనాలు

**- భక్తుల సౌకర్యమే లక్ష్యం..**

**రెండో ఘాట్‌రోడ్డు,**

**మల్టీలెవల్ పార్కింగ్‌కు కార్యాచరణ**

**- దసరా ఉత్సవాలకు పకడ్బందీ ఏర్పాట్లు.**

**భక్తులకు స్వయంగా అన్నప్రసాదం వడ్డించిన : మంత్రి ఆనం**





విజయవాడ(ప్రశ్న న్యూస్)ఇంద్రకీలాద్రిపై భక్తుల సౌకర్యాలకు మరింత పెద్దపీట వేస్తూ రూ.52.50 కోట్ల వ్యయంతో నిర్మించిన 'శ్రీ కనకదుర్గ అన్నప్రసాద సదనం', 'శ్రీ దుర్గా భవాని మహాప్రసాద భవనం'లను రాష్ట్ర దేవాదాయ, ధర్మాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి శుక్రవారం ప్రారంభించారు. శ్రీ దుర్గా మల్లేశ్వరస్వామివార్లను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం నూతన భవనాలను భక్తులకు అంకితం చేశారు.

### ట్రాఫిక్ సమస్యకు రెండో ఘాట్‌రోడ్డు

ఇంద్రకీలాద్రిపై ట్రాఫిక్ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపే దిశగా రెండో ఘాట్‌రోడ్డు నిర్మాణానికి చర్యలు చేపడుతున్నట్లు మంత్రి తెలిపారు. కుమ్మరిపాలెం నుంచి సుమారు 700 మీటర్ల మేర రెండో ఘాట్‌రోడ్డు నిర్మాణానికి ఆర్‌అండ్‌బీ, కన్సల్టెన్సీ సంస్థ ద్వారా సాధ్యాసాధ్యాలను పరిశీలిస్తున్నట్లు చెప్పారు. అత్యవసర సమయాల్లో రాకపోకలకు ఇబ్బందులు లేకుండా ఈ మార్గం ఉపయోగపడుతుందన్నారు.

### ఏడు అంతస్తుల భవనం

కుమ్మరిపాలెంలోని మూడు ఎకరాల టీటీడీ స్థలాన్ని దుర్గమ్మ భక్తుల అవసరాలకు వినియోగించనున్నట్లు మంత్రి వెల్లడించారు. ఏడు అంతస్తులతో భారీ భవనం నిర్మించి మల్టీలెవల్ పార్కింగ్‌తో పాటు భక్తులకు వసతి గదులు ఏర్పాటు చేస్తామని తెలిపారు. ఈ భవనం ద్వారా సుమారు 15 వేల మందికి ప్రయోజనం కలిగేలా ప్రణాళిక రూపొందిస్తున్నట్లు చెప్పారు.

### భారీ కేశఖండనశాల.. 25 అడుగుల ఆదిశంకరాచార్య విగ్రహం

దుర్గాఘాట్ సమీపంలో ఆధునిక సదుపాయాలతో భారీ కేశఖండనశాల నిర్మించేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నట్లు మంత్రి తెలిపారు. ఇందుకోసం సమీపంలోని కార్పొరేషన్ స్థలాన్ని కూడా వినియోగించుకునే అంశాన్ని పరిశీలిస్తున్నామన్నారు. ప్రస్తుత ఘాట్‌రోడ్డులోని తొలి మలుపు వద్ద 25 అడుగుల ఎత్తైన ఆదిశంకరాచార్యుల విగ్రహాన్ని ఏర్పాటు చేసేందుకు ప్రణాళికలు ఉన్నాయని చెప్పారు.

### దసరాకు పకడ్బందీ ఏర్పాట్లు

రాబోయే దేవి శరన్నవరాత్రి దసరా మహోత్సవాలకు లక్షలాది మంది భక్తులు తరలివచ్చే అవకాశం ఉన్నందున ముందస్తు ఏర్పాట్లు ముమ్మరం చేస్తున్నట్లు మంత్రి తెలిపారు. దేవస్థానం, పోలీస్, మున్సిపల్, రెవెన్యూ శాఖల సమన్వయంతో సమగ్ర ప్రణాళిక రూపొందిస్తున్నామన్నారు. క్యూ లైన్లలో నిరంతర తాగునీటి సరఫరా, పాలు, ప్రసాదాల పంపిణీ, పారిశుద్ధ్యం, భద్రతకు అత్యధిక ప్రాధాన్యత ఇస్తామని స్పష్టం చేశారు.

### భక్తులకు స్వయంగా అన్నప్రసాదం

నూతన అన్నప్రసాద సదనంలో మంత్రి ఆనం రామనారాయణరెడ్డి, విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని) భక్తులకు స్వయంగా అన్నప్రసాదాన్ని వడ్డించారు. అనంతరం మహాప్రసాద భవనంలో నిర్వహించిన పూర్ణాహుతి కార్యక్రమంలో పాల్గొని వేద పండితుల ఆశీస్సులు పొందారు. ప్రసాద విక్రయ కౌంటర్‌లో నగదు చెల్లించి అమ్మవారి లడ్డూ ప్రసాదాలను మంత్రి కొనుగోలు చేశారు.

### ఒకేసారి 800 మందికి అన్నప్రసాదం

రూ.26 కోట్ల వ్యయంతో నిర్మించిన శ్రీ కనకదుర్గ అన్నప్రసాద సదనం 5,400 చదరపు మీటర్ల విస్తీర్ణంలో నిర్మితమైంది. మొదటి అంతస్తులోని భోజనశాలలో ఒకేసారి 800 మంది భక్తులు భోజనం చేసే సదుపాయం ఉంది. గ్రౌండ్‌ఫ్లోర్‌లో సెంట్రల్ స్టోర్, వంట తయారీ ప్రాంతం, వాష్‌రూమ్‌లు, మూడు వైపుల నుంచి వాహనాల రాకపోకలకు అనువైన మార్గాలను ఏర్పాటు చేశారు.

### అత్యాధునిక ప్రసాద తయారీ కేంద్రం

రూ.26.50 కోట్లతో నిర్మించిన శ్రీ దుర్గా భవాని మహాప్రసాద భవనం 3,600 చదరపు మీటర్ల విస్తీర్ణంలో నాలుగు అంతస్తులతో నిర్మించారు. గ్రౌండ్, మొదటి అంతస్తుల్లో ప్రసాద విక్రయ కౌంటర్లు, క్యూ లైన్లు ఏర్పాటు చేశారు. రెండో, మూడో అంతస్తుల్లో పులిహోర, చక్కెరపొంగలి, లడ్డూల తయారీ, ప్యాకింగ్, నిల్వకు ఆధునిక సదుపాయాలు కల్పించారు.

భవిష్యత్‌లో పెరిగే భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని పరిశుభ్రత ప్రమాణాలతో వేగంగా ప్రసాదాలు, అన్నప్రసాదం తయారు చేసేందుకు ఈ రెండు భవనాల్లో త్వరలో యాంత్రీకృత వంటశాలలను ఏర్పాటు చేయనున్నట్లు మంత్రి తెలిపారు.

ఈ కార్యక్రమంలో విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని), ప్రభుత్వ విప్ యార్లగడ్డ వెంకట్రావు, స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ చైర్మన్ కొమ్మారెడ్డి పట్టాభిరామ్, 20 సూత్రాల అమలు కమిటీ చైర్మన్ లంకా దినకర్, బ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ బుచ్చి రామ్ ప్రసాద్, దేవాదాయ శాఖ కమిషనర్ కె.రామచంద్ర మోహన్, దేవస్థాన ధర్మకర్తల మండలి చైర్మన్ బొర్రా రాధాకృష్ణ (గాంధీ), ఈవో వి.కె.శీనా నాయక్, ట్రస్ట్‌బోర్డు సభ్యులు, ఇంజినీరింగ్ అధికారులు, సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

# తిరుచానూరులో వరలక్ష్మీ వ్రతం వైభవం

**భక్తిశ్రద్ధలతో పెద్ద సంఖ్యలో పాల్గొన్న మహిళలు**

**పుష్పశోభతో ముస్తాబైన అష్టలక్ష్మీ మండపం.. సాయంత్రం స్వర్ణరథోత్సవం**





తిరుపతి(ప్రశ్న న్యూస్) తిరుచానూరు శ్రీ పద్మావతి అమ్మవారి ఆలయంలో వరలక్ష్మీ వ్రతం శుక్రవారం వైభవంగా నిర్వహించారు. ఆలయ ఆస్థాన మండపంలో జరిగిన ఈ పవిత్ర వేడుకలో మహిళలు పెద్ద సంఖ్యలో భక్తిశ్రద్ధలతో పాల్గొన్నారు. టీటీడీ ఈవో ముద్దాడ రవిచంద్ర, అదనపు ఈవో సిహెచ్. వెంకయ్య చౌదరి తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు. వేకువజామున అమ్మవారిని సుప్రభాత సేవతో మేల్కొలిపి సహస్రనామార్చన, నిత్యార్చన నిర్వహించారు. మూలవర్లు, ఉత్సవమూర్తులకు అభిషేకం చేశారు. బంగారు చీరతో విశేషంగా అలంకరించిన శ్రీ పద్మావతి అమ్మవారు భక్తులకు దివ్య దర్శనమిచ్చారు. అనంతరం ఉత్సవమూర్తిని ఆస్థాన మండపానికి వేంచేపు చేసి పద్మపీఠంపై ఆశీనులను చేశారు. విష్వక్సేనారాధన, పుణ్యాహవచనం, కలశస్థాపన, అంగపూజ, లక్ష్మీ సహస్రనామార్చన, అష్టోత్తర శతనామావళి తదితర వైదిక కార్యక్రమాలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. రోజా, మల్లె, చామంతి, సంపంగి, తామర, తులసి తదితర పుష్పాలతో అమ్మవారిని అర్చించారు. తొమ్మిది గ్రంథులతో అమ్మవారిని అలంకరించి ఒక్కో గ్రంథిని ఒక్కో దేవతకు ప్రతీకగా పూజించారు. అనంతరం 12 రకాల నైవేద్యాలను సమర్పించి మహా మంగళహారతితో వ్రతాన్ని ముగించారు. ఈ కార్యక్రమంలో టీటీడీ బోర్డు సభ్యులు జీ. భానుప్రకాశ్‌రెడ్డి, ఎన్. సదాశివరావు, సురేష్‌కుమార్, జానకీదేవి, రంగశ్రీ, సీవీఎస్‌వో మురళీకృష్ణ, ఆలయ డెప్యూటీ ఈవో హరీంద్రనాథ్, ఇతర అధికారులు, సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు

# కేసులో సాయం చేస్తా.. రూ.30 వేలు ఇవ్వు

**- ఇంట్లోనే రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుబడ్డ ఎస్ఐస్టేషన్ బెయిల్**

**- చార్జిషీట్‌లో అనుకూలంగా వ్యవహరిస్తానంటూ డిమాండ్- ఏసీబీ వలలో రాజంపేట ఎస్ఐ దువ్వల ఆంజనేయులు**

కామారెడ్డి (ప్రశ్న న్యూస్)చట్టాన్ని కాపాడాల్సిన ఖాకీ.. లంచం తీసుకుంటూ అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ)కు చిక్కారు. కేసులో సాయం చేస్తానంటూ ఓ బాధితుడి నుంచి రూ.30 వేల లంచం తీసుకుంటుండగా కామారెడ్డి జిల్లా రాజంపేట పోలీస్ స్టేషన్ ఎస్ఐ దువ్వల ఆంజనేయులు ఏసీబీ అధికారులకు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుబడ్డారు. ఆయన నివాసంలోనే ఈ వ్యవహారం జరగడం పోలీసు వర్గాల్లో కలకలం రేపింది.

### స్టేషన్ బెయిల్ కోసం..

రాజంపేట పోలీస్‌స్టేషన్ పరిధిలో నమోదైన ఓ కేసులో ఫిర్యాదుదారుడి కుమారుడికి స్టేషన్ బెయిల్ ఇప్పించడంతో పాటు తదుపరి చార్జిషీట్ దాఖలు సమయంలో అనుకూలంగా వ్యవహరిస్తానంటూ ఎస్ఐ ఆంజనేయులు లంచం డిమాండ్ చేసినట్లు ఏసీబీ అధికారులు తెలిపారు.

ఇందుకు బాధితుడి నుంచి రూ.30 వేల నగదు ఇవ్వాలని కోరినట్లు పేర్కొన్నారు.

డబ్బులు ఇవ్వడం ఇష్టం లేక బాధితుడు ఎస్ఐను ఎంతగా బతిమాలినా లంచం డిమాండ్ తగ్గలేదని సమాచారం. దీంతో చేసేదేమీ లేక బాధితుడు ఏసీబీ అధికారులను ఆశ్రయించి ఫిర్యాదు చేశారు.

### పక్కా స్కెచ్‌తో..

బాధితుడి ఫిర్యాదును స్వీకరించిన ఏసీబీ అధికారులు పక్కా ప్రణాళిక రూపొందించారు. వారి సూచనల మేరకు బాధితుడు ఎస్ఐను సంప్రదించాడు. గురువారం ఎస్ఐ ఆంజనేయులు తన నివాసంలో బాధితుడి నుంచి రూ.30 వేల లంచం స్వీకరిస్తుండగా ఏసీబీ అధికారులు ఒక్కసారిగా దాడి చేశారు. లంచం సొమ్ముతో ఎస్ఐను రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్న అధికారులు నగదును స్వాధీనం చేసుకున్నారు. అనంతరం నిందితుడైన ఎస్ఐను అదుపులోకి తీసుకుని అరెస్టు చేసినట్లు ఏసీబీ వర్గాలు వెల్లడించాయి.

### నాంపల్లి ప్రత్యేక కోర్టులో హాజరు

అవినీతి ఆరోపణలపై ఎస్ఐ ఆంజనేయులుపై కేసు నమోదు చేసిన ఏసీబీ అధికారులు తదుపరి న్యాయపరమైన చర్యలు చేపట్టారు. ఆయన్ను హైదరాబాద్ నాంపల్లిలోని ఎస్‌పీఈ, ఏసీబీ కేసుల ప్రత్యేక న్యాయమూర్తి ఎదుట హాజరుపరిచినట్లు అధికారులు తెలిపారు.

### లంచం అడిగితే 1064కు ఫిర్యాదు చేయండి

ప్రభుత్వ శాఖల్లో పనిచేసే అధికారులు, సిబ్బంది ఎవరైనా లంచం డిమాండ్ చేస్తే ప్రజలు భయపడకుండా ఏసీబీని ఆశ్రయించాలని అధికారులు సూచించారు.

లంచం ఇవ్వాల్సిన అవసరం లేదని, నేరుగా ఏసీబీకి సమాచారం అందించాలని కోరారు. ఏసీబీ టోల్‌ఫ్రీ నంబర్ 1064కు లేదా వాట్సాప్ నంబర్ 9440446106కు ఫిర్యాదు చేయవచ్చని తెలిపారు.

చట్టాన్ని అమలు చేయాల్సిన పోలీసు అధికారి, కేసులో అనుకూలంగా వ్యవహరిస్తానంటూ లంచం తీసుకుంటూ ఏసీబీకి పట్టుబడటం రాజంపేటలో చర్చనీయాంశంగా మారింది.



## రాయల్ కోటలో కనుమరుగైన లైటింగ్ షో..

# పర్యాటకుల ఆశలు ఆవిరి

**ఐదేళ్లుగా చీకట్లోనే చారిత్రక వైభవం..**

**ఏపీ టూరిజం ఇకనైనా మేల్కొంటుందా.?**



తిరుపతి(ప్రశ్న న్యూస్) ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన తిరుపతి నగరానికి వచ్చే దేశ, విదేశీ పర్యాటకులకు చారిత్రక వైభవాన్ని పరిచయం చేసే చంద్రగిరి రాయల్ కోటలో పర్యాటక ఆకర్షణగా నిలిచిన లైటింగ్ షో కనుమరుగై దాదాపు ఐదేళ్లు గడుస్తున్నా సంబంధిత అధికారులు పట్టించుకోకపోవడంపై సందర్శకులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఒకప్పుడు సాయంత్రం వేళ రంగురంగుల విద్యుత్ దీపాల వెలుగులు, చారిత్రక నేపథ్యాన్ని ప్రతిబింబించే లైటింగ్ షోతో సందర్శకులను మంత్రముగ్ధులను చేసిన కోట.. ప్రస్తుతం ఆ వెలుగులు లేక వెలవెలబోతోందని పర్యాటకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చారిత్రక ప్రాధాన్యం కలిగిన చంద్రగిరి కోట తిరుపతి పరిసరాల్లోని ప్రముఖ పర్యాటక ప్రాంతాల్లో ఒకటి. శ్రీవారి దర్శనం కోసం తిరుపతికి వచ్చే భక్తుల్లో కొంతమంది చంద్రగిరి కోటను కూడా సందర్శిస్తుంటారు. ముఖ్యంగా సాయంత్రం వేళ కుటుంబ సభ్యులు, చిన్నారులతో కలిసి కోటకు వచ్చే పర్యాటకులకు గతంలో నిర్వహించిన లైటింగ్ షో ప్రత్యేక ఆకర్షణగా ఉండేది. కోట చరిత్ర, రాజుల వైభవం, అప్పటి సంస్కృతి తదితర అంశాలను వెలుగులు, శబ్దాల సమన్వయంతో చూపించే కార్యక్రమం సందర్శకులను విశేషంగా ఆకట్టుకునేది.

### పిడుగుపాటుతో దెబ్బతిన్న షో

గతంలో పిడుగుపాటు కారణంగా లైటింగ్ షోకు సంబంధించిన పరికరాలు దెబ్బతిన్నట్లు తెలుస్తోంది. అప్పటి నుంచి కార్యక్రమం నిలిచిపోయినప్పటికీ.. దాన్ని పునరుద్ధరించి తిరిగి ప్రారంభించేందుకు అవసరమైన చర్యలు ఎందుకు తీసుకోలేదనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. పర్యాటకులను ఆకర్షించే కార్యక్రమాన్ని పూర్తిస్థాయిలో పునరుద్ధరించకుండా ఏళ్ల తరబడి వదిలేయడంపై స్థానికులు, పర్యాటకులు అసహనం వ్యక్తం చేస్తున్నారు.

### కోట్లాది మందికి ఆకర్షణగా మారే అవకాశం

తిరుపతి కేవలం ఆధ్యాత్మిక నగరం మాత్రమే కాదు.. చారిత్రక, సాంస్కృతిక, పర్యాటక సంపదకు నిలయంగా కూడా ఉంది. తిరుమల శ్రీవారి దర్శనానికి వచ్చే భక్తులకు చంద్రగిరి కోటను ఒక ముఖ్యమైన పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేస్తే స్థానిక పర్యాటక రంగానికి మరింత ఊతం లభించే అవకాశం ఉంది. కోటలో లైటింగ్ షోను ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో పునరుద్ధరించి, చారిత్రక కథనాలను ఆకట్టుకునే విధంగా ప్రదర్శిస్తే దేశ, విదేశీ పర్యాటకులను మరింతగా ఆకర్షించవచ్చని పర్యాటక రంగ నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

### చిన్నారులకు ప్రత్యేక ఆకర్షణ

గతంలో సాయంత్రం వేళ చంద్రగిరి కోటకు వెళ్లే కుటుంబాల్లో లైటింగ్ షో కోసం ప్రత్యేక ఆసక్తి కనిపించేది. కోట చరిత్రను కళ్లకు కట్టినట్లు చూపించే విధానం చిన్నారులను, పెద్దలను ఆకట్టుకునేది. ఇప్పుడు ఆ కార్యక్రమం లేకపోవడంతో కోటను సందర్శించే పర్యాటకులకు గతంలో ఉన్న అనుభూతి దక్కడం లేదని పలువురు అంటున్నారు.

### పర్యాటకుల ప్రశ్న.. అధికారుల సమాధానం ఎక్కడ?

దాదాపు ఐదేళ్లుగా లైటింగ్ షో నిలిచిపోయినా దాని పునరుద్ధరణకు సంబంధించి స్పష్టమైన చర్యలు కనిపించకపోవడంపై సందర్శకులు ప్రశ్నిస్తున్నారు. పర్యాటక ప్రాంతాల్లో కొత్త ఆకర్షణలను ఏర్పాటు చేయడం ఎంత ముఖ్యమో.. ఇప్పటికే ఉన్న ఆకర్షణలను కాపాడి, అవసరమైన మరమ్మతులు చేపట్టి నిరంతరం కొనసాగించడం కూడా అంతే ముఖ్యమని వారు చెబుతున్నారు.
చంద్రగిరి కోటకు వచ్చే పర్యాటకుల సంఖ్యను పెంచేందుకు ప్రత్యేక ప్రచార కార్యక్రమాలు చేపట్టడంతో పాటు, కోటలో నిలిచిపోయిన లైటింగ్ షోను తక్షణమే పునరుద్ధరించాలని వారు కోరుతున్నారు.

### పాత వైభవానికి కొత్త వెలుగులు ఎప్పుడు?

చరిత్రను చెప్పే కోటకు చీకటి ఎందుకు? పర్యాటకులను ఆకర్షించే లైటింగ్ షోకు మరమ్మతులు చేయడానికి ఇన్నేళ్లు ఎందుకు పట్టింది? పర్యాటకుల నుంచి వచ్చే ఆదాయాన్ని పెంచుకోవాలని భావిస్తున్న అధికారులు ఇప్పటికే ఉన్న ఆకర్షణలను ఎందుకు నిర్లక్ష్యం చేస్తున్నారు? అనే ప్రశ్నలు ఇప్పుడు వినిపిస్తున్నాయి. కోటను మరింత అభివృద్ధి చేయడంతో పాటు లైటింగ్, సౌండ్ అండ్ లైట్ షో, పార్కింగ్, పరిశుభ్రత, తాగునీరు, మార్గదర్శక సౌకర్యాలు వంటి మౌలిక వసతులను మెరుగుపరిస్తే చంద్రగిరి పర్యాటక కేంద్రానికి మరింత ఆదరణ పెరిగే అవకాశం ఉంది.

### ఇకనైనా మేల్కొనాలి!

ఏళ్లుగా నిలిచిపోయిన లైటింగ్ షోను పునరుద్ధరించేందుకు ఆంధ్రప్రదేశ్ టూరిజం శాఖ ఉన్నతాధికారులు తక్షణమే స్పందించాలని సందర్శకులు కోరుతున్నారు. అవసరమైన సాంకేతిక పరిశీలన చేపట్టి, దెబ్బతిన్న పరికరాలను మరమ్మతు చేయడం లేదా ఆధునిక సాంకేతికతతో కొత్త లైటింగ్ షోను ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేస్తున్నారు. చంద్రగిరి రాయల్ కోట కేవలం రాళ్లు, గోడల సమాహారం కాదని.. అది మన చరిత్రకు సజీవ సాక్ష్యమని పర్యాటకులు గుర్తుచేస్తున్నారు. అలాంటి చారిత్రక సంపదను ఆధునిక పర్యాటక ఆకర్షణలతో అనుసంధానిస్తే తిరుపతి పర్యాటక రంగానికి మరింత గుర్తింపు వస్తుందని చెబుతున్నారుఇకనైనా ప్రభుత్వం, ఏపీ టూరిజం ఉన్నతాధికారులు స్పందించి.. ఐదేళ్లుగా మూగబోయిన లైటింగ్ షోకు మళ్లీ వెలుగులు నింపుతారా? లేక చారిత్రక కోటలో చీకట్లు ఇలాగే కొనసాగుతాయా? అన్నది వేచి చూడాల్సిందే.

# తొట్టంబేడు డిప్యూటీ తహసిల్దార్ సస్పెండ్

**రూ.3 లక్షలు డిమాండ్ చేసినట్లు ఆరోపణలు,ఆడియోతో వెలుగులోకి వ్యవహారం**

**విచారణలో వాయిస్ జీవన్‌కుమార్‌దేనని నిర్ధారణ, మూడు అభియోగాలు నమోదు**



తిరుపతి(ప్రశ్న న్యూస్) లంచం డిమాండ్ చేశారన్న ఆరోపణలు, ప్రజాప్రతినిధులు, జిల్లా కలెక్టర్, మున్సిపల్ కమిషనర్‌పై నిరాధార ఆరోపణలు చేసిన ఆడియో వ్యవహారంలో తొట్టంబేడు తహసిల్దార్ కార్యాలయ డిప్యూటీ తహసిల్దార్ జీవన్‌కుమార్‌పై వేటు పడింది. ఆయన్ను సస్పెండ్ చేస్తూ తిరుపతి జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎస్.వెంకటేశ్వర్ ఉత్తర్వులు జారీ చేశారు.

### రూ.3 లక్షలు డిమాండ్?

తొట్టంబేడు మండలానికి చెందిన 0.09 సెంట్ల భూమికి సంబంధించి రూ.3 లక్షల అక్రమ లంచం డిమాండ్ చేసినట్లు ఆరోపణలు వెల్లువెత్తాయి. ఇదే సమయంలో శెట్టిపల్లి భూములకు సంబంధించి ప్రజాప్రతినిధులు, జిల్లా కలెక్టర్, మున్సిపల్ కమిషనర్‌పై నిరాధార, అసత్య ఆరోపణలు చేసినట్లు పేర్కొంటున్న ఆడియో రికార్డింగ్ ఒకటి సామాజిక మాధ్యమాల్లో వెలుగులోకి వచ్చింది.

### ఆడియోపై విచారణ

ఈ వ్యవహారంపై శ్రీకాళహస్తి రెవెన్యూ డివిజన్ అధికారులు క్షేత్రస్థాయిలో విచారణ చేపట్టారు. ఆడియో రికార్డింగ్‌ను పరిశీలించడంతో పాటు అందులోని వాయిస్‌ను అధికారులు పరిశీలించారు. సదరు వాయిస్ తొట్టంబేడు డిప్యూటీ తహసిల్దార్ జీవన్‌కుమార్‌దేనని విచారణలో గుర్తించినట్లు అధికారులు తమ నివేదికల్లో పేర్కొన్నారు.

### మూడు అభియోగాలు నమోదు

విచారణాధికారులు సమర్పించిన నివేదికలను పరిశీలించిన అనంతరం జిల్లా కలెక్టర్ జీవన్‌కుమార్‌ను సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. అంతేకాక ఆంధ్రప్రదేశ్ సివిల్ సర్వీసెస్ నిబంధనల మేరకు ఆయనపై మూడు అభియోగాలను నమోదు చేసి, శాఖాపరమైన తదుపరి చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఈ వ్యవహారం రెవెన్యూ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది.

# తెరపై షావుకారు.. జీవితంలో జానకి

**- ఏడు దశాబ్దాల నటనకు నిలువెత్తు నిదర్శనం.. 400కు పైగా చిత్రాలతో చెరగని ముద్ర**

**- హీరోయిన్‌గా వెలిగి.. క్యారెక్టర్ ఆర్టిస్ట్‌గా మెరిసి.. పద్మశ్రీతో భారతీయ సినీ గౌరవం అందుకున్న మహానటి**



చెన్నై(ప్రశ్న న్యూస్ ) షావుకారు జానకి పై ప్రత్యేక కథనం దక్షిణ భారత సినీ చరిత్రలో ఓ శకం ముగిసింది. తెలుగు, తమిళ, కన్నడ, మలయాళ భాషల్లో తనదైన నటనా శైలితో ఏడు దశాబ్దాలకు పైగా ప్రేక్షకులను అలరించిన ప్రముఖ నటి షావుకారు జానకి (94) కన్నుమూశారు. చెన్నైలోని కావేరి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ శుక్రవారం తుదిశ్వాస విడిచారు. వయోభారంతో వచ్చిన అనారోగ్య సమస్యలతో ఆమె మృతి చెందినట్లు తాజా నివేదికలు వెల్లడించాయి. సినిమా అంటే కేవలం అందం, గ్లామర్ మాత్రమే కాదని.. పాత్రలో జీవించడం, భావాన్ని కళ్లతో పలికించడం, మాటలో బరువు చూపించడం, మౌనంలోనూ భావోద్వేగాన్ని పండించడం కూడా నటనేనని నిరూపించిన కళాకారిణి షావుకారు జానకి. నాలుగు వందలకు పైగా చిత్రాల్లో నటించి, వందలాది పాత్రలకు ప్రాణం పోసిన ఆమె ప్రయాణం దక్షిణ భారత సినీ చరిత్రలో ప్రత్యేక అధ్యాయం.

### ‘షావుకారు’తో మొదలైన ప్రయాణం

సంకరమంచి జానకిగా జన్మించిన ఆమెకు సినీ ప్రపంచం ఇచ్చిన గుర్తింపే ‘షావుకారు జానకి’. 1950లో ఎల్.వి. ప్రసాద్ దర్శకత్వంలో తెరకెక్కిన తెలుగు చిత్రం షావుకారుతో ఆమె వెండితెరకు పరిచయమయ్యారు. ఆ సినిమా పేరే ఆమె ఇంటిపేరుగా మారిపోయింది. ఆ తర్వాత వెనుదిరిగి చూడలేదు. ఆ కాలంలో మహిళలు సినిమాల్లోకి రావడమే పెద్ద సవాలుగా ఉన్న సమయంలో జానకి సినీ రంగంలోకి అడుగుపెట్టి తనకంటూ ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకున్నారు. వివాహానంతరం కూడా నటనా రంగంలో కొనసాగడం ఆమె కాలానికి ఎంతో ధైర్యమైన నిర్ణయంగా నిలిచింది. సంప్రదాయ కుటుంబ నేపథ్యం నుంచి వచ్చిన ఆమె తన ప్రతిభతోనే సినీ ప్రపంచంలో స్థిరపడింది.

### హీరోయిన్‌గా ఓ వెలుగు వెలుగు

1950 నుంచి 1970ల మధ్య కాలంలో షావుకారు జానకి అగ్రశ్రేణి కథానాయికగా వెలుగొందారు. తెలుగు, తమిళ చిత్రాల్లో ప్రముఖ హీరోల సరసన నటిస్తూ తన నటనతో ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్నారు. రోజులు మారాయి, కన్యాశుల్కం, జయం మనదే, పాండురంగ మహాత్మ్యం, డాక్టర్ చక్రవర్తి, అక్కాచెల్లెలు, బడిపంతులు వంటి తెలుగు చిత్రాలు ఆమె కెరీర్‌లో ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకున్నాయి. తమిళంలో వలయాపతి, పానం పడుత్తుమ్ పాడు, పల్లుం పళముం, పుతియా పరవై, ఇరు కోడుగల్, ఎదిర్ నీచల్, ఉయర్న్ద మనిధన్ వంటి చిత్రాల్లో ఆమె నటనకు ప్రశంసలు దక్కాయి.

### పాత్ర ఏదైనా.. జానకి ముద్ర మాత్రం ప్రత్యేకమే

షావుకారు జానకి నటనలో ప్రధాన బలం ఆమె సహజత్వం. పాత్రను కేవలం పలకడం కాదు.. ఆ పాత్రను జీవించడం ఆమె ప్రత్యేకత.
ఆమె ముఖంలో కనిపించే ప్రశాంతత, అవసరమైన చోట కఠినత్వం, మాటల్లోని స్పష్టత, కళ్లలో పలికే భావోద్వేగం ప్రేక్షకులను ఆకట్టుకునేవి. హీరోయిన్‌గా ప్రేమ, కుటుంబ భావోద్వేగాలను పండించిన ఆమె.. తర్వాత తల్లి, అత్త, భార్య, పెద్దమనిషి, ఆత్మగౌరవం ఉన్న మహిళ వంటి విభిన్న పాత్రల్లోనూ తనదైన ముద్ర వేశారు.
ఒకే రకమైన పాత్రలకు పరిమితం కాకుండా వయసుకు అనుగుణంగా తన పాత్రలను మార్చుకుంటూ రావడం ఆమె నటనా ప్రయాణంలోని గొప్పతనం.

### కె. బాలచందర్‌తో కొత్త అధ్యాయం

తమిళ దర్శక దిగ్గజం కె. బాలచందర్‌తో షావుకారు జానకి చేసిన చిత్రాలు ఆమె నటనా ప్రతిభకు మరో కోణాన్ని పరిచయం చేశాయి. ఇరు కోడుగల్ వంటి చిత్రాల్లో ఆమె నటనకు విశేష ప్రశంసలు లభించాయి. ఆ చిత్రానికి తమిళనాడు రాష్ట్ర ఉత్తమ నటి అవార్డు కూడా దక్కింది.
సినిమాలో కథానాయిక పాత్రలకు మాత్రమే పరిమితం కాకుండా బలమైన కథ, భావోద్వేగం ఉన్న పాత్రలను ఎంచుకోవడం ద్వారా జానకి తనను తాను నటిగా నిరూపించుకున్నారు.

### హీరోయిన్ నుంచి క్యారెక్టర్ ఆర్టిస్ట్‌గా..

కాలం మారింది. సినిమా మారింది. హీరోయిన్ల వయసు, పాత్రల స్వరూపం మారాయి. అయితే షావుకారు జానకి మాత్రం తెరకు దూరం కాలేదు.
హీరోయిన్ పాత్రల నుంచి క్యారెక్టర్ పాత్రలకు సహజంగా మారిన ఆమె.. రెండో ఇన్నింగ్స్‌లోనూ ప్రేక్షకులను మెప్పించారు. తిల్లుముల్లు, వెట్రి విజా, హే రామ్, దేవి వంటి చిత్రాల్లో ఆమె నటన మరో తరానికి పరిచయమైంది. తెలుగు చిత్రాల్లోనూ తల్లి, పెద్దమనిషి, కుటుంబ పెద్ద వంటి పాత్రల్లో తనదైన ముద్ర వేశారు.

### నటనే కాదు.. రంగస్థలానికీ సేవ

షావుకారు జానకి కేవలం వెండితెర నటి కాదు. రంగస్థల కళాకారిణిగానూ ఆమెకు విశేష అనుభవం ఉంది. వందలాది స్టేజ్ షోలు, నాటక ప్రదర్శనల్లో పాల్గొన్నారు. రేడియో కళాకారిణిగానూ తన ప్రతిభను చాటుకున్నారు. సినీ నటనకు ముందు, నటనకు సమాంతరంగా రంగస్థలం ఆమె కళా ప్రయాణానికి బలమైన పునాది వేసింది.
రంగస్థల అనుభవమే తెరపై భావాలను మరింత సహజంగా పలికించేందుకు తనకు ఎంతో ఉపయోగపడిందని ఆమె గురించి వచ్చిన జీవిత చరిత్ర వివరాలు సూచిస్తున్నాయి.

### అగ్ర నటులతో కలిసి నటించిన అరుదైన అవకాశం

దక్షిణ భారత సినీ పరిశ్రమలోని అనేక తరాల అగ్ర నటులతో కలిసి నటించిన అరుదైన ఘనత షావుకారు జానకికి ఉంది. ఎన్టీఆర్, ఏఎన్నార్, శివాజీ గణేశన్, డాక్టర్ రాజ్‌కుమార్ వంటి ప్రముఖ నటులతో పాటు అనేక మంది దిగ్గజాలతో ఆమె తెరను పంచుకున్నారు. తమిళ చిత్రాల్లో ఎంజీఆర్, జయలలిత వంటి ప్రముఖులతోనూ నటించారు.
ఒక తరం నటులతో కలిసి నటించిన కళాకారిణి.. మరో తరానికి తల్లిగా, పెద్దమనిషిగా కనిపించారు. తదుపరి తరంలోనూ తన ఉనికిని చాటుకున్నారు. అందుకే ఆమె కెరీర్ ఒక నటికి సంబంధించిన ప్రయాణం మాత్రమే కాదు.. దక్షిణ భారత సినిమా పరిణామానికి సాక్ష్యంగా నిలిచిన ప్రయాణం.

### పురస్కారాలు.. గౌరవాలు

షావుకారు జానకి ప్రతిభకు ఎన్నో పురస్కారాలు లభించాయి. తమిళనాడు ప్రభుత్వం అందించే కలైమామణి పురస్కారం, తమిళనాడు రాష్ట్ర ఉత్తమ నటి పురస్కారం, నంది అవార్డులు, జీవిత సాఫల్య పురస్కారాలు, సౌత్ ఇండియన్ ఇంటర్నేషనల్ మూవీ అవార్డ్స్ లైఫ్‌టైమ్ అచీవ్‌మెంట్ అవార్డు వంటి అనేక గౌరవాలు ఆమెను వరించాయి.
అన్నింటికంటే ముఖ్యంగా భారత ప్రభుత్వం 2022లో ఆమెకు పద్మశ్రీ పురస్కారాన్ని ప్రదానం చేసింది. దక్షిణ భారత సినీ రంగానికి ఆమె చేసిన విశేష సేవలకు ఇది జాతీయ స్థాయిలో లభించిన గౌరవంగా నిలిచింది.

### 400 సినిమాలు.. ఏడు దశాబ్దాలు..

షావుకారు జానకి సినీ ప్రస్థానం సంఖ్యలతో చెప్పాలంటేనే ఆశ్చర్యం కలిగిస్తుంది. నాలుగు వందలకు పైగా చిత్రాల్లో నటించిన ఆమె కెరీర్ ఏడు దశాబ్దాలకు పైగా కొనసాగింది. తాజా నివేదికలు ఆమె 400కు పైగా చిత్రాల్లో నటించినట్లు పేర్కొంటున్నాయి. ఆమె చివరి చిత్రాల్లో 2023లో వచ్చిన తెలుగు చిత్రం అన్ని మంచి శకునములే కూడా ఉంది.
తొలి చిత్రం నుంచి చివరి దశ వరకు నటనపై ఆమెకున్న ఆసక్తి తగ్గలేదు. వయసు పెరిగినా కళపై ప్రేమ తగ్గలేదు. అదే ఆమెను ఇతర నటీమణుల నుంచి ప్రత్యేకంగా నిలబెట్టింది.

### సినిమా రంగంలో ఒడిదుడుకులు.. అయినా వెనక్కి తగ్గని ధైర్యం

సినీ ప్రయాణం ఎప్పుడూ పూలబాట కాదు. కథానాయికగా ఉన్న కాలం ముగిసిన తర్వాత కొత్త తరహా పాత్రలను అంగీకరించాల్సి వచ్చింది. సినీ పరిశ్రమలో మారుతున్న ధోరణులకు అనుగుణంగా తనను తాను మార్చుకోవాల్సి వచ్చింది. అయినప్పటికీ అవకాశాల కోసం తన వ్యక్తిత్వాన్ని కోల్పోకుండా, పాత్రకు ప్రాధాన్యం ఉన్నప్పుడు మాత్రమే తెరపై కనిపించడం ఆమె ప్రత్యేకత.
హీరోయిన్ అనే ఇమేజ్ నుంచి క్యారెక్టర్ ఆర్టిస్ట్‌గా మారడం చాలామందికి కష్టమైన ప్రక్రియ. కానీ జానకి మాత్రం దాన్ని సవాల్‌గా స్వీకరించారు. అందుకే ఆమె రెండో ఇన్నింగ్స్ కూడా తొలి ఇన్నింగ్స్ మాదిరిగానే గుర్తుండిపోయింది.

### నటనకు వయసు అడ్డుకాదని నిరూపణ

“నటికి వయసు పెరిగితే అవకాశాలు తగ్గుతాయి” అనే సాధారణ భావనను షావుకారు జానకి తన కెరీర్‌తోనే తప్పని నిరూపించారు. బాలనటిగా కాదు.. యువ కథానాయికగా కాదు.. మధ్య వయసులో కాదు.. వృద్ధాప్యంలోనూ పాత్రలకు ప్రాణం పోసిన నటి ఆమె.
కెమెరా ముందు నిలబడినప్పుడు వయసు కనిపించకూడదు.. పాత్ర మాత్రమే కనిపించాలనే సిద్ధాంతాన్ని తన నటనతో చూపించారు.

### ఒక శకం ముగిసింది.. జ్ఞాపకం మిగిలింది

షావుకారు జానకి ఇక భౌతికంగా మన మధ్య లేకపోయినా.. ఆమె నటించిన పాత్రలు మాత్రం ప్రేక్షకుల జ్ఞాపకాల్లో చిరస్థాయిగా నిలిచిపోతాయి. షావుకారుతో మొదలైన ఆమె ప్రయాణం.. నాలుగు వందలకు పైగా చిత్రాలను దాటి.. పద్మశ్రీ వరకు చేరింది. తెలుగు నేల నుంచి దక్షిణ భారత సినిమా నాలుగు భాషల వరకూ విస్తరించిన ఆమె కళా ప్రస్థానం.. నటనకు భాష లేదని, వయసు లేదని, పాత్ర చిన్నదా పెద్దదా అనేది ముఖ్యం కాదని చాటిచెప్పింది. షావుకారు జానకి ఒక నటి మాత్రమే కాదు.. ఒక నటనా పాఠశాల. ఒక తరం కథానాయిక. మరో తరానికి ఆదర్శం. అనంతరం వచ్చిన తరాలకు స్ఫూర్తి. వెండితెరపై ఆమె పలికించిన సంభాషణలు మౌనమైపోయినా.. ఆమె కళ్లతో పలికించిన భావాలు మాత్రం ఎప్పటికీ ప్రేక్షకుల హృదయాల్లో జీవిస్తూనే ఉంటాయి. షావుకారు జానకి మరణంతో దక్షిణ భారత సినీ చరిత్రలో ఓ స్వర్ణాధ్యాయం ముగిసింది. కానీ ఆమె నటనా వైభవం మాత్రం ఎప్పటికీ చెరిగిపోదు.

# ప్రజల సమస్యల పరిష్కారమే కూటమి ప్రభుత్వ లక్ష్యం

**జర్నలిస్టుల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉంది**

**అక్రిడిటేషన్ జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు, హెల్త్ కార్డులు కల్పించాలి: ఎమ్మెల్యే గళ్ళా మాధవి**



గుంటూరు(ప్రశ్న న్యూస్) ప్రజల సమస్యలను పరిష్కరించడమే కూటమి ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని గుంటూరు పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే గళ్ళా మాధవి అన్నారు. అదే విధంగా ప్రజాస్వామ్యానికి నాలుగో స్థంభంగా ఉన్న జర్నలిస్టుల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలిపారు. శుక్రవారం గుంటూరు పశ్చిమ నియోజకవర్గ టీడీపీ కార్యాలయంలో నిర్వహించిన ప్రజా గ్రీవెన్స్ కార్యక్రమంలో ఆమె ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ప్రజా సమస్యలను నేరుగా తెలుసుకుని వాటి పరిష్కారానికి సంబంధిత అధికారులతో మాట్లాడారు. పెద్ద సంఖ్యలో ప్రజలు గ్రీవెన్స్‌కు హాజరై తమ సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. అర్జీలను పరిశీలించి సాధ్యమైనంత త్వరగా పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు.

### ప్రతి శుక్రవారం ప్రజా గ్రీవెన్స్

ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు ప్రతి శుక్రవారం రాష్ట్రవ్యాప్తంగా నిర్వహిస్తున్న ప్రజా గ్రీవెన్స్ కార్యక్రమం ప్రజలకు ఎంతో ఉపయోగకరంగా మారిందని గళ్ళా మాధవి తెలిపారు. ప్రజలకు నిత్యం అందుబాటులో ఉండి వారి సమస్యలను తెలుసుకుని పరిష్కరించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తోందన్నారు. ప్రజల నుంచి వచ్చిన అర్జీలపై వెంటనే స్పందించడంతో సమస్యలు పరిష్కారమవుతున్నాయని, ప్రజలు సంతృప్తితో వెళ్తున్నారని పేర్కొన్నారు.

### అభివృద్ధి.. సంక్షేమం రెండు కళ్లుగా..

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి అభివృద్ధి, సంక్షేమాన్ని రెండు కళ్లుగా భావించి ముందుకు సాగుతోందని ఎమ్మెల్యే అన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నాయకత్వంలో రాష్ట్రాభివృద్ధి, ప్రజాసంక్షేమానికి ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోందన్నారు. ప్రతి వర్గం, ప్రతి వృత్తి, ప్రతి సంస్థ సమస్యలను గుర్తించి పరిష్కరించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని చెప్పారు.

### జర్నలిస్టుల సంక్షేమంపై అసెంబ్లీలో గళం

అసెంబ్లీ వర్షాకాల సమావేశాల్లో జర్నలిస్టుల సంక్షేమంపై తాను ప్రస్తావించిన అంశాలను ఎమ్మెల్యే వివరించారు. జర్నలిస్టులు ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య వారధిగా పనిచేస్తున్నారని అన్నారు. ప్రజలకు వాస్తవ సమాచారాన్ని అందించేందుకు ఎన్నో ఇబ్బందులు, ప్రమాదాలను ఎదుర్కొంటూ విధులు నిర్వహిస్తున్న జర్నలిస్టులకు భద్రత, సంక్షేమం ఎంతో అవసరమని పేర్కొన్నారు. అక్రిడిటేషన్ కలిగిన జర్నలిస్టులకు హౌసింగ్ సదుపాయం కల్పించడంతో పాటు ఆరోగ్య భద్రత కోసం హెల్త్ కార్డులు అందించాలని అసెంబ్లీలో ప్రభుత్వాన్ని కోరినట్లు తెలిపారు. తక్కువ వేతనాలతో నిరంతర ఒత్తిడిలో పనిచేస్తున్న జర్నలిస్టులకు వారి కుటుంబాలకు భరోసా కల్పించేలా గృహ వసతి, వైద్య భద్రత కల్పించాల్సిన అవసరం ఉందన్నారు.

### జర్నలిస్టు కాలనీలకు ప్రాధాన్యం

గతంలో చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో జర్నలిస్టుల సంక్షేమానికి ప్రత్యేక చర్యలు చేపట్టారని, జర్నలిస్టు కాలనీల ఏర్పాటుకు ప్రాధాన్యం ఇచ్చారని గళ్ళా మాధవి గుర్తుచేశారు. గతంలో జర్నలిస్టుల సంక్షేమం కోసం జారీ చేసిన ప్రభుత్వ ఉత్తర్వులను అమలు చేయడంతో పాటు, ప్రస్తుత పరిస్థితులకు అనుగుణంగా మరిన్ని సంక్షేమ చర్యలు చేపట్టాలని కోరారు.
గత ఐదేళ్లలో అనేక వర్గాల మాదిరిగానే జర్నలిస్టుల సమస్యలు కూడా నిర్లక్ష్యానికి గురయ్యాయని ఆమె విమర్శించారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం ప్రతి వర్గం సమస్యలపై దృష్టి సారిస్తోందన్నారు.

### అమరావతితో పాటు జిల్లా కేంద్రాల్లో ఇళ్ల స్థలాలు

అమరావతి రాజధాని ప్రాంతంతో పాటు రాష్ట్రంలోని ప్రతి జిల్లా కేంద్రంలో జర్నలిస్టులకు హౌసింగ్ సదుపాయం లేదా ఇంటి స్థలాలు కేటాయించే అంశాన్ని ప్రభుత్వం పరిశీలించాలని తాను కోరినట్లు ఎమ్మెల్యే తెలిపారు. ప్రస్తుత ఆర్థిక పరిస్థితుల్లో హౌసింగ్ వంటి అంశాలపై నిర్ణయాలు తీసుకోవడం సవాలుతో కూడుకున్నప్పటికీ, ప్రతి వర్గానికి న్యాయం చేయాలనే సంకల్పంతో ప్రభుత్వం ముందుకు సాగుతోందన్నారు.
ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు జర్నలిస్టుల సమస్యలపై సానుకూలంగా స్పందిస్తారనే నమ్మకం ఉందని, రానున్న రోజుల్లో జర్నలిస్టుల హౌసింగ్, హెల్త్ కార్డుల అంశంపై ప్రభుత్వం సానుకూల నిర్ణయం తీసుకుంటుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

### ఎమ్మెల్యేకు జర్నలిస్టుల అభినందనలు

అసెంబ్లీలో జర్నలిస్టుల సంక్షేమం కోసం సమస్యలను ప్రస్తావించినందుకు పలు జర్నలిస్టు సంఘాల ప్రతినిధులు ఎమ్మెల్యే గళ్ళా మాధవిని కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఆమెను సత్కరించి అభినందించారు.

ప్రజల సమస్యల పరిష్కారం, జర్నలిస్టుల సంక్షేమం, రాష్ట్రాభివృద్ధి అనే మూడు ప్రధాన లక్ష్యాలతో కూటమి ప్రభుత్వం పనిచేస్తోందని గళ్ళా మాధవి తెలిపారు. ప్రజలు ప్రభుత్వానికి సహకరించి కొంత సమయం ఇస్తే ప్రతి వర్గానికి న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటామని ఆమె విశ్వాసం వ్యక్తం చేశారు.

# 23తేదీ అర్ధరాత్రి నుండి ఆటోలు బంద్ బంద్ కు సంబంధించిన పోస్టర్ విడుదల



మేడ్చల్ (ప్రశ్న న్యూస్ ) ఈనెల 23 అర్ధరాత్రి నుండి ఆటో డ్రైవర్లు బందును పాటించనున్నారు. ఈ మేరకు తెలంగాణ రాష్ట్ర ఆటో, యాప్ ఆధారిత సంఘాల జేఏసీ పోస్టర్ ను విడుదల చేసింది. ఈ సందర్భంగా బి ఆర్ టి యు నేతలు మాట్లాడుతూ ఆర్టీసీ యాజమాన్యానికి ఇవి ఆటోలను ఇవ్వాలనే ప్రతిపాదనను ఉపసంహరించుకోవాలని, ఆటో రవాణా రంగ కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. పెరిగిన పెట్రోల్ డీజిల్, గ్యాస్ నిత్యవసర వస్తువులు ధరలకు అనుగుణంగా ఆటో మీటర్ల చార్జీలను పెంచాలని, ఓలా ఉబర్ రాపిడో యాప్ కు అనుగుణంగా ప్రభుత్వమే కొత్త యాప్ ను తీసుకురావాలని డిమాండ్ చేశారు. ఆటో కార్మికుల జీవనోపాధిని దెబ్బతీస్తున్న ఓలు ఉబర్ ర్యాపిడో ద్వారా నడుస్తున్న టూవీలర్లను నిషేధించి ఆటో కార్మికులకు న్యాయం చేయాలని కోరారు. ఆటో డ్రైవర్లకు సంవత్సరానికి రూ. 12 ఇవ్వాలని , రోజువారిగా ప్రజలకు సౌకర్యం కల్పించే ఆటో డ్రైవర్లకు ఈ చాలన్ల నుంచి మినహాయింపు ఇవ్వాలని, హైదరాబాద్ నగరంలో అక్రమంగా నడుస్తున్న ఇతర జిల్లాల ఆటోలను నిషేధించాలని, వాహన సారథి పోర్టల్ లో ఆటో డ్రైవింగ్ లైసెన్స్ కొనసాగించాలని కోరారు రవాణా వాహనాలకు రేడియం స్టిక్కర్స్ జీవో ఎంఎస్ నెంబర్ 60లో ఆటోలను మినహాయించాలని, యాక్సిడెంట్ బీమా ను కొనసాగించాలని సాధారణ మరణాలకు, 50 సంవత్సరాలు పూర్తి అయిన వారికి పింఛన్లు ఇవ్వాలని, ఆత్మహత్య చేసుకున్న వారి ని వెంటనే ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బి ఆర్ టి యు రాష్ట్ర అధ్యక్షులు వేముల మారయ్య, ఐఎన్టియుసి ఆటో యూనియన్ నేతలు మల్లేష్, ఎర్ర విజయరావ్,నర్సింగ్, ఓం రాజు, ఉషాన్ జహంగీర్ రాజు వెంకటేష్ , శ్రీకాంత్,శ్రీధర్, మల్లేష్, సత్యనారాయణ శ్రీనివాస్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు

# రైతులు ఆర్థికంగా ఎదగాలి

**రైతులే నాణ్యమైన విత్తనాలను ఉత్పత్తి చేయాలి**

**సహకార సంఘాలు బలోపేతం కావాలి**

**: నాబార్డ్ డీజీఎం సోమనాథ్ భట్టాచార్య**




గజ్వేల్ ( ప్రశ్న న్యూస్ )జగదేవపూర్, రైతులు ఆర్థికంగా అభివృద్ధి చెందడంతో పాటు సహకార సంఘాలను బలోపేతం చేసే లక్ష్యంతో నాణ్యమైన విత్తనోత్పత్తిని ప్రోత్సహిస్తున్నట్లు నాబార్డ్ డీజీఎం సోమనాథ్ భట్టాచార్య తెలిపారు.ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం, నాబార్డ్ ఆధ్వర్యంలో సిద్దిపేట జిల్లాలో విత్తనోత్పత్తిని ప్రోత్సహించేందుకు జగదేవపూర్, హుస్నాబాద్, గంగాపూర్ సహకార సంఘాలను ఎంపిక చేశారు. ఇందులో భాగంగా శుక్రవారం జగదేవపూర్‌లో తెలంగాణ రైతు విజ్ఞాన కేంద్రం, సిద్దిపేట మరియు నాబార్డ్ ఆధ్వర్యంలో విత్తనోత్పత్తిపై అవగాహన సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా నాబార్డ్ డీజీఎం సోమనాథ్ భట్టాచార్య మాట్లాడుతూ రైతులకు నాణ్యమైన వరి విత్తనాలను అందించడంతో పాటు సహకార సంఘాలు ఆర్థికంగా బలోపేతం కావాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని ప్రారంభించినట్లు తెలిపారు.తెలంగాణ రైతు విజ్ఞాన కేంద్రం, సిద్దిపేట శాస్త్రవేత్త డాక్టర్ పల్లవి మాట్లాడుతూ ఫౌండేషన్ విత్తనాలను వినియోగించడం ద్వారా వరి దిగుబడి 10 నుంచి 15 శాతం వరకు పెరిగే అవకాశం ఉందన్నారు. ప్రస్తుతం తెలంగాణలో 90 నుంచి 95 శాతం వరి విత్తనాల మార్కెట్ ప్రైవేట్ విత్తన సంస్థల ఆధిపత్యంలో ఉండటంతో రైతులపై అధిక ఆర్థిక భారం పడుతోందన్నారు. ఈ భారాన్ని తగ్గించేందుకు రైతులే నాణ్యమైన విత్తనాలను ఉత్పత్తి చేసుకునేలా కార్యక్రమాన్ని అమలు చేస్తున్నట్లు వివరించారు.ఈ పథకం కింద ప్రతి సహకార సంఘం పరిధిలో ఐదు ఎకరాల్లో సాగు చేసేందుకు ఐదుగురు రైతులకు కేఎన్‌ఎం-1638 సన్న రకం బ్రీడర్ సీడ్ అందజేసినట్లు తెలిపారు. ఈ రకం 120 నుంచి 130 రోజుల్లో కోతకు వస్తుందని, ఉల్లికోడు, అగ్గి తెగుళ్లను తట్టుకునే సామర్థ్యం కలిగి ఉంటుందని వివరించారు.రైతులు పండించిన ధాన్యాన్ని సహకార సంఘాలు క్వింటాల్‌కు రూ.2,900 నుంచి రూ.3,000 వరకు కొనుగోలు చేస్తాయని తెలిపారు. అనంతరం ధాన్యాన్ని ప్రాసెసింగ్ చేసి ఫౌండేషన్ ట్యాగ్‌తో నాణ్యమైన విత్తనాలుగా తయారు చేసి రైతులకు అందజేస్తామని చెప్పారు. విత్తన ప్రాసెసింగ్, బ్యాగులు, రవాణా తదితర ఖర్చులు పోను సహకార సంఘాలకు మంచి ఆదాయం లభిస్తుందని, ఐదు ఎకరాల్లో సుమారు 100 క్వింటాళ్ల దిగుబడి వస్తే దాదాపు రూ.3 లక్షల వరకు లాభం పొందే అవకాశం ఉందన్నారు.అనంతరం విత్తనోత్పత్తిలో భాగంగా బస్వాపూర్ గ్రామంలో ఎంపిక చేసిన రైతు పొలాన్ని అధికారులు, శాస్త్రవేత్తలు సందర్శించి పంట పరిస్థితిని పరిశీలించారు.జగదేవపూర్ సహకార సంఘం చైర్మన్ ఇంద్రసేనారెడ్డి మాట్లాడుతూ విత్తనోత్పత్తి కోసం తమ సహకార సంఘాన్ని ఎంపిక చేసినందుకు తెలంగాణ రైతు విజ్ఞాన కేంద్రం, సిద్దిపేట మరియు నాబార్డ్ అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో నాబార్డ్ డీడీఎం నిఖిల్, డీసీసీబీ బ్యాంక్ మేనేజర్ నాగభూషణం, బ్యాంక్ ఫీల్డ్ ఆఫీసర్ గోవర్ధన్, జగదేవపూర్ సహకార సంఘం సీఈవో రాములు తదితరులు పాల్గొన్నారు.ద

# శ్రీశైల దేవస్థాన చీఫ్ సెక్యూరిటీ అధికారి విధుల్లో నుండి శాశ్వతంగా తొలగింపు

**- ఉత్తర్వులు జారీ చేసిన ఆలయ**

**కార్యనిర్వహణ అధికారి ఎం.శ్రీనివాసరావు**



శ్రీశైలం (ప్రశ్న న్యూస్) శ్రీశైల మహాక్షేత్రంలో చీప్ సెక్యూరిటీ అధికారిగా విధులు నిర్వహిస్తున్న బి. శ్రీనివాసరావును విధుల్లో నుండి శాశ్వతంగా తొలగిస్తూ ఆలయ కార్యా నిర్వహణ అధికారి ఎం. శ్రీనివాసరావు ఉత్తర్వులు జారీ చేశారు.ఈ సందర్భంగా ఆలయ కార్యనిర్వాన అధికారి మాట్లాడుతూ గత నెల 29వ తేదీ మధ్యాహ్నం ఆలయం మూసి వేయబడిన సమయంలో సర్కిల్ ఇన్స్పెక్టర్ దేవస్థానం అధికారుల అనుమతి లేకుండా బలవంతంగా ఆలయ ప్రవేశం చేసినట్టు తెలియజేశారు.సదర సంఘటన చాలా రోజుల క్రితం జరిగినందున జరిగిన సంఘటనను జరిగిన దేవస్థాన అధికారులకు రాతపూర్వకంగా సిఎస్ఓ ఇవ్వకపోవడంతో వారి పై చర్యలు తీసుకోవడం జరిగింది.అదేవిధంగా దేవాలయంలో నిర్వహణలో దేవస్థాన రక్షణ సిబ్బంది మరియు స్థానిక పోలీస్ అధికారులు సమన్వయం పాటించి సమన్వయంతో దేవాలయము సందర్శనకు వచ్చే భక్తులకు రక్షణ బాధ్యతలను చూడవలసి ఉండగా సదరు విషయంలో ఇరువురు విస్మరించుకుంటూ ఉన్నారు.సామాజిక మద్యమాలలో బహిర్గతం కాబడి దేవస్థానం పరువు ప్రతిష్టలు తీవ్ర భంగం కలగడంతో చీఫ్ సెక్రటరీ అధికారిని విధుల్లో నుంచి తొలగిస్తూ ఈ ఉత్తర్వులు జారీ చేయడం జరిగిందని ఈ ఓ తెలిపారు.ఈ సందర్భంగా చీఫ్ సెక్యూరిటీ అధికారిగా ఎం.మల్లికార్జున పర్యవేక్షకులను అదనపు బాధ్యతలను కేటాయిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

# బీసీ మహిళలకు గుడ్ న్యూస్..

# ఇంటింటికీ 'ఇందిరమ్మ కుట్టుమిషన్'

**100 శాతం సబ్సిడీపై**

**ఆటోమేటిక్ కుట్టుమిషన్లు**

**మేడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లాలో పైలెట్**

**ప్రాతిపదికన అమలు.. ప్రతి**

**నియోజకవర్గానికి 1,000 యూనిట్లు**



మేడ్చల్ (ప్రశ్న న్యూస్) మేడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లా బీసీ మహిళలకు ప్రభుత్వం శుభవార్త అందించింది. మహిళలకు స్వయం ఉపాధి కల్పించి ఆర్థికంగా స్వావలంబన సాధించేలా 'ఇంటింటికీ ఇందిరమ్మ కుట్టుమిషన్' పథకాన్ని అమలు చేయడానికి ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఈ పథకం కింద అర్హులైన బీసీ మహిళలకు 100 శాతం సబ్సిడీపై ఆటోమేటిక్ కుట్టుమిషన్లు అందించనున్నారు.టైలరింగ్‌పై ఆసక్తి, నైపుణ్యం ఉన్న మహిళలు ఇంటి వద్ద నుంచే ఉపాధి పొందేలా ఈ పథకాన్ని రూపొందించారు. ఒక్కో కుట్టుమిషన్ యూనిట్ విలువను రూ.12 వేలుగా ప్రభుత్వం నిర్ణయించినట్లు అధికారులు పేర్కొంటున్నారు.

## జిల్లాలో 5 వేల యూనిట్లు

మేడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లాలోని 5 అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఈ పథకాన్ని పైలెట్ ప్రాతిపదికన అమలు చేయనున్నారు. ప్రతి నియోజకవర్గానికి 1,000 యూనిట్ల చొప్పున మొత్తం 5,000 కుట్టుమిషన్లు అందించే విధంగా ప్రణాళిక రూపొందించినట్లు సమాచారం.

## అర్హతలు ఇవే..

ఈ పథకానికి దరఖాస్తు చేసుకునే మహిళలు ప్రభుత్వం నిర్దేశించిన అర్హతలను కలిగి ఉండాలి.
బీసీ వర్గానికి చెందిన నిరుద్యోగ మహిళ అయి ఉండాలి.
పేద, నిరుపేద, నిరాశ్రయ, ఒంటరి మహిళలు, వితంతువులు, అనాథ మహిళలకు ప్రాధాన్యత.
18 నుంచి 55 సంవత్సరాల మధ్య వయస్సు ఉండాలి.
రేషన్ కార్డు/ఫుడ్ సెక్యూరిటీ కార్డు కలిగి ఉండాలి.
రేషన్ కార్డు లేని పక్షంలో ఆదాయ ధ్రువీకరణ పత్రం సమర్పించాల్సి ఉంటుంది.
గ్రామీణ ప్రాంతాల్లో కుటుంబ వార్షిక ఆదాయం రూ.1.50 లక్షలు, పట్టణ ప్రాంతాల్లో రూ.2 లక్షలు మించకూడదు.
ఆధార్, ఓటర్ ఐడీ వంటి గుర్తింపు పత్రాలు అవసరం.
నివాస ధ్రువీకరణకు ఆధార్ కార్డును సమర్పించాలి.
ఒక కుటుంబానికి ఒక యూనిట్ మాత్రమే మంజూరు చేస్తారు.
టైలరింగ్‌లో నైపుణ్యం ఉన్న అభ్యర్థులకు ప్రాధాన్యత.
ప్రాథమిక అక్షరాస్యత ఉండటం అభిలషణీయం.
అధిక సంఖ్యలో దరఖాస్తులు వచ్చినప్పుడు కనీసం 5వ తరగతి విద్యార్హత కలిగిన వారికి ప్రాధాన్యత ఇవ్వనున్నట్లు అధికారులు పేర్కొంటున్నారు.

## అవసరమైన పత్రాలు సిద్ధం చేసుకోండి

అర్హత కలిగిన బీసీ మహిళలు దరఖాస్తు చేసుకునే సమయంలో రేషన్ కార్డు/ఫుడ్ సెక్యూరిటీ కార్డు, ఆదాయ ధ్రువీకరణ పత్రం, ఆధార్, వయస్సు ధ్రువీకరణ, నివాస ధ్రువీకరణ తదితర అవసరమైన పత్రాలను సిద్ధంగా ఉంచుకోవాలని అధికారులు సూచిస్తున్నారు.

## మహిళలకు స్వయం ఉపాధికి బాట

ఇంటివద్దే కుట్టుపని చేసుకుంటూ ఆదాయం పొందే అవకాశం కల్పించడం ద్వారా మహిళలను ఆర్థికంగా బలోపేతం చేయడమే ఈ పథకం ప్రధాన ఉద్దేశ్యం. కుట్టుపనిపై ఆసక్తి ఉన్న పేద బీసీ మహిళలకు ఈ పథకం ఎంతో ఉపయోగకరంగా మారనుంది.

## అధికారుల సూచన

ప్రభుత్వం అందిస్తున్న ఈ అవకాశాన్ని అర్హులైన బీసీ మహిళలు సద్వినియోగం చేసుకోవాలని అధికారులు సూచిస్తున్నారు. దరఖాస్తు విధానం, చివరి తేదీ, సంబంధిత పోర్టల్ తదితర వివరాలను అధికారిక ప్రకటనల ద్వారా తెలుసుకుని మాత్రమే దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

# సాకేత్ ప్రణామమ్‌లో ఘనంగా సీనియర్ సిటిజన్స్ డే

మేడ్చల్ (ప్రశ్న న్యూస్ ) వృద్ధులు సమాజానికి అందించిన సేవలను, వారి త్యాగాలను స్మరించుకుంటూ గౌరవించుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని జన విజ్ఞాన వేదిక నాయకులు, సాకేత్ ప్రణామమ్ డైరెక్టర్ వి.వి. వరప్రసాదరావు పేర్కొన్నారు. శుక్రవారం గౌడవెల్లిలోని సాకేత్ ప్రణామమ్ కాంప్లెక్స్ వెల్నెస్ హబ్ మినీ థియేటర్‌లో 'ప్రపంచ సీనియర్ సిటిజన్స్ డే' సందర్భంగా 'మొబిలిటీ ఇండియా' సంస్థ భాగస్వామ్యంతో ప్రత్యేక ఆరోగ్య అవగాహన సదస్సు, సన్మాన కార్యక్రమం ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా వరప్రసాదరావు మాట్లాడుతూ.. వృద్ధుల జీవిత అనుభవాలు, వారి జ్ఞానం సమాజ పురోగతికి మార్గదర్శకాలని, వారి పట్ల కృతజ్ఞత తెలుపుకోవడమే ఈ దినోత్సవ ముఖ్యోద్దేశమని తెలిపారు. చైతన్య మహిళా సంఘం నాయకురాలు ఝాన్సీ శారదా దేవి మాట్లాడుతూ సమాజానికి విశేష సేవలందించిన పెద్దలను స్ఫూర్తిగా తీసుకుని, వారిని గౌరవించుకోవడం ఎంతో ఆనందంగా ఉందన్నారు.అనంతరం 'మొబిలిటీ ఇండియా' ప్రతినిధులు సామరాజు రెడ్డి, వర్షితలు వయోవృద్ధులు ఎదుర్కొనే శారీరక, ఆరోగ్య సమస్యలు మరియు వాటిని క్రమబద్ధమైన వ్యాయామం ద్వారా ఎలా అధిగమించవచ్చో స్లయిడ్ షో ద్వారా సవివరంగా వివరించారు. నిత్య వ్యాయామమే వృద్ధాప్య సమస్యలకు సరైన ఔషధమని వారు అవగాహన కల్పించారు.






## ప్రముఖ సీనియర్ సిటిజన్లకు సన్మానం:

కార్యక్రమంలో భాగంగా కమ్యూనిటీకి చెందిన పలువురు ప్రముఖ సీనియర్ సిటిజన్లైన వారణాసి సుభద్ర, కొమ్మాజోస్యుల బలభద్రరావు, బలిజేపల్లి సుందరీదేవి, భట్టు సుశీల, రాధాకృష్ణ, మరియు సుబేదార్ టి.ఎల్.ఎన్. శర్మలను నిర్వాహకులు దుశ్శాలువాలతో ఘనంగా సన్మానించారు. శేషసాయి పర్యవేక్షణలో సాగిన ఈ కార్యక్రమంలో సొసైటీ చైర్మన్ డాక్టర్ కె. రామమోహనరావు, కార్యదర్శి వల్లభేంద్రరెడ్డి, డైరెక్టర్ నిరంజన్ రావులతో పాటు కమ్యూనిటీ నివాసితులు, మహిళలు, ప్రతినిధులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# సమ్మక్క-సారలమ్మ వీరగాథకు వెండితెర రూపం

**భారీ బడ్జెట్‌తో పాన్-ఇండియా మూవీకి మాస్ట్రో క్రియేషన్స్ శ్రీకారం**

**తెలంగాణ వనదేవతల చరిత్ర ఆధారంగా తెరకెక్కనున్న ప్రతిష్ఠాత్మక చిత్రం**




గజ్వేల్ ( ప్రశ్న న్యూస్ ) హైదరాబాద్, తెలంగాణ ఆరాధ్య వనదేవతలు సమ్మక్క--సారలమ్మ వీరగాథకు వెండితెర రూపం ఇవ్వబోతున్నారు. ప్రముఖ నిర్మాణ సంస్థ మాస్ట్రో క్రియేషన్స్ ఆధ్వర్యంలో సమ్మక్క-సారలమ్మ చారిత్రక గాథ ఆధారంగా భారీ బడ్జెట్‌తో పాన్-ఇండియా స్థాయిలో చారిత్రాత్మక చిత్రాన్ని తెరకెక్కించేందుకు సన్నాహాలు జరుగుతున్నాయి. దేశవ్యాప్తంగా చాటేలా...

తెలంగాణ సంస్కృతి, ఆధ్యాత్మికత, వీరత్వం, త్యాగం, భావోద్వేగాలను ప్రపంచస్థాయి సాంకేతిక ప్రమాణాలతో ప్రేక్షకుల ముందుకు తీసుకురావడమే లక్ష్యంగా సినిమా రూపొందిస్తున్నట్లు దర్శకుడు వెంకట్ తెలిపారు.

## హాలీవుడ్ స్థాయి టెక్నాలజీ

చిత్రానికి సంబంధించిన విజువల్ ఎఫెక్ట్స్, ప్రీ-విజువలైజేషన్, వర్చువల్ ప్రొడక్షన్, గ్రాఫిక్స్ వంటి కీలక విభాగాల కోసం యూకే, అమెరికా తదితర దేశాల్లోని ప్రముఖ స్టూడియోలతో సంప్రదింపులు జరుపుతున్నట్లు దర్శకుడు వెల్లడించారు.

**ప్రతిష్ఠాత్మక నటీనటులతో...** భారీ తారాగణంతో సినిమాను తెరకెక్కించేందుకు ప్రతిష్ఠాత్మక నటీనటుల ఎంపికపై కసరత్తు జరుగుతోందని తెలిపారు. అత్యున్నత నిర్మాణ విలువలతో సినిమాను రూపొందించి, రాబోయే సమ్మక్క-సారలమ్మ మహాజాతర సమయానికి ప్రేక్షకుల ముందుకు తీసుకురావాలనే లక్ష్యంతో ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు చెప్పారు. అధికారిక ప్రకటన కోసం ఆసక్తి సినిమాకు సంబంధించిన నటీనటులు, సాంకేతిక బృందం, నిర్మాణ వివరాలను త్వరలోనే అధికారికంగా ప్రకటించే అవకాశం ఉందని సినీ వర్గాలు వెల్లడించాయి. తెలంగాణ వనదేవతల చరిత్రను పాన్-ఇండియా స్థాయిలో ఆవిష్కరించనున్న ఈ ప్రాజెక్టుపై సినీ అభిమానుల్లో ఇప్పటికే ఆసక్తి నెలకొంది.

# రైతన్నలపై కూటమి నిర్లక్ష్యం

**సాగు, తాగునీరు విడుదల చేయకుంటే రైతులతో కలిసి ఉద్యమం**

**వైసీపీ మాజీ ఎమ్మెల్యే శిల్పా రవిచంద్రకిశోర్‌రెడ్డి హెచ్చరిక**



నంద్యాల(ప్రశ్న న్యూస్) వర్షాభావ పరిస్థితులతో రైతాంగం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నా కూటమి ప్రభుత్వం పట్టించుకోవడం లేదని వైసీపీ నాయకుడు, మాజీ ఎమ్మెల్యే శిల్పా రవిచంద్రకిశోర్‌రెడ్డి విమర్శించారు. ప్రాజెక్టుల్లో నీరు ఉన్నప్పటికీ సాగు, తాగునీటి అవసరాలకు కాలువలకు నీటిని విడుదల చేయకపోవడం దారుణమన్నారు. తక్షణమే నీటిని విడుదల చేయకుంటే రైతులను సమీకరించి ఉద్యమం చేపడతామని హెచ్చరించారు. నంద్యాలలో శుక్రవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు.

## ప్రాజెక్టుల్లో నీరున్నా విడుదల ఏదీ?

శ్రీశైలం ప్రాజెక్టులో 875 అడుగుల వద్ద నీటి నిల్వలు ఉన్నప్పటికీ కాలువలు, రిజర్వాయర్లకు నీటిని విడుదల చేయడంలో ప్రభుత్వం విఫలమైందని శిల్పా రవిచంద్రకిశోర్‌రెడ్డి ఆరోపించారు. ప్రాంతీయ రిజర్వాయర్లలో నీటి నిల్వలు ఆందోళనకరంగా ఉన్నాయని తెలిపారు. వెలుగోడు రిజర్వాయర్ 17 టీఎంసీల సామర్థ్యానికి ప్రస్తుతం 4 టీఎంసీలు, గోరుకల్లు రిజర్వాయర్ 12.5 టీఎంసీలకు 6 టీఎంసీలు, అవుకు రిజర్వాయర్ 4.5 టీఎంసీలకు కేవలం 1 టీఎంసీ నీరు మాత్రమే ఉందని వివరించారు.

## రాయలసీమకు ద్రోహం

దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్ సామర్థ్యాన్ని 40 వేల క్యూసెక్కులకు పెంచి రాయలసీమకు సాగునీటి భద్రత కల్పించారని ఆయన అన్నారు. అయితే ప్రస్తుత ప్రభుత్వం రాయలసీమ ఎత్తిపోతల పథకాన్ని నిలిపివేసి ప్రాంతానికి అన్యాయం చేసిందని విమర్శించారు. తెలంగాణ ప్రభుత్వం 800 అడుగుల నుంచే నీటిని వినియోగించుకుంటున్నా రాష్ట్ర ప్రభుత్వం తన వాటా నీటిని సద్వినియోగం చేసుకోలేకపోతోందని ఆరోపించారు.

## యూరియా కోసం క్యూలా?

గత ఏడాది పంటలకు గిట్టుబాటు ధరలు లేక అప్పులపాలైన రైతులు ప్రస్తుతం ఎరువులు, పురుగుమందుల కోసం ఇబ్బందులు పడుతున్నారని శిల్పా రవిచంద్రకిశోర్‌రెడ్డి అన్నారు. యూరియా కోసం ఆన్‌లైన్ దరఖాస్తులు చేయించడం, పంపిణీలో రాజకీయ జోక్యం ఉండటం సరికాదన్నారు. మద్దతు ధర కోసం ఆందోళన చేసిన రైతులపై కేసులు నమోదు చేయడం దారుణమని విమర్శించారు.

## 30 వేల ఎకరాలకు సాగునీరు

నంద్యాల అర్బన్, రూరల్ పరిధిలో సుమారు 30 వేల ఎకరాల్లో పంటలు సాగు కావాల్సి ఉందని, తక్షణమే నీటిని విడుదల చేసి రైతులను ఆదుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. నంద్యాల పట్టణ తాగునీటి అవసరాలతో పాటు మిట్నాల చెరువు నీటి సమస్యను పరిష్కరించేందుకు ప్రభుత్వం వద్ద ఉన్న కార్యాచరణను వెల్లడించాలని కోరారు.కాలువలకు వెంటనే నీటిని విడుదల చేయకపోతే రైతులను సమీకరించి స్వయంగా నీటి విడుదల కోసం ఉద్యమిస్తామని శిల్పా రవిచంద్రకిశోర్‌రెడ్డి హెచ్చరించారు.సమావేశంలో నంది రైతు సమైక్య అధ్యక్షుడు రామసుబ్బారెడ్డి, మాజీ మార్కెట్‌యార్డు చైర్మన్ పురుషోత్తంరెడ్డి, వైసీపీ డోన్ నియోజకవర్గ పరిశీలకుడు దేశం సుధాకర్‌రెడ్డి, కృష్ణారెడ్డి, రాష్ట్ర ఎస్టీ సెల్ కార్యదర్శి శంకర్‌నాయక్, మధు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా గణేష్ గుప్తా పుట్టినరోజు వేడుకలు

**- శుభాకాంక్షలు తెలిపిన ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ వివిధ పార్టీల నాయకులు**



శంషాబాద్(ప్రశ్న న్యూస్) కాంగ్రెస్ పార్టీ యువ నాయకుడు ఆర్ గణేష్ గుప్తా పుట్టినరోజు వేడుకలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. రాజేంద్రనగర్ నియోజకవర్గం కాంటెస్ట్ ఎమ్మెల్యే, శంషాబాద్ మాజీ సర్పంచ్ గణేష్ గుప్తా పుట్టినరోజు వేడుకలను శుక్రవారం ఆయన నివాస గృహం వద్ద ఘనంగా నిర్వహించారు. రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ ఆయనకు పుష్పగుచ్చాన్ని



అందజేసి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. ఆయనతోపాటు కోడిగంటి చంద్రారెడ్డి, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు చిల్కమర్రి మహేందర్ ముదిరాజ్ పార్టీ నాయకులు దూడల వెంకటేష్ గౌడ్, జహంగీర్ ఖాన్, కొలను మహేందర్ రెడ్డి, తోకల మురళీకృష్ణ యాదవ్, పారేపల్లి శ్రీనివాస్ గౌడ్, జ్ఞానేశ్వర్ యాదవ్, ఇప్పనుంతల అజయ్, తోట రాములు ముదిరాజ్, తోట విట్టల్ ముదిరాజ్, ఈదుల నరసింహ గౌడ్, తోట రామకృష్ణారెడ్డి, చేవెళ్ల ప్రసాద్ బంగారం, మామిడిపల్లి జంగయ్య, సోమ శ్రీనివాస్ గుప్తా, డాక్టర్ అనంతం గుప్త తదితరులు ఆయనకు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు .

# రిపోర్టర్‌పై హత్యా ప్రయత్నం, దాడి

## -బెదిరింపు లకు పాడిన ఆంధ్రప్రభ విలేకరి పై కేసు నమోదు

**ఎస్సీ కులాన్ని అడ్డుపెట్టుకుని బెదిరింపులు**

**ఆంధ్రోడా నాకు నమస్కారం చేయాలి**

**చిన్న పత్రిక అంటూ అవహేళన**

**నేను అల్లం నారాయణ యూనియన్ లో సెక్రెటరీ**

**గంజాయి బ్యాచ్ తో దాడి చేసి చేపిస్తానని బెదిరిస్తూ**



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) తోటి రిపోర్టర్‌ను బెదిరించి,కర్ర తో హత్యా ప్రయత్నం చేసిన ఘటనలో ఆంధ్రప్రభ రిపోర్టర్ పై బోయిన్‌పల్లి పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల వివరాల ప్రకారం బోయిన్‌పల్లి లో నివాసముండే విజయక్రాంతి రిపోర్టర్ సీఎస్ వివిఎస్ కే మాణిక్యరావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఆంధ్రప్రభ రిపోర్టర్ రామడుగు వెంకట్‌పై క్రైమ్ నంబర్ 493/2026 కింద బీఎన్ఎస్ సెక్షన్ 118(1) ప్రకారం కేసు నమోదైంది. ఫిర్యాదులో పేర్కొన్న వివరాల ప్రకారం.. రామడుగు వెంకట్ కొంత కాలంగా తనను ఆంధ్రాడా, నాకు నమస్కారం చేయాలి, నేను అల్లం నారాయణ యూనియన్ లో సెక్రెటరీ కంటోన్మెంట్లో నేను చెప్పింది వినాలి,చిన్న పత్రిక అంటూ అవహేళనగా మాట్లాడుతూ,రాజకీయ నాయకుల దగ్గర ప్రెస్ మీట్ కు పిలవద్దు అంటూ,గత కొంత కాలంగా తనపై నిరంతరం ప్రాంతీయ విద్వేషాలు రెచ్చగొడుతూ బెదిరిస్తున్నాడని మాణిక్యాల రావు ఫిర్యాదులో పేర్కొన్నారు. తనను చంపుతానంటూ హెచ్చరించడంతో పాటు,ఎస్సీ కులాన్ని అడ్డుపెట్టుకుని ఎస్సీ ఏట్రాసిటీవ్ కేసు నమోదు పెడతానని, నేను నక్సలైట్లు తో కలిసి పని చేశానని,బెదిరింపు లకు పాల్పడుతున్నారని పేర్కొన్నారు. ఈ నెల 11న కర్బానా పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగిన రాజీవ్ రహదారి బాధ్యతలు ధర్నా కార్యక్రమానికి సంబంధించి న్యూస్ కవరేజ్ కి వెళ్లిన తనతో ఆంధ్రుడికి ఎక్కువైంది.నా గురించి వేరే వారికి సభ్యకరంగా ప్రచారం చేశాడు. ఎందుకు చేస్తున్నావ్ నా గురించి అని ప్రశ్నిస్తే, కులఅహంకారంతో గొడవకు దిగాడని తెలిపారు. ఈ నెల 18న బోయిన్ పల్లి శ్రీ నల్ల పోచమ్మ ఆలయం వద్ద సర్దార్ సర్వాయి పాపన్న జయంతి కార్యక్రమం కవరేజీకి వెళ్లిన సమయంలో కూడా వెంకట్ కర్రతో తనపై అత్యా ప్రయత్నం,దాడి చేశాడని ఫిర్యాదులో పేర్కొన్నారు. అక్కడ విధుల్లో ఉన్న పోలీసు అధికారి సబ్ ఇన్స్పెక్టర్ ఆర్.రామకృష్ణ జోక్యం చేసుకున్నప్పటికీ ఆటోయూనియన్ డ్రైవర్ తో దాడి కొనసాగించాడని ఆరోపించారు.దీనికి సంబంధించి ఆలయం సమీపంలోని సీసీ కెమెరాల దృశ్యాలను పరిశీలించాలని పోలీసులను కోరారు.అదే విధంగా గంజాయి బ్యాచ్లు తో దాడి చేపిస్తానని బెదిరిస్తూ,ఈ నెల 17న ఉదయం బోయిన్‌పల్లి ఎక్స్‌రోడ్డులోని గల్ఫ్ బేకరీ సమీపంలో కారుతో ఢీకొట్టి హత్య చేసేందుకు ప్రయత్నం జరిగిందని, దీని వెనుక కూడా వెంకట్ ఉన్నాడని అనుమానం వ్యక్తం చేశారు. ఈ ఘటనకు సంబంధించిన సీసీ కెమెరాల దృశ్యాలను పరిశీలించాలని కోరారు.తనను, తన కుటుంబ సభ్యులను బెదిరిస్తున్న వ్యక్తి పై చట్టపరమైన చర్యలు తీసుకుని నాకు, ప్రాణ రక్షణ కల్పించాలని మాణిక్యరావు పోలీసు లను కోరారు.ఫిర్యా దు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ గురుకుల రామకృష్ణకు తెలిపారు..

### 2021లో రెవెన్యూ అధికారినంటూ బెదిరింపు..బోయినపల్లి పీ ఎస్ లో కేసు నమోదు...

బోయినపల్లి తోకట్టలో శ్వేత అనే మహిళ 2021డిసెంబరు నెలలో కొత్తగా ఇంటి నిర్మాణం చేపట్టి అందుకు సంబంధించి బోరింగ్ వేస్తుండగా ఆంధ్రప్రభ విలేకరి రామడుగు వెంకట్ ఆమె వద్దకు వెళ్ళి తాము తిరుమలగిరి ఎమ్మార్వో కార్యాలయం నుంచి వచ్చామని,రెవెన్యూ సిబ్బంది అని చెప్పారు. ఈ బోరింగ్ కు అనుమతింలేదని తనకు రూ.5వేలు ఇవ్వాలని,లేదంటే బోరింగ్ పనులు ఆపేస్తామని వేధించాడు.దీంతో సదరు మహిళ ఎమ్మార్వో కార్యాలయంలో విచారించ గా అలాంటి వ్యక్తి ఎవరు తమ కార్యాలయం లో పనిచేయడం లేదని చెప్పారు.దీంతో సదరు మహిళ అతనిపై చర్యలు తీసుకోవాలంటూ ఎమ్మార్వో కు ఫిర్యాదు చేయగా ఆమె ఫిర్యాదు ఆధారంగా అప్పటి తిరుమలగిరి ఎమ్మార్వో విజయా రెడ్డి ఆదేశాల మేరకు రెవెన్యూ ఆర్ ఐ అతనిపై బోయిన్ పల్లి పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. రెవెన్యూ అధికారుల ఫిర్యాదు మేరకు రామడుగు వెంకట్ పై 2021డిసెంబరు 5న బోయిన్ పల్లి పోలీస్ స్టేషన్లో కేసు నమోదు అయింది..గతం 2010 లో ఆంధ్రప్రభ కార్యాలయం రీజినల్ మేనేజర్ ను కూడా కుల అహంకారంతో బెదిరించాడు.

## వాడవాడలా వైభవంగా వరలక్ష్మి వ్రతం



**రాయచోటి.** వాడవాడల శుక్రవారం వరలక్ష్మి వ్రతాన్ని మహిళలు వైభవంగా జరుపుకున్నారు. ఉదయం వేళ నుంచి మహిళలు తమ గృహాలలో వరలక్ష్మి అమ్మవారిని కొలువు తీర్చి భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు. అమ్మవారిని రకరకాలుగా సర్వాంగ సుందరంగా తమ శక్తి మేరకు అలంకరణ చేసి ఆభరణాలు మెండుగా అలంకరణ చేశారు.సౌభాగ్యము, సిరిసంపదలు, ఆయురారోగ్యాలు ప్రసాదించాలని మహిళలు వరలక్ష్మి తల్లిని వేడుకొన్నారు. అమ్మవారి ఆలయాలకు భక్తులు పోటెత్తారు .అన్నమయ్య జిల్లాలో సంబేపల్లిలోని దేవర రాయి నల్ల గంగమ్మ తల్లి .పశుపతి నాథ ఆలయం. రాయచోటి లోని వీరభద్ర స్వామి దేవాలయం. వాసవి కన్యకా పరమేశ్వరి .చెక్ పోస్ట్ శివాలయం ,తంబళ్లపల్లె, మదనపల్లి, పీలేరు, పుంగనూరు నియోజకవర్గాలలో అన్ని పల్లెల్లో కూడా ఈ ఏడాది వరలక్ష్మి వ్రతాన్ని ఘనంగా జరుపుకున్నారు. ముఖ్యంగా మదనపల్లెలోని బెంగళూరు రోడ్డులోని శివాలయము, బజారు వీధిలోని అమ్మవారి శాల భక్తులతో పోటెత్తాయి. సంబేపల్లిలోని మహిమాన్ నిత్యమైన శ్రీదేవరరాయి నల్లగంగమ్మ తల్లి ఆలయంలో వైభవంగా వరలక్ష్మి వ్రతంభక్తిశ్రద్ధలతో సామూహిక పూజలు.. అమ్మవారి దర్శనానికి పోటెత్తిన భక్తజనం సిరిసంపదలకు, సౌభాగ్యానికి, సుఖశాంతులకు ప్రతీకగా భావించే వరలక్ష్మీదేవి ఆరాధనను పురస్కరించుకుని సంబేపల్లె శ్రీ దేవరరాయి నల్లగంగమ్మ తల్లి ఆలయంలో శుక్రవారం సామూహిక వరలక్ష్మి వ్రతాన్ని అత్యంత వైభవంగా నిర్వహించారు. ఆలయ ప్రాంగణం భక్తుల సందడితో పులకించింది. మహిళలు, భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి భక్తిశ్రద్ధలతో వరలక్ష్మీదేవిని ఆరాధించి అమ్మవారి ఆశీస్సులు పొందారు.వేదమంత్రాలు నడుమ ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించగా.. మహిళలు సంప్రదాయబద్ధంగా వ్రతాన్ని ఆచరించారు. పసుపు, కుంకుమ, పూలు, పండ్లు, కొబ్బరికాయలు, నైవేద్యాలతో అమ్మవారికి ప్రత్యేక పూజలు సమర్పించారు. ఆలయ ప్రాంగణమంతా ఆధ్యాత్మిక వాతావరణంతో నిండిపోయింది.అమ్మవారి కృప కోసం సామూహిక వ్రతం×వరలక్ష్మి వ్రతం సందర్భంగా మహిళలు కుటుంబ సౌభాగ్యం, ఆయురారోగ్యాలు, ఐశ్వర్యం, సుఖసంతోషాలు కలగాలని ఆకాంక్షిస్తూ భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు. వరలక్ష్మీదేవిని ఆరాధించడం ద్వారా కుటుంబంలో శుభమంగళాలు, సిరిసంపదలు వెల్లివిరుస్తాయని భక్తుల విశ్వాసం.ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాట్లువ్రతానికి హాజరైన ప్రతి మహిళకు ఆలయం తరఫున పసుపు, కుంకుమ, రవిక బట్ట, గాజులు అందజేశారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ చైర్మన్ కూనాసి సుబ్బరాజు యాదవ్ , ఈఓ దేవదాసు, అర్చకులు అరుణాచలం మాట్లాడుతూ.. వరలక్ష్మి వ్రతంలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారి కృపకు పాత్రులయ్యారని తెలిపారు.అమ్మవారి కరుణాకటాక్షాలతో ప్రతి ఇంటా సిరిసంపదలు వెల్లివిరియాలని.. ప్రతి కుటుంబంలో సుఖశాంతులు, సౌభాగ్యం, ఆనందం నిండాలని ఆకాంక్షిస్తూ నిర్వహించిన ఈ వరలక్ష్మి వ్రతం భక్తులకు ఆధ్యాత్మిక అనుభూతిని పంచింది.ఈ కార్యక్రమం లో ముఖ్య అతిధిగా రాష్ట్ర పాల ఏకిరి కార్పొరేషన్ చైర్మన్ కందూరి నాగేశ్వర్ నాయుడు. రాష్ట్ర బంజారా సంఘ్ నాయుకులు జయరాం అఖండ నాయక్ ఆలయ కమిటీ డైరెక్టర్ లు అంచల రఘు. ఆంజనేయులు మురగేష్. వేణుగోపాల్ నాయుడు తదితరులు పాల్గొన్నారుసాయంత్రం వేళ దీపాలతో అమ్మవారిని మరొకమారు రకరకాల పుష్పాలతో అలంకరణ చేసి పడ్లు, రకరకాల వంటలతో నైవేద్యాలు సమర్పించారు. మహిళలను తమ గృహాలకు ఆహ్వానించి వారికి అమ్మవారి దీవెనలతో పాటు పసుపు కుంకుమ జాకెట్ ను సమర్పించారు. ఏది ఏమైనా ఒకపక్క కరువు పీడిస్తున్న వరలక్ష్మి వ్రతం పండగ భారమైన మహిళలు ఈ ఏడాది వరలక్ష్మి వ్రతాన్ని తమ శక్తి మేరకు ఘనంగా జరుపుకున్నారు.

# తెలంగాణ కాదు.. తెలుంగాణ’

**- రాష్ట్ర పేరు పై కొత్త చర్చకు నిర్మలానంద అతీత సద్గురు మైలపల్లి రాజారావు పిలుపు**

**- తెలంగాణ కాదు.. ‘తెలుంగాణ’ కావాలి! - రాష్ట్ర పేరు పై నిర్మలానంద అతీత సద్గురు మైలపల్లి రాజారావు సంచలన డిమాండ్**

**- పేరు మారింది.. మూలం మరుగునపడిందా? - తెలుగు భాష, సంస్కృతి, చరిత్రకు ప్రతిబింబంగా ‘తెలుంగాణ’ను పునరుద్ధరించాలని పిలుపు**

**“మన భాష తెలుగు.. మన సంస్కృతి తెలుగు.. మరి మన రాష్ట్రం పేరు ఎందుకు కాదు?” - పాలకులు, పండితులు సమాధానం చెప్పాలంటూ సూటి ప్రశ్న**

**తెలుగు రాయలేని తరాలు తయారవుతున్నాయా?- పిల్లల్లో మాతృభాషపై తగ్గుతున్న పట్టును ప్రస్తావిస్తూ తీవ్ర ఆవేదన**

**“పూజారులు, పండితులు, చరిత్రకారులు కదలిరండి.. ఆధారాలతో చర్చిద్దాం!” - ‘తెలుంగాణ’ పేరుపై బహిరంగ చర్చకు రాజారావు పిలుపు**



కాప్రా (ప్రశ్న న్యూస్) తెలంగాణ రాష్ట్రం పేరును ‘తెలంగాణ’గా కాకుండా ‘తెలుంగాణ’గా పిలవాలనే డిమాండ్‌తో తెలంగాణ బిడ్డ నిర్మలానంద అతీత సద్గురు మైలపల్లి రాజారావు కొత్త చర్చకు తెరలేపారు. రాష్ట్రం పేరు కేవలం ఒక భౌగోళిక గుర్తింపు కాదని, అది తెలుగు భాష, సంస్కృతి, చరిత్ర, సంప్రదాయాలతో ముడిపడి ఉన్న ఆత్మగౌరవానికి ప్రతీక అని ఆయన పేర్కొన్నారు. రాష్ట్ర పేరు పై పండితులు, తత్వవేత్తలు, దేవాలయ అర్చకులు, భాషా పరిశోధకులు, చరిత్రకారులు, ప్రజాప్రతినిధులు, విద్యావేత్తలు బహిరంగంగా చర్చించాలని ఆయన పిలుపునిచ్చారు.తెలంగాణ అనే పేరులోని మూల స్వరూపం ‘తెలుంగాణ’ అని, ‘తెలుగు గానం చేయుట’ అనే భావనతో దీనికి సంబంధం ఉందని రాజారావు వాదించారు. మహమ్మదీయుల పాలనలో పరిపాలనా భాషగా ఉర్దూ ప్రభావం పెరిగిన నేపథ్యంలో స్థానిక పదప్రయోగాలు కాలక్రమేణా మారిపోయాయని ఆయన అభిప్రాయపడ్డారు. ఉర్దూ భాషలో ‘లూ’ అనే పదం లేదనే తన వాదనను ప్రస్తావిస్తూ, అసలు ‘తెలుంగాణ’ రూపం మారి ‘తెలంగాణ’గా స్థిరపడిందని ఆయన అన్నారు.అయితే ఈ వాదనపై భాషాశాస్త్రవేత్తలు, చరిత్రకారులు, పరిశోధకులు ఆధారాలతో చర్చించాల్సిన అవసరం ఉందని ఆయన స్వయంగా సూచించారు. పేరు మార్పు భావోద్వేగ అంశంగా మాత్రమే కాకుండా, శాసనాలు, ప్రాచీన గ్రంథాలు, చారిత్రక ఆధారాలు, భాషా పరిణామం, పరిపాలనా పత్రాలు తదితరాలను పరిశీలించి నిర్ణయించాల్సిన అంశమని పేర్కొన్నారు.

### ‘రేపటి తరానికి పేరు కూడా తెలియదా?’

రాష్ట్రం పేరు విషయంలోనే కాకుండా తెలుగు భాష భవిష్యత్తుపైనా రాజారావు తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. కొన్ని తరాలు గడిచిన తర్వాత ‘తెలంగాణ’ అనే ఉచ్చారణ కూడా మరింత మారిపోయి, చివరకు ‘టెలంగాణ’ వంటి రూపాలు వినిపించే ప్రమాదం ఉందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికే తెలుగు చదవడం, రాయడం విషయంలో కొత్త తరాల్లో ఆసక్తి తగ్గుతోందని అన్నారు.

“తెలుగు భాషను కాపాడుతున్నామని చెప్పుకుంటున్నాం. తెలుగు పుస్తకాలు, తెలుగు గ్రంథాలు, తెలుగు సంస్కృతి, తెలుగు సాహిత్యం అంటూ గర్వపడుతున్నాం. మరి మన రాష్ట్రం పేరులోని తెలుగు మూలాన్ని ఎందుకు కాపాడుకోలేకపోతున్నాం?” అని ఆయన ప్రశ్నించారు.తెలుగు రాయగలిగే పిల్లల సంఖ్య తగ్గిపోతున్నదని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. ముఖ్యంగా ఆర్థికంగా, సామాజికంగా ఉన్నత స్థానాల్లో ఉన్న కుటుంబాల్లోని పిల్లలకు తెలుగు మాట్లాడటం, చదవటం, రాయటం పట్ల దూరం పెరుగుతోందని ఆయన విమర్శించారు. ఎమ్మెల్యేలు, ఎంపీలు, పారిశ్రామికవేత్తలు, ఐఏఎస్, ఐపీఎస్ అధికారులు, సినీ రంగ ప్రముఖులు, ఇతర ఉన్నత వర్గాల కుటుంబాల్లో తెలుగు వినియోగం తగ్గడం భవిష్యత్తులో భాషకు తీవ్ర నష్టం కలిగిస్తుందని అన్నారు.

### ‘ఇప్పటికైనా మించిపోయింది లేదు’

తెలుగు భాష, సంస్కృతి పరిరక్షణకు ఇప్పటికీ అవకాశం ఉందని రాజారావు పేర్కొన్నారు. భాషను కాపాడటమంటే కేవలం పాఠశాలల్లో తెలుగు బోధించడం మాత్రమే కాదని, ఇంటి నుంచి దేవాలయం వరకు, సాహిత్యం నుంచి పరిపాలన వరకు, ప్రజల రోజువారీ జీవితం నుంచి ప్రభుత్వ వ్యవహారాల వరకు తెలుగు వినియోగాన్ని పెంచాల్సిన అవసరం ఉందన్నారు.ఈ నేపథ్యంలో తెలంగాణలోని ప్రముఖ దేవాలయాల అర్చకులు, వేదపండితులు, ధర్మ పరిరక్షకులు, భాషా పండితులు ముందుకు రావాలని ఆయన కోరారు. యాదగిరిగుట్ట, సరస్వతి ఆలయాలు, చిలుకూరు, కాళేశ్వరం తదితర పుణ్యక్షేత్రాలకు చెందిన అర్చకులు, హైదరాబాద్‌లోని పురాతన దేవాలయాల పూజారులు ఈ చర్చలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.కాకతీయుల చరిత్రను కూడా ఆయన ప్రస్తావించారు. గణపతిదేవుడు, ప్రతాపరుద్రుడు, రుద్రమదేవి వంటి కాకతీయ పాలకుల కాలంలో తెలుగు భాష, కళలు, శిల్పకళ, దేవాలయ నిర్మాణాలు విశేష అభివృద్ధి సాధించాయని పేర్కొన్నారు. వెయ్యి స్తంభాల దేవాలయం వంటి చారిత్రక కట్టడాలు తెలంగాణ నేలపై తెలుగు సంస్కృతి వైభవానికి చిహ్నాలని ఆయన అన్నారు.

### ‘చరిత్రను కాపాడితేనే భవిష్యత్తు మనదవుతుంది’

తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత ప్రాంతీయ ఆత్మగౌరవానికి కొత్త ఊపు వచ్చిందని, అలాంటి సమయంలో భాషా మూలాలను మరింత లోతుగా పరిశీలించాల్సిన అవసరం ఉందని రాజారావు అభిప్రాయపడ్డారు. స్వాతంత్ర్యం వచ్చిన దశాబ్దాలు గడిచినా, మన ప్రాంతం, మన భాష, మన సంస్కృతి, మన పేర్లపై శాస్త్రీయ పరిశోధనలు మరింత విస్తృతంగా జరగాలని కోరారు.“మనది తెలుగు ప్రాంతం. మనది తెలుగు సంస్కృతి. మనది తెలుగు భాష. మన పుస్తకాలు తెలుగు. మన సాహిత్యం తెలుగు. మన దేవాలయాల్లో తెలుగు సంప్రదాయాలున్నాయి. మన చరిత్రలో తెలుగు ముద్ర ఉంది. అలాంటప్పుడు రాష్ట్రం పేరును కూడా తెలుగు మూలంతోనే ఎందుకు పిలవకూడదు?” అని ఆయన ప్రశ్నించారు.అయితే పేరు మార్పు వంటి అంశం ప్రజాస్వామ్య వ్యవస్థలో విస్తృత ప్రజాభిప్రాయం, చట్టపరమైన ప్రక్రియ, చారిత్రక ఆధారాలు, భాషా పరిశోధన వంటి అనేక అంశాలతో ముడిపడి ఉంటుందని ఆయన అన్నారు. అందువల్ల ఎవరినీ నిందించకుండా, ఎవరినీ కించపరచకుండా, వాస్తవాలను ఆధారాలతో పరిశీలించే బహిరంగ చర్చ అవసరమని పిలుపునిచ్చారు.

### ‘పూజారులు, పండితులు, చరిత్రకారులు ఒక్కచోటికి రండి’

ఈ అంశంపై ప్రత్యేక సదస్సులు నిర్వహించాలని ఆయన సూచించారు. వేదాలు తెలిసినవారు, సంస్కృత-తెలుగు భాషా పండితులు, పురావస్తు పరిశోధకులు, చరిత్రకారులు, కాకతీయ చరిత్రపై అధ్యయనం చేసిన నిపుణులు, దేవాలయ అర్చకులు, సాహితీవేత్తలు, విద్యావేత్తలు, యువత, ప్రజాప్రతినిధులు ఒకే వేదికపైకి వచ్చి చర్చించాలని కోరారు. ‘తెలుంగాణ’ అనే పదానికి చారిత్రక, భాషా ఆధారాలు ఏమిటి? ‘తెలంగాణ’ అనే రూపం ఎప్పుడు ప్రాచుర్యంలోకి వచ్చింది? మధ్యయుగ శాసనాల్లో ఏ రూపాలు కనిపిస్తున్నాయి? తెలుగు భాష పరిణామంలో ఈ పదానికి ఉన్న స్థానం ఏమిటి? ఉర్దూ, పర్షియన్, సంస్కృతం, తెలుగు వంటి భాషల పరస్పర ప్రభావం ఎంత ఉంది? వంటి ప్రశ్నలకు శాస్త్రీయ సమాధానాలు వెతకాల్సిన అవసరం ఉందని ఆయన అన్నారు. భావోద్వేగం ఒకవైపు, ఆధారం మరోవైపు ఉండాలని, రెండింటినీ సమన్వయం చేస్తేనే సమాజానికి సరైన నిర్ణయం దొరుకుతుందని ఆయన అభిప్రాయపడ్డారు. ‘మన పేరును మనమే సాధించుకుందాం’రాష్ట్రం పేరు మార్పు అంశాన్ని కేవలం రాజకీయ వివాదంగా చూడవద్దని, తెలుగు భాషా పరిరక్షణలో భాగంగా చూడాలని రాజారావు కోరారు. పేరు మార్పు సాధ్యమా? చట్టపరంగా ఏ ప్రక్రియ అవసరం? చారిత్రకంగా ఏ రూపం సమర్థనీయం? ప్రజలు ఏమనుకుంటున్నారు? వంటి అంశాలపై విస్తృత చర్చ జరగాలని అన్నారు.“ఇప్పటికైనా మించిపోయింది లేదు. మన భాషను మనమే కాపాడుకోవాలి. మన చరిత్రను మనమే అధ్యయనం చేయాలి. మన సంస్కృతిని మనమే భవిష్యత్ తరాలకు అందించాలి. మన పేరును మనమే సాధించుకోవాలి” అని ఆయన పిలుపునిచ్చారు.తెలుగు భాషపై యువతలో చైతన్యం పెంచేందుకు ఉద్యమాలు చేపట్టాలని, తెలుగు చదవడం-రాయడం ప్రతి కుటుంబంలో భాగం కావాలని, పిల్లలకు తెలుగు మాట్లాడటాన్ని గర్వకారణంగా మార్చాలని ఆయన కోరారు.రాష్ట్రం పేరు ‘తెలంగాణ’ నుంచి ‘తెలుంగాణ’గా మార్చాలన్న డిమాండ్‌పై ప్రభుత్వం, భాషా నిపుణులు, చరిత్రకారులు, ప్రజలు స్పందించాల్సిన సమయం వచ్చిందని ఆయన పేర్కొన్నారు. తన వాదనను ప్రజల ముందుంచానని, దీనిపై ఎవరికైనా భిన్నాభిప్రాయాలు ఉంటే ఆధారాలతో చర్చకు రావాలని సవాల్ చేశారు.“వాదిద్దాం కాదు.. ఆధారాలతో చర్చిద్దాం. విభేదిద్దాం కాదు.. చరిత్రను పరిశీలిద్దాం. మన భాషను, మన సంస్కృతిని, మన పేరును భవిష్యత్ తరాలకు ఎలా అందించాలో కలిసి నిర్ణయించుకుందాం” అని నిర్మలానంద అతీత సద్గురు మైలపల్లి రాజారావు పిలుపునిచ్చారు.



# శ్రీశైలంలో వైభవంగా సామూహిక వరలక్ష్మీ వ్రతములు

**ధర్మప్రచారంలో భాగంగా ఉచిత సామూహిక వరలక్ష్మీ వ్రతాలు**

**సామూహిక వరలక్ష్మీవ్రతంలో పాల్గొన 1800 మంది పైగా భక్తులు**

**వ్రతములో పాల్గొనవారందరికీ చీర, రవికవస్త్రం, వృక్ష ప్రసాదం అందజేత**

**వ్రతాన్ని జరిపించుకున్న వారందరికీ శ్రీస్వామిఅమ్మవార్ల దర్శనం, అన్న ప్రసాదాల ఏర్పాట్లు**

**కార్యనిర్వహణాధికారి శ్రీనివాసరావు దంపతులు, ఆలయ అధికారులు, సిబ్బంది**




శ్రీశైలం (ప్రశ్నన్యూస్) వరలక్ష్మీవ్రత పర్వదినాన్ని పురస్కరించుకుని (21)న దేవస్థానం ఉచిత సామూహిక వరలక్ష్మీ వ్రతాలను నిర్వహించింది. ఆలయ ఉత్తరద్వారం ఎదురుగా ఉన్న చంద్రవతి కల్యాణమండపంలో ఈ ఉచిత సామూహికవ్రతాలు నిర్వహించబడ్డాయి. 1800 మందికి పైగా భక్తులు ఈ వ్రతాన్ని జరిపించుకున్నారు. కాగా ఈ వ్రతాలకు కావలసిన పూజాద్రవ్యాలన్నింటినీ దేవస్థానమే సమకూర్చింది. వ్రతకార్యక్రమంలో పాల్గొనే ప్రతి ఒక్కరికోసం వేరువేరుగా కలశాలను నెలకొల్పి శాస్త్రోక్తంగా ఈ వ్రతం జరిపించబడింది. సంప్రదాయబద్ధంగా జరిగిన ఈ వ్రతంలో ముందుగా కార్యక్రమం నిర్విఘ్నంగా జరిగేందుకు మహాగణపతి పూజ నిర్వహించబడింది. తరువాత వేదికపై వేంచేబు చేయించిన శ్రీస్వామిఅమ్మవార్ల ఉత్సవమూర్తులకు శాస్త్రోక్తంగా షోడశోపచారపూజలు జరిపించబడ్డాయి. అనంతరం వరలక్ష్మీవ్రతంలో భాగంగా భక్తులందరిచేత విడివిడిగా కలశస్థాపన చేయించి వరలక్ష్మీదేవివారిని సమంత్రకంగా ఆవాహన చేయడం జరిగింది. తరువాత శ్రీసూక్తవిధానంలో వ్రతకల్పపూర్వకంగా వరలక్ష్మీదేవివారికి షోడశోపచారపూజలు జరిపించబడ్డాయి. అనంతరం అర్చకస్వాములు వ్రతకథను పఠించి వ్రతమహిమావిశేషాలను భక్తులకు తెలియజేశారు. చివరగా నీరాజన మంత్రపుష్పాలను జరిపి వ్రతసమాప్తి చేయబడింది. వ్రతాన్ని జరిపించుకున్న వారందరికీ, చీర, రవికవస్త్రం, పూలు, గాజులు, కంకణాలు, వృక్షప్రసాదంగా తులసి మొక్క, పుస్తక ప్రసాదంగా శ్రీశైలప్రభ మాసపత్రిక, మూడు రకాల ప్రసాదాలు అందజేయబడ్డాయి. వ్రతానంతరం భక్తులందరికీ ప్రత్యేక క్యూలైన్ ద్వారా స్వామిఅమ్మవార్ల దర్శనం కల్పించబడింది. దర్శనానంతరం దేవస్థానం అన్నపూర్ణ భవనం నందు భక్తులందరికీ అన్నప్రసాదాలు ఏర్పాటు చేయబడ్డాయి. కాగా భక్తులందరూ వ్రతక్రియను సౌకర్యవంతంగా వీక్షించేందుకు వీలుగా చంద్రవతి కల్యాణమండపంలో ప్రత్యేకంగా ఎల్.ఈ.డి స్క్రీనును కూడా ఏర్పాటు చేయడం జరిగింది ఈ కార్యక్రమములో కార్యనిర్వహణాధికారి యం. శ్రీనివాసరావు దంపతులు, ఆలయ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు. ఈ సందర్భంగా కార్యనిర్వహణాధికారి వారు మాట్లాడుతూ మన వైదికసంప్రదాయంలో శ్రావణ మాసాన వరలక్ష్మీవ్రతాన్ని ఆచరించడం సంప్రదాయంగా వస్తున్నదని అన్నారు. ఈ శ్రావణమాసం సర్వదేవతా ప్రీతికరంగా చెప్పబడుతోందన్నారు. ధార్మిక కార్యక్రమాల నిర్వహణలో భాగంగా దేవస్థానం ఈ వరలక్ష్మీవ్రతాలను నిర్వహించినట్లు తెలిపారు. ఈ సామూహిక వరలక్ష్మీ వ్రతంలో అధికసంఖ్యలో భక్తులు పాల్గొనడం ఎంతో హర్షించదగ్గ విషయమన్నారు. జ్యోతిర్లింగస్వరూపుడైన శ్రీమల్లికార్జునస్వామివారు మహాశక్తి స్వరూపిణి శ్రీభ్రమరాంబాదేవివారు స్వయంవ్యక్తంగా వెలసిన శ్రీశైలమహాక్షేత్రంలో వరలక్ష్మీవ్రతాన్ని జరిపించుకునే వారందరు కూడా ఎంతో అదృష్టవంతులన్నారు. అందరికీ శ్రేయస్సు కలుగుతుందన్నారు. ఇంకా వారు మాట్లాడుతూ ధర్మకర్తల మండలి వారి సూచనల మేరకు భక్తుల సౌకర్యార్థం పలు అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టడం జరుగుతోందన్నారు.

# దమ్మన్నపేట పెద్దమ్మ తల్లి ఆలయంలో ఘనంగా శ్రీ వరలక్ష్మీ పూజలు



ధర్పల్లి (ప్రశ్న న్యూస్) నిజామాబాద్ జిల్లా ధర్పల్లి మండలంలోని దమ్మన్నపేట గ్రామంలోని పెద్దమ్మ తల్లి ఆలయంలో శ్రావణమాసం సందర్భంగా శ్రీ వరలక్ష్మీ పూజను ఘనంగా నిర్వహించారు. ముదిరాజ్ సంఘ సభ్యుల ఆధ్వర్యంలో శ్రీపాత్ పూజారి చేతుల మీదుగా ఈ పూజా కార్యక్రమం జరిగింది. భక్తులు కోరిన కోరికలు నెరవేరాలని ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో ముదిరాజ్ సంఘ సభ్యులు చైర్మన్ అతుకుల పెద్ద సాయన్న,కే అనిల్, కుంట సురేష్, కే. నర్సయ్య, జి. నర్సయ్య, మద సాయమ్మ, ఎ మోహన్, గ్రామ ప్రజలు తదితర సంఘ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

# ఏటూరునాగారం డిగ్రీ కళాశాలలో అతిథి అధ్యాపకుల భర్తీ

**ఈనెల 24లోగా దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపల్ పిలుపు**

**పీజీలో 55% మార్కులు తప్పనిసరి..**

**నెట్, సెట్, పీహెచ్‌డీ ఉన్నవారికి ప్రాధాన్యత**




ఏటూరునాగారం( ప్రశ్న న్యూస్)ప్రభుత్వ డిగ్రీ కళాశాల, ఏటూరునాగారంలో బి కాం. బి ఎఫ్ ఎస్ ఆర్ సబ్జెక్టులో అతిథి అధ్యాపకుల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపల్ బి. రేణుక తెలిపారు. అర్హతలు: యం కాం లేదా సంబంధిత సబ్జెక్టులో 55% మార్కులతో పోస్టు గ్రాడ్యుయేషన్ పూర్తి చేసి ఉండాలి. ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు 50% మార్కులు సరిపోతాయి. పీహెచ్‌డీ, నెట్, సెట్ అర్హత ఉన్నవారికి, డిగ్రీ స్థాయిలో బోధన అనుభవం ఉన్నవారికి ప్రాధాన్యత, వెయిటేజ్ ఇస్తామని ప్రిన్సిపల్ పేర్కొన్నారు. ఆసక్తి ఉన్న అభ్యర్థులు తమ పూర్తి వివరాలతో కూడిన బయోడేటా. అన్ని సర్టిఫికెట్ల జిరాక్స్ కాపీలను ఈనెల 24వ తేదీ సోమవారం సాయంత్రం 4 గంటలలోగా కళాశాల కార్యాలయంలో సమర్పించాలని సూచించారు. డెమో, ఇంటర్వ్యూ, బోధన అనుభవం, విద్యా అర్హతల ఆధారంగా అభ్యర్థులను ఎంపిక చేస్తామని ఆమె వివరించారు.

# వాహనదారులు రహదారి ప్రత్యామ్నాయ మార్గాలను వినియోగించుకోవాలి

**వాహనదారులు పోలీసుల సూచనలను పాటించాలి**

**జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్**



మెదక్ ప్రతినిధి (ప్రశ్న న్యూస్ ) రైల్వే ఓవర్ బ్రిడ్జి (ROB) నిర్మాణ పనులు తేది: 23.08.2026 అర్ధరాత్రి 12.00 గంటల నుండి ప్రారంభమవుతున్న నేపథ్యంలో వాహనదారులు పోలీసుల సూచనలను పాటిస్తూ వాహనదారులు రహదారి ప్రత్యామ్నాయ మార్గాలను వినియోగించుకోవాలని జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్‌శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. వాహనదారులు ఉద్దేశించి జిల్లా కలెక్టర్ ప్రతిమసింగ్ మాట్లాడుతూ చేగుంట (గాంధీ చౌక్) నుండి మెదక్ వెళ్ళు రోడ్డు నకు గల రైల్వే ఓవర్ బ్రిడ్జి (ROB) నిర్మాణ పనులు తేది: 23.08.2026 అర్ధరాత్రి 12.00 గంటల నుండి ప్రారంభమగుననీ, ఈ కారణంగా చేగుంట నుండి మెదక్ (LC NO.228T) వద్ద రహదారి రాకపోకలను నిర్మాణ పనులు పూర్తి అయ్యా వరకు తాత్కాలికముగా నిలిపివేయడం జరుగుతుందని వాహనదారులు ఈ దిగువ చూపబడిన ప్రత్యామ్నయ మార్గాలను వినియోగించుకోవాలని కలెక్టర్ వెల్లడించారు. ద్వి మరియు త్రి చక్ర వాహనములు వినియోగించుకోవలసిన మార్గం గురించి కలెక్టర్ వివరిస్తూ రాజ గేటు వద్ద ఉన్న జజ రోడ్ నుండి పాత నేషనల్ హైవే చేగుంట పట్టణ సరిహద్దు అనగా ప్రస్తుత =ఖదీ నుండి బస్సు స్టాప్ ఎదురుగా గల వెంచర్ మీదుగా వెళ్ళవలనని చెప్పారు.. కార్లు, బస్సులు, డి.సి. యం. వ్యాన్లు మరియు ఇతర వాహనములు నార్సింగి నుండి శంకరంపేట (ఆర్) (వయ మిర్జాపల్లి) డబుల్ రోడ్డు మార్గము ద్వారా వెళ్ళుటకు నిర్దేశించామని తెలిపారు . ట్రాక్కులు మరియు భారీ వాహనములు రామాయంపేట నుండి లేదా నర్సాపూర్ మార్గము నుండి వెళ్ళవలెనని చెప్పారు, అలాగే కార్లు, బస్సులు మరియు డి.సి.యం. వ్యాన్లు ఇతర వాహనములు ఇతర మార్గాలను గలను ద్వారా కూడా వినియోగించుకోవాలన్నారు. మాసాయిపేట నుండి మెదక్ ప్రయాణించే వాహనములు శంకరంపేట(ఆర్) వయా ధర్పల్లి రోడ్ నుండి వెళ్ళుటకు సూచించడం జరిగిందన్నారు. తూప్రాన్ నుండి మెదక్ ప్రయాణించే వాహనములు వెల్దుర్తి – ఉప్పులింగాపూర్ – గవ్వలపల్లి ద్వారా వెళ్ళుటకు నిర్ణయించామన్నారు. కావున జిల్లా ప్రజలు ఇట్టి ప్రత్యామ్నయ మార్గాలను వినియోగించుకోగలరు. పోలీసుల సూచనలను పాటించాలని జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ వాహనదారులకు విజ్ఞప్తి చేశారు.

# భారతీయ జనతా పార్టీ మెదక్ జిల్లా అధ్యక్షులు వాల్దాస్ రాధా మల్లేష్ గౌడ్ ఆధ్వర్యంలో

**మెదక్ జిల్లా కలెక్టర్ కి మెమోరండం అందజేత**



మెదక్ ప్రతినిధి (ప్రశ్న న్యూస్ ) భారతీయ జనతా పార్టీ మెదక్ జిల్లా అధ్యక్షులు వాల్దాస్ మల్లేశం గౌడ్ ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్ కి మెమోరండం అందజేసిన మెదక్ జిల్లా బిజెపి అధ్యక్షులు మల్లేశం గౌడ్ ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా 22ఏ నిషేధిత భూముల జాబితాలో తప్పిదాలు జరిగినట్లు రెవెన్యూ మంత్రి శ్రీ పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అంగీకరించిన నేపథ్యంలో మెదక్ జిల్లా కలెక్టర్ కి వినతి పత్రం అందజేయడం జరిగింది. ఈ 22ఏ జాబితాలో భారీగా భూములు చేరడం వెనక కుట్ర దాగి ఉందంటూ సీనియర్ మంత్రి శ్రీ కోమటిరెడ్డి వెంకటరెడ్డి మాట్లాడడం మీకు తెలిసిందే. 22ఏ నిషేధిత భూముల జాబితాలో జరిగిన అక్రమాలను, కేవలం పరిపాలనా తప్పిదంగా పరిగణించకుండా, ప్రజల భూ హక్కులకు సంబంధించిన అంశంగా, ప్రభుత్వ రికార్డుల విశ్వసనీయతకు సంబంధించిన అంశంగా, అవసరమైతే ఆర్థిక నేరాల కోణంలోనూ సమగ్రంగా విచారించాల్సిన అవసరం ఉంది. బీఆర్ఎస్ ప్రభుత్వ కాలంలో 22ఏ నిషేధిత జాబితాలో ఉన్న భూముల విస్తీర్ణం ఎంత? కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ఇప్పటివరకు ఆ జాబితాలో కొత్తగా ఎంత భూమిని చేర్చారు? ఈ జిల్లాల్లో ఎంత భూమి చేర్చారు? ఏ సర్వే నెంబర్లు, ఏ భూ వర్గాలు, ఏ ఉత్తర్వుల ఆధారంగా చేర్చారు? అనే వివరాలు ప్రజలకు తెలియాల్సిన అవసరం ఉంది. అందువల్ల మండలం–గ్రామం–సర్వే నంబర్ వారీగా 22ఏ జాబితా వివరాలను బహిర్గతం చేయాలి. 1. జిల్లాలోని 22ఏ నిషేధిత భూముల పూర్తి జాబితాను బహిర్గతం చేయాలి.
2. గ్రామం–మండలం–సర్వే నంబర్ వారీగా వివరాలను ప్రజలకు అందుబాటులో ఉండాలి.
3. గత ప్రభుత్వ కాలం నుంచి ఇప్పటివరకు జరిగిన అన్ని చేర్పులు, తొలగింపులపై సమగ్ర ఆడిట్ నిర్వహించాలి. 4. ధరణి/భూ భారతి పోర్టల్ ఇతర డిజిటల్ భూ రికార్డులపై ఫోరెన్సిక్ ఆడిట్ నిర్వహించాలి. 5. తప్పుగా 22ఏలో చేర్చిన భూములను గుర్తించి, యజమానులకు న్యాయం చేయాలి. 6. అక్రమ చేర్పులకు బాధ్యులైన అధికారులు, సిబ్బంది, మధ్యవర్తులు, ఇతర వ్యక్తుల పాత్రను విచారించాలి. 7. అవినీతి, కుట్ర లేదా అక్రమ ఆర్థిక లబ్ధికి సంబంధించిన ఆధారాలు లభిస్తే క్రిమినల్ కేసులు నమోదు చేయాలి. 8. జిల్లా వ్యాప్తంగా 22ఏ జాబితాపై సమగ్ర శ్వేతపత్రం విడుదల చేయాలి. 9. ఈ 22ఏ నిషేధిత భూముల జాబితా అక్రమాలపై స్వతంత్ర న్యాయ విచారణ లేదా సీబీఐ విచారణకు రాష్ట్ర ప్రభుత్వం ఆదేశించాలన్న మా డిమాండును ప్రభుత్వ పెద్దల దృష్టికి తీసుకెళ్లాలి. 10. 22ఏ జాబితాలో భారీ తప్పిదాలకు నైతిక బాధ్యత వహిస్తూ రెవెన్యూ మంత్రి శ్రీ పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి రాజీనామా చేయాలన్న మా డిమాండును ప్రభుత్వ పెద్దల దృష్టికి తీసుకెళ్లాలి. 11. విచారణ పూర్తయ్యే వరకు అనుమానాస్పదంగా జరిగిన కొత్త చేర్పులు/మార్పులను ప్రత్యేకంగా పరిశీలించి, రికార్డుల భద్రతను నిర్ధారించాలి. 12. విచారణ నివేదికను ప్రజలకు బహిర్గతం చేసి, బాధ్యులపై తీసుకున్న చర్యలను ప్రకటించాలి. 13. రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి కుటుంబ కంపెనీకి, మరో రియల్ ఎస్టేట్ కంపెనీ ఫీనిక్స్ నుంచి రూ.వేల కోట్ల విలువైన ప్రాపర్టీస్ బదిలీ జరిగిన ఉదంతంపై రాష్ట్ర ప్రభుత్వం సమగ్ర విచారణ జరిపించాలనే మా డిమాండును ప్రభుత్వ పెద్దల దృష్టికి తీసుకెళ్లాలి. పై అంశాలను పరిగణనలోకి తీసుకుని, జిల్లా కలెక్టర్ చర్యలు తక్షణమే తీసుకోవాలని కోరుతున్నాము అని చెప్పడం జరిగింది. ఈ కార్యక్రమంలో జిల్లా పదధికారులు జిల్లా నాయకులు మోర్చాల అధ్యక్షులు సర్పంచులు కౌన్సిలర్లు మండల పట్టణ అధ్యక్షులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# షావుకారు జానకి మృతి బాధాకరం

**ఆమె ఆత్మకు శాంతి చేకూరాలి.**

**. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి**

**: డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్**



అమరావతి(ప్రశ్న న్యూస్)ప్రముఖ నటి షావుకారు జానకి మృతి పట్ల ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ తీవ్ర విచారం వ్యక్తం చేశారు. ఆమె ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుడిని ప్రార్థించారు. జానకి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. సినిమా పేరునే ఇంటి పేరుగా మార్చుకున్న గొప్ప నటి షావుకారు జానకి అని పవన్‌కల్యాణ్ పేర్కొన్నారు. తెలుగు, తమిళ, కన్నడ భాషల్లో సుమారు 400 చిత్రాల్లో నటించి తనదైన ముద్ర వేశారని గుర్తుచేశారు. కథానాయికగా, క్యారెక్టర్ ఆర్టిస్టుగా విభిన్న పాత్రలను పోషించి ప్రేక్షకుల ఆదరణ పొందారని తెలిపారు. షావుకారు జానకి మృతి సినీ రంగానికి తీరని లోటని పవన్‌కల్యాణ్ అన్నారు. ఆమె కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తూ, ఈ విషాదాన్ని తట్టుకునే ధైర్యాన్ని వారికి ప్రసాదించాలని భగవంతుడిని ప్రార్థిస్తున్నట్లు పేర్కొన్నారు.

# బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఘనంగా సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ జయంతి వేడుకలు




కాప్రా (ప్రశ్న న్యూస్) కుషాయిగూడలోని మల్కాజిగిరి జిల్లా బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం తెలంగాణ వీరుడు, బహుజన చైతన్యానికి ప్రతీక అయిన సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ మహారాజ్ 376వ జయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి తెలంగాణ బార్ అసోసియేషన్ సభ్యుడు కె. సునీల్ గౌడ్ ముఖ్యఅతిథిగా హాజరై సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ మహారాజ్ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా సునీల్ గౌడ్ మాట్లాడుతూ సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ మహారాజ్ సామాన్య ప్రజల హక్కుల కోసం పోరాడిన గొప్ప యోధుడని కొనియాడారు. అణగారిన వర్గాలపై జరుగుతున్న అన్యాయాలను, దోపిడీని ఎదురించి ప్రజల్లో ధైర్యం, ఆత్మ విశ్వాసాన్ని నింపిన ధీరుడిగా పాపన్న గౌడ్ చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోయారని అన్నారు. ప్రజల కోసం పోరాడిన ఆయన స్ఫూర్తి నేటి తరానికి ఆదర్శంగా నిలుస్తుందని పేర్కొన్నారు. సమాజంలో అణగారిన వర్గాలకు సమాన హక్కులు, గౌరవం, సామాజిక న్యాయం అందాలనే లక్ష్యంతో సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ సాగించిన పోరాటాన్ని ప్రతి ఒక్కరూ స్మరించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. పాపన్న గౌడ్ చరిత్రను కేవలం జయంతి, వర్ధంతి కార్యక్రమాలకే పరిమితం చేయకుండా, ఆయన ఆశయాలను యువతకు తెలియజేయాలని సూచించారు. ముఖ్యంగా యువత ఆయన జీవిత చరిత్ర, పోరాట స్ఫూర్తిని తెలుసుకుని సమాజ అభివృద్ధిలో భాగస్వాములు కావాలని పిలుపు నిచ్చారు. తెలంగాణ చరిత్రలో సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్‌కు ప్రత్యేక స్థానం ఉందని, ఆయన ధైర్య సాహసాలు, నాయకత్వ లక్షణాలు, ప్రజల పట్ల ఉన్న నిబద్ధత నేటి తరానికి స్ఫూర్తిదాయకమని తెలిపారు. సామాజిక సమానత్వం, ప్రజాస్వామ్య విలువలు, బలహీన వర్గాల హక్కుల పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో మల్కాజిగిరి జిల్లా బార్ అసోసియేషన్ అధ్యక్షుడు టి. రత్నయ్య, ప్రధాన కార్యదర్శి ఎస్. దుర్గా ప్రసాద్, ఉపాధ్యక్షులు ఎం. హరికృష్ణ, మహిళా ఉపాధ్యక్షురాలు కె. ప్రసన్న, సంయుక్త కార్యదర్శి టి. రవి శంకర్, మహిళా సంయుక్త కార్యదర్శి జి. జలజ, కోశాధికారి కె. పుణ్యరాజు, లైబ్రరీ కార్యదర్శి డి. సాయినాథ్ గౌడ్, క్రీడలు, సాంస్కృతిక కార్యదర్శి బి.ఎన్. పవన్ కుమార్, లేడీ ప్రతినిధి డి. సుజాత, సీనియర్ ఎగ్జిక్యూటివ్ సభ్యులు జి. నవనీత, డి. బద్రీనాథ్, ఎన్. రాకేష్, బి. నరేందర్, జె. నరేష్, ఎం. శోభారాణి, పి. విమల తదితరులు పాల్గొన్నారు.

# జాతీయ రహదారిపై ప్రమాదకర సైక్లింగ్.. పోలీసుల కౌన్సెలింగ్

**సోషల్ మీడియాలో వైరల్ వీడియో ఆధారంగా సైకిల్ రైడర్ గుర్తింపు**

**తల్లిదండ్రుల సమక్షంలో కౌన్సెలింగ్ చేసిన టౌన్, ట్రాఫిక్ పోలీసులు**




గజ్వేల్ ( ప్రశ్న న్యూస్ )జాతీయ రహదారిపై అత్యంత ప్రమాదకరంగా సైకిల్ నడుపుతూ, ట్రాఫిక్‌కు అంతరాయం కలిగించిన సైకిల్ రైడర్‌పై గజ్వేల్ టౌన్, ట్రాఫిక్ పోలీసులు చర్యలు చేపట్టారు. సోషల్ మీడియాలో వైరల్ అయిన వీడియో ఆధారంగా ఫిర్యాదు స్వీకరించిన పోలీసులు సాంకేతికంగా విచారణ చేపట్టి సంబంధిత సైకిల్ రైడర్‌ను గుర్తించి పోలీస్ స్టేషన్‌కు తీసుకువచ్చారు. అనంతరం గజ్వేల్ టౌన్ ఎస్ హెచ్ ఓ , గజ్వేల్ ట్రాఫిక్ ఎస్ హెచ్ ఓ సమక్షంలో సైకిల్ రైడర్‌కు, అతని తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ నిర్వహించారు. జాతీయ రహదారిపై ప్రమాదకరంగా సైకిల్ నడపడం, స్టంట్లు చేయడం వల్ల సైకిల్ రైడర్ ప్రాణాలతో పాటు ఇతర వాహనదారులు, పాదచారుల ప్రాణాలకు సైతం తీవ్ర ప్రమాదం ఏర్పడే అవకాశం ఉందని పోలీసులు వివరించారు. భవిష్యత్తులో ఎలాంటి ప్రమాదకర రైడింగ్, స్టంట్లకు పాల్పడకుండా రోడ్డు భద్రతా నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని సైకిల్ రైడర్‌కు సూచించారు. అలాగే తమ పిల్లల ప్రవర్తనపై తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ వహించి, రహదారి భద్రతా నిబంధనలు పాటించేలా అవగాహన కల్పించాలని కోరారు.

**ప్రజలకు పోలీసుల విజ్ఞప్తి** జాతీయ రహదారులు, ప్రధాన రహదారులపై ప్రమాదకర డ్రైవింగ్, రైడింగ్, స్టంట్లు చేస్తూ తమతో పాటు ఇతరుల ప్రాణాలను ప్రమాదంలోకి నెట్టవద్దని గజ్వేల్ టౌన్, ట్రాఫిక్ పోలీసులు ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ప్రతి ఒక్కరూ ట్రాఫిక్, రోడ్డు భద్రతా నిబంధనలు పాటించి సురక్షిత ప్రయాణానికి సహకరించాలని కోరారు.

# లక్ష్మీ ప్రసన్న కాలనీ సాయిబాబా ఆలయంలో ఘనంగా వరలక్ష్మీ వ్రతాలు

**మాజీ కౌన్సిలర్ ఉప్పల మెట్టయ్య-పద్మ దంపతులకు ఘన సన్మానం**



గజ్వేల్ ( ప్రశ్న న్యూస్ ) సిద్దిపేట జిల్లా గజ్వేల్ పట్టణంలోని లక్ష్మీ ప్రసన్న కాలనీ సాయిబాబా దేవాలయంలో శ్రావణ మాస మహోత్సవాలు భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. శ్రావణ శుక్రవారం సందర్భంగా ఆలయ కమిటీ ఆధ్వర్యంలో మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని సామూహిక వరలక్ష్మీ వ్రత పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా లక్ష్మీదేవికి ప్రత్యేక అభిషేకాలు, అలంకరణలు నిర్వహించి ధూపదీప నైవేద్యాలు సమర్పించారు. లోకకల్యాణం, కాలనీ ప్రజల ఆయురారోగ్యాలు, సుఖసంతోషాల కోసం ప్రత్యేక పూజలు నిర్వహించినట్లు ఆలయ నిర్వాహకులు తెలిపారు. మహిళలు భక్తిశ్రద్ధలతో వరలక్ష్మీ వ్రతం ఆచరించి అమ్మవారి ఆశీస్సులు పొందారు. మెట్టయ్య–పద్మ దంపతులకు ఘన సన్మానంవరలక్ష్మీ వ్రత పూజా కార్యక్రమాల సందర్భంగా గజ్వేల్ మాజీ కౌన్సిలర్ ఉప్పల మెట్టయ్య–పద్మ దంపతుల వివాహ వార్షికోత్సవ వేడుకలను ఆలయ ప్రాంగణంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి గజ్వేల్–ప్రజ్ఞాపూర్ మున్సిపల్ మాజీ చైర్మన్ రాజమౌళి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మెట్టయ్య–పద్మ దంపతులను శాలువాతో ఘనంగా సన్మానించి వివాహ వార్షికోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. వరలక్ష్మీ దేవి ఆశీస్సులతో దంపతులు నూరేళ్లు ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో జీవించాలని రాజమౌళి ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, కొమరవెల్లి ఆలయ డైరెక్టర్ నంగునూరి సత్యనారాయణ, కైలాస ప్రభాకర్, ఎర్రం శ్రీనివాస్, దొంతుల సత్యనారాయణ, కొత్త గోవర్ధన్, సిద్ధి రామచంద్రం, కల్లూరి సత్యనారాయణ, కైలాస ప్రశాంత్‌తో పాటు భక్తులు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

# వెలగని స్ట్రీట్ లైట్లు.. చీకట్లో నగరం

- మూడు మున్సిపల్ కమిషనర్ల పరిధిలో నిర్వహణ గాలికేనా.?

- అధికారుల సమీక్ష ఎక్కడ.? పర్యవేక్షణ అసలే లేదు - ప్రభుత్వం కోట్లు ఖర్చు చేస్తున్న అధికారుల నిర్లక్ష్యంతో వెలగని స్ట్రీట్ లైట్లు

(గౌటి రామకృష్ణ - ప్రశ్న న్యూస్ బ్యూరో-9394334646)





గ్రేటర్ హైదరాబాద్ నగరంలో రాత్రివేళ రహదారులపై వెలుగు ఉండాల్సింది పోయి చీకట్లు అలుముకుంటున్నాయి. మూడు మున్సిపల్ కమిషనర్ల పరిధిలో వీధి దీపాల నిర్వహణపై పర్యవేక్షణ కొరవడటంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రధాన రహదారులు, కాలనీలు, అంతర్గత వీధుల్లో అనేక స్ట్రీట్ లైట్లు వెలగకపోవడంతో నగరవాసులు అధికారుల తీరుపై మండిపడుతున్నారు.

### ఎల్ఈడీ లైట్లు మసకబారుతున్నా పట్టించుకునేవారే లేరు

నగరాన్ని ఆధునికీకరిస్తామంటూ ఏర్పాటు చేసిన ఎల్ఈడీ వీధి దీపాల పరిస్థితి దారుణంగా మారుతోంది. కొన్ని దీపాలు పూర్తిగా వెలగకపోగా, మరికొన్ని మసకబారిన వెలుతురుతో దర్శనమిస్తున్నాయి. లక్షలాది రూపాయలు ఖర్చు చేసి ఏర్పాటు చేసిన లైట్ల నిర్వహణపై ఉన్నత అధికారులు ఎంతమాత్రం దృష్టి పెట్టడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి.

### రోడ్లు సగం వెలుగు.. సగం చీకటి

రాత్రి వేళ నగర రహదారుల పరిస్థితి సగం వెలుగు.. సగం చీకటి అన్నట్టుగా తయారైంది. ఒకటి రెండు లైట్లు వెలిగినా మధ్యలో వరుసగా లైట్లు పనిచేయకపోవడంతో రహదారులు చీకటిమయంగా మారుతున్నాయి. ముఖ్యంగా మలుపులు, కూడళ్లు, అంతర్గత రోడ్ల వద్ద పరిస్థితి మరింత ప్రమాదకరంగా ఉంటుందని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

### ఫిర్యాదులు ఎన్నో.. పరిష్కారం మాత్రం శూన్యం

మున్సిపల్ శాఖ లోని ప్రతి విభాగంలో ప్రజల నుండి అనేక ఫిర్యాదులు వస్తున్న వాటిని పరిష్కరిస్తున్న దాఖలాలు లేవన్న ఆరోపణలు చాలా ఉన్నాయి.
వీధి దీపాలు పనిచేయడం లేదని ప్రజలు మున్సిపల్ అధికారులకు ప్రజలు ఫిర్యాదులు చేస్తున్నా సమస్యకు శాశ్వత పరిష్కారం కనిపించడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఫిర్యాదులపై వెంటనే స్పందించి వీధి దీపాలను బాగు చేయాల్సిన అధికారులు పూర్తి నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారనే విమర్శలు వస్తున్నాయి. సమస్య పునరావృతం అవుతున్నా శాశ్వత పరిష్కారానికి చర్యలు తీసుకోవడం లేదని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

### ప్రాబ్లం రిసాల్వ్డ్.. కానీ చీకట్లు మాత్రం అలాగే

అధికారుల బాధ్యతారాహిత్యం పై అత్యంత తీవ్రమైన ఆరోపణలు ఫిర్యాదుల పరిష్కార విధానంపైనే వస్తున్నాయి. సమస్య పరిష్కరించకుండానే 'ప్రాబ్లం రిసాల్వ్డ్' అంటూ ఫిర్యాదుదారులకు ఫోన్ మెసేజ్ లు పంపుతున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. మెసేజ్‌లో సమస్య పరిష్కారమైనా.. క్షేత్రస్థాయిలో మాత్రం అదే చీకటి పరిస్థితి కొనసాగుతోందని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

### చీకట్లో పాదాచారుల, వాహనదారుల అవస్థలు

కాలనీలు, బస్తీలు, రహదారులపై వీధి దీపాలు వెలగకపోవడంతో రాత్రివేళ వాహనదారులకు, పాదాచారులకు తీవ్ర ఇబ్బందులు తప్పడం లేదు. గుంతలు, మలుపులు, రోడ్డు పక్కన ఉన్న అడ్డంకులు కనిపించక ప్రమాదాల ముప్పు పెరుగుతోంది. ముఖ్యంగా ద్విచక్ర వాహనదారులు చీకటి రహదారులపై ప్రయాణించేందుకు భయపడుతున్నారు. దానితోపాటు పాదచారులకు మరింత కష్టాన్ని తెచ్చిపెడుతున్నాయి. రోడ్లపై వెలుతురు లేకపోవడంతో పాదచారుల పరిస్థితి మరింత దారుణంగా మారింది. వృద్ధులు, మహిళలు, పిల్లలు రాత్రివేళ రోడ్లపై వెళ్లాలంటే అనేక ఇబ్బందులు పడుతున్నారు. చీకటి ప్రాంతాల్లో భద్రతపై ఆందోళన వ్యక్తమవుతోంది. ప్రజల ప్రాణాలు, భద్రతకు సంబంధించిన అంశాన్ని మున్సిపల్ అధికారులు ఇంత నిర్లక్ష్యంగా చూడటంపై తీవ్ర విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

### అధికారుల పర్యవేక్షణ ఎక్కడ.? బాధ్యత ఎవరిది.?

మూడు మున్సిపల్ కమిషనర్ల పరిధిలో వీధి దీపాల నిర్వహణపై సమర్థవంతమైన పర్యవేక్షణ ఎందుకు లేదన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి. పనిచేయని లైట్లను గుర్తించేందుకు ప్రత్యేక తనిఖీలు చేపట్టాల్సి ఉన్నా ఆ దిశగా చర్యలు కనిపించడం లేదని ప్రజలు మండిపడుతున్నారు. కాగితాలపై పనులు పూర్తయినట్లు చూపించడం కాకుండా క్షేత్రస్థాయిలో పరిస్థితిని పరిశీలించాలని డిమాండ్ చేస్తున్నారు. ప్రజల మౌలిక వసతుల్లో అత్యంత ప్రాథమికమైన వీధి దీపాల వెలుగులను కూడా సక్రమంగా అందించలేకపోతే నగర అభివృద్ధి మాటలు ఎలా నిజమవుతాయని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. పన్నులు చెల్లిస్తున్న తమకు కనీస సౌకర్యం కల్పించడంలో మున్సిపల్ శాఖ విఫలమవుతోందని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

### మెసేజ్‌ల్లో కాదు.. రోడ్లపై వెలుగు కావాలి

ఇప్పటికైన అధికారులు స్పందించి నగరవ్యాప్తంగా పనిచేయని వీధి దీపాలపై ప్రత్యేక సర్వే నిర్వహించాలి. మసకబారిన ఎల్ఈడీలను మార్చి, ప్రతి ఫిర్యాదును క్షేత్రస్థాయిలో పరిశీలించి పరిష్కరించిన తర్వాతే 'రిసాల్వ్డ్'గా నమోదు చేయాలి. ప్రజలకు కావాల్సింది ఫిర్యాదు పరిష్కారమైందంటూ వచ్చే తప్పుడు సందేశాలు కాదు. రాత్రివేళ రోడ్లపై కనిపించే నిజమైన వెలుగు. అధికారులు ఇప్పటికైనా బాధ్యతగా వ్యవహరించి నగరాన్ని చీకట్ల నుంచి బయటకు తీసుకురావాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

# బాలికల హాస్టల్ నుంచి దుర్గంధం..

# అధికారుల మౌనం

- గోడ కూలినా.. పైపులు పగిలినా పట్టించుకోరా.?

- మురుగునీటితో నరకం.. విద్యార్థినుల ఆరోగ్యంపై నిర్లక్ష్యం



**ఏటూరునాగారం ( ప్రశ్న న్యూస్)** మండల కేంద్రంలోని తాళ్లగడ్డ బాలికల ఆశ్రమ పాఠశాలలో మౌలిక సదుపాయాల నిర్వహణ అధ్వానంగా మారింది. వందలాది మంది బాలికలు విద్యనభ్యసిస్తూ, వసతి పొందుతున్న ప్రాంగణంలో గోడ కూలిపోయి, డ్రైనేజీ పైపులు పగిలిపోయినా అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు తీవ్రంగా వినిపిస్తున్నాయి. పగిలిన పైపుల నుంచి మురుగునీరు బయటకు రావడంతో చుట్టుపక్కల ప్రాంతమంతా దుర్గంధభరితంగా మారిందని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ దుర్వాసన పక్కనే ఉన్న ఇళ్లలోకి చేరుతుండటంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని అధికారులు వెంటనే సమస్యను తీర్చాలని కోరుతున్నారు.

### కూలిన గోడ.. కారుతున్న మురుగు

స్థానికుడు కందకట్ల సతీష్ తెలిపిన వివరాల ప్రకారం ఆశ్రమ పాఠశాల ఆవరణలోని గోడ కొంతకాలంగా కూలిపోయి ఉన్నప్పటికీ దాని మరమ్మతులపై అధికారులు దృష్టి సారించలేదు. దీనికితోడు డ్రైనేజీ పైపులు పగిలిపోవడంతో మురుగునీరు బయటకు వచ్చి పరిసరాలను పూర్తిగా కలుషితం చేస్తోందని, మురుగు నిల్వల కారణంగా దోమలు, ఈగలు విజృంభిస్తున్నాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

### ఫిర్యాదులు చేసినా.. ఫలితం శూన్యం

సమస్యను పలుమార్లు బాలికల ఆశ్రమ పాఠశాల వార్డెన్ లింగయ్య దృష్టికి తీసుకెళ్లినా అసలు పట్టించుకోలేదని సతీష్ ఆరోపించారు. కూలిన గోడను పునర్నిర్మించాలని, పగిలిన డ్రైనేజీ పైపులను వెంటనే బాగు చేయాలని కోరినా స్పందన కనిపించలేదన్నారు. ఐటీడీఏ ఇంజనీరింగ్ అధికారులు, విద్యాశాఖ అధికారులకు సైతం ఫిర్యాదు చేసినప్పటికీ సమస్య పరిష్కారానికి అసలు చర్యలు తీసుకోకపోవడం అధికారుల



నిర్లక్ష్యానికి నిదర్శనమని స్థానికులు మండిపడుతున్నారు. స్థానిక ఎమ్మెల్యే ఈ సమస్యపై వెంటనే స్పందించి సమస్యలు తీర్చాలని కోరుతున్నారు.

### విద్యార్థినుల ఆరోగ్యంతో చెలగాటమా.?

బాలికల ఆశ్రమ పాఠశాలలో వందలాది మంది విద్యార్థినులు ఉంటున్న నేపథ్యంలో పరిసరాల పరిశుభ్రత విషయంలో అధికారులు మరింత అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉంది. కానీ మురుగునీరు, దుర్గంధం, దోమల సమస్యలతో విద్యార్థినుల



ఆరోగ్యానికి ముప్పు ఏర్పడే పరిస్థితి నెలకొనడం ఆందోళన కలిగిస్తోంది. దానితోపాటు స్థానికులకు చాలా ఇబ్బంది కలుగుతుందని పారిశుధ్య నిర్వహణలో ఇంతటి నిర్లక్ష్యం కొనసాగితే చిన్నారులు అనారోగ్యానికి గురయ్యే ప్రమాదం ఉందని తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

### అధికారులు ఇప్పటికైనా కళ్లు తెరవాలి

ప్రభుత్వం ఆశ్రమ పాఠశాలల్లో విద్యార్థులకు మెరుగైన వసతి, పరిశుభ్రమైన వాతావరణం కల్పించేందుకు ప్రభుత్వం నిధులు వెచ్చిస్తున్నా క్షేత్రస్థాయిలో పరిస్థితులు మాత్రం అందుకు భిన్నంగా ఉన్నాయని స్థానికులు విమర్శిస్తున్నారు. అధికారులు కాగితాలపై కాకుండా క్షేత్రస్థాయిలో పరిశీలన చేపట్టి కూలిన గోడను వెంటనే నిర్మించడంతో పాటు పగిలిన డ్రైనేజీ పైపులను మరమ్మతు చేయాలి. మురుగునీటిని తొలగించి, ప్రాంగణాన్ని శుభ్రపరచాలి. విద్యార్థినుల ఆరోగ్యంతో చెలగాటం ఆడకుండా జిల్లా కలెక్టర్, ఉన్నతాధికారులు తక్షణమే స్పందించి సమస్యలను పూర్తిస్థాయిలో నిర్లక్ష్యం చేసిన అధికారులు, వార్డెన్ పై చర్యలు తీసుకోవాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

# చెప్పాల్సింది కమిటీకి చెప్పా.. సీఎం వచ్చాక మాట్లాడతా

- కొండా సురేఖ ఇంట్రెస్టింగ్ కామెంట్స్



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) తన కుమార్తె సుస్మిత చేసిన వ్యాఖ్యల నేపథ్యంలో కాంగ్రెస్ క్రమశిక్షణ కమిటీ జారీ చేసిన షోకాజ్ నోటీసుపై తెలంగాణ మంత్రి కొండా సురేఖ స్పందించారు. ఈ విషయంపై తాను చెప్పాల్సింది ఇప్పటికే క్రమశిక్షణ కమిటీకి వివరించానని, ప్రస్తుతం మీడియా ముందు మాట్లాడేదేమీ లేదని ఆమె స్పష్టం చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విదేశీ పర్యటన ముగించుకుని తిరిగి వచ్చిన తర్వాత అన్ని విషయాలపై స్పందిస్తానని ఆమె తెలిపారు. వరంగల్ జిల్లా గీసుకొండలో మంత్రి కొండా సురేఖ కుమార్తె సుస్మిత చేసిన వ్యాఖ్యలు పార్టీలో తీవ్ర దుమారం రేపిన విషయం తెలిసిందే. ముఖ్యంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని ఉద్దేశించి చేసిన విమర్శలపై పార్టీ నాయకత్వం తీవ్రంగా పరిగణించింది. ఈ క్రమంలోనే క్రమశిక్షణ కమిటీ కొండా సురేఖకు షోకాజ్ నోటీసు జారీ చేసింది. దీనిపై సురేఖ ఇప్పటికే కమిటీకి లిఖితపూర్వక వివరణ ఇచ్చారు. తన కుమార్తె వ్యాఖ్యలు పూర్తిగా వ్యక్తిగతమని, వాటికి తనను బాధ్యురాలిని చేయవద్దని ఆమె ఆ లేఖలో కోరినట్లు సమాచారం. అయితే, ఈ వ్యవహారాన్ని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో పాటు కాంగ్రెస్ అధిష్ఠానం కూడా అత్యంత తీవ్రంగా పరిగణిస్తున్నట్లు తెలుస్తోంది. పార్టీ అంతర్గత వర్గాల్లో ఈ అంశంపై విస్తృత చర్చ జరుగుతోంది. కేవలం నోటీసులతోనే సరిపెట్టకుండా, క్రమశిక్షణా చర్యలు మరింత కఠినంగా ఉండే అవకాశం ఉందనే ప్రచారం సాగుతోంది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తిరిగి వచ్చిన తర్వాత ఈ వివాదంపై పూర్తి స్పష్టత వచ్చే అవకాశం ఉంది.

# సున్నం చెరువు రూపురేఖలు మార్చేస్తున్న హైడ్రా

- కబ్జాలు తొలగించి చెరువును 14 నుంచి 30.5 ఎకరాలకు విస్తరణ



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) హైదరాబాద్ నగరంలోని సున్నం చెరువు రూపురేఖలు సమూలంగా మారిపోతున్నాయి. ఒకప్పుడు మురికికూపంగా, దుర్వాసనతో అల్లాడిన ఈ చెరువును 'హైడ్రా' సుందర సరోవరంగా తీర్చిదిద్దుతోంది. త్వరలోనే ఈ చెరువును ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేతుల మీదుగా ప్రారంభించేందుకు అధికారులు విస్తృత ఏర్పాట్లు చేస్తున్నారు. ఒకవైపు బోరబండ బస్తీ, మరోవైపు ఐటీ కారిడార్ మధ్య ఉన్న ఈ చెరువు గతంలో ఆక్రమణల కారణంగా కేవలం 14.20 ఎకరాలకు కుంచించుకుపోయింది. అయితే, హైడ్రా అధికారులు నివాస గృహాలను ఏమాత్రం ప్రభావితం చేయకుండానే, కేవలం కబ్జాలను తొలగించి చెరువును తిరిగి 30.5 ఎకరాలకు విస్తరించారు. చెరువులోకి మురుగునీరు చేరకుండా ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టడంతో పాటు, సుమారు 3 మీటర్ల మేర పేరుకుపోయిన ప్లాస్టిక్ వ్యర్థాలను పూర్తిగా తొలగించారు. ఫలితంగా దుర్వాసన మాయమై, పరిసర ప్రాంత ప్రజలకు ఉపశమనం లభించింది.చెరువు ఆవరణలోని ఆంజనేయ స్వామి ఆలయ పునరుద్ధరణ పనులను కూడా హైడ్రా చేపట్టింది. ఆలయ కమిటీ ప్రతినిధుల సూచనల మేరకు గోపురం, ప్రదక్షిణ మార్గం, భక్తులు కోసం మార్బుల్ గెజిబో వంటి అత్యాధునిక వసతులు కల్పిస్తున్నారు. కాగా, ఈ ఆలయాన్ని తొలగిస్తున్నారంటూ కొందరు సాగిస్తున్న దుష్ప్రచారాన్ని ఆలయ కమిటీ ప్రతినిధులు తీవ్రంగా ఖండించారు. ప్రభుత్వ అభివృద్ధి పనులను తాము స్వాగతిస్తున్నామని వారు స్పష్టం చేశారు. చెరువు చుట్టూ వాకింగ్ ట్రాక్, ఓపెన్ జిమ్, చిన్నారుల కోసం క్రీడా స్థలాలు, పచ్చదనంతో కూడిన ఆహ్లాదకర వాతావరణాన్ని అభివృద్ధి చేస్తున్నారు. వీటితో పాటు బోటింగ్ సౌకర్యం, సోలార్ లైటింగ్, పటిష్ఠమైన ఫెన్సింగ్ పనులు శరవేగంగా సాగుతున్నాయి. ఇదే సమయంలో చెరువు ఎఫ్‌టీఎల్ పరిధిలో నివసిస్తున్న నిరుపేదలకు ముఖ్యమంత్రి చేతుల మీదుగా డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు పంపిణీ చేసేందుకు ప్రభుత్వం ప్రణాళికలు సిద్ధం చేసింది.

### చిన్నారెడ్డిని సస్పెండ్ చేయండి.. ఖర్గేకు ఎమ్మెల్యే మేఘారెడ్డి ఫిర్యాదు!



**న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్)** తెలంగాణ కాంగ్రెస్‌లో అంతర్గత విభేదాలు మరోసారి బయటపడ్డాయి. రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు, సీనియర్ నేత జి.చిన్నారెడ్డిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతూ వనపర్తి ఎమ్మెల్యే టి. మేఘారెడ్డి నేరుగా ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేకు ఫిర్యాదు చేశారు. పార్టీ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతున్న చిన్నారెడ్డిని వెంటనే సస్పెండ్ చేయాలని ఆయన డిమాండ్ చేశారు.శుక్రవారం న్యూఢిల్లీలో తన మద్దతుదారులతో కలిసి ఖర్గేను కలిసిన మేఘారెడ్డి.. చిన్నారెడ్డి పార్టీకి నష్టం కలిగించేలా మాట్లాడుతున్నారని వినతిపత్రం సమర్పించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ, తమ ఫిర్యాదుపై ఖర్గే సానుకూలంగా స్పందించారని, నివేదిక ఇవ్వాలని తన కార్యాలయాన్ని ఆదేశించినట్లు తెలిపారు. ఇప్పటికే టీపీసీసీ క్రమశిక్షణ కమిటీకి అన్ని ఆధారాలు ఇచ్చామని, ఆ కమిటీ చిన్నారెడ్డికి షోకాజ్ నోటీసు జారీ చేసిందని వివరించారు.ఇటీవల వనపర్తి జిల్లా గోపాల్‌పేటలో జరిగిన ఓ కార్యక్రమంలో చిన్నారెడ్డి చేసిన వ్యాఖ్యలు ఈ వివాదానికి కారణమయ్యాయి. 2023 ఎన్నికల్లో డబ్బు కారణంగానే తనకు టికెట్ రాలేదని, అధిష్ఠానం, సీఎం రేవంత్ రెడ్డి, స్థానిక ఎమ్మెల్యేపై ఆయన తీవ్ర ఆరోపణలు చేశారు. పార్టీలో ఉన్నా భరించలేకపోతున్నామని, మరో జీవన్‌రెడ్డిలా తిరుగుబాటు చేయాల్సి వస్తుందని హెచ్చరించారు. ఈ వ్యాఖ్యలను తీవ్రంగా పరిగణించిన పార్టీ క్రమశిక్షణ కమిటీ ఆయనకు నోటీసులు పంపింది.ఈ పరిణామాల నేపథ్యంలో చిన్నారెడ్డిని ప్రణాళికా సంఘం ఉపాధ్యక్ష పదవి నుంచి తొలగించేందుకు అధిష్ఠానం నిర్ణయం తీసుకున్నట్లు విశ్వసనీయ వర్గాల సమాచారం. మంత్రి కొండా సురేఖతో పాటు ఆయనపైనా చర్యలు ఉండే అవకాశం ఉందని తెలుస్తోంది. సీఎం రేవంత్ రెడ్డి ఆగస్టు 23న విదేశీ పర్యటన ముగించుకుని తిరిగి వచ్చాక దీనిపై అధికారిక ఉత్తర్వులు వెలువడొచ్చని తెలుస్తోంది.

Printed, Published & Owned by "Gouti Bala Sai Tilak" and Published at H.no : 12-13-1282, Flat No : 407, Mehtab Arcade, Tarnaka Main Road, Opp.Ganesh Temple, Secunderabad - 500017, Telangana State. Printed at "Gowrish Offset Printers". H.No : 3-4-353, Barkatpura, Hyderabad-500027. Telangana State. Editor : "Vempati Vijay Kumar". "RNI No: TELTEL/2021/80267". Email : prajaprashna@gmail.com. Cell No : 9494055588